అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం 24-12-2023
సంపుటి : 9 సంచిక : 303
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

సంఘ్ సన్నిహితులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు!

పక్కదారి పడుతున్న నియామక ప్రక్రియ

- అధ్యాపకులు, ఎంపీల ఆగ్రహం

సంఘ్ పరివార్‌కు సన్నిహితంగా ఉండే అభ్యర్థులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కట్టబెట్టేందుకు వీలుగా ఢిల్లీ యూనివర్సిటీలో నియామక ప్రక్రియ చేపట్టిందని పలు విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, పలువురు ఎంపీలు ఆరోపించారు.



వివరాలు 11లో..

28 నుంచి మరో రెండు గ్యారెంటీలు

మహిళలకు రూ 2,500 ఆర్థిక సాయం

- రూ.500కే గ్యాస్ సిలిండర్
- ధరణి పోర్టల్‌పై అభిప్రాయాల సేకరణ
- ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ అమలుపై సమీక్ష
- నేటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం దిశా నిర్దేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పనుంది. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నది. అందులో మరో గ్యారంటీ అయిన 'గృహలక్ష్మి పథకం'పై ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న కలెక్టర్ల సమావేశంలో కీలక ప్రకటన చేయనున్నట్టు తెలిసింది. గృహలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ. 500కే గ్యాస్‌సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈనెల 28న కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గృహలక్ష్మి పథకం అమలుపై సీఎం కీలక ప్రకటన చేయనున్నారు. మహిళలకు రూ. 2,500 ఇస్తామనే హామీ అమలుపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది. లబ్దిదారుల ఎంపిక, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై కలెక్టర్లకు సీఎం స్పష్టత ఇవ్వనున్నారు. రెండు పథకాలకు ఎంత ఖర్చు అవుతుందనే విషయాన్ని ఇప్పటికే అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చర్చించినట్టు తెలిసింది. గ్యాస్‌సిలిండర్ సబ్సిడీ కోసం ఇప్పటికే వినియోగదారులు గ్యాస్ ఎజెన్సీల వద్ద కేవైసీ కోసం బారులు ...11లో

మిమిక్రీ నేరమా?

సభాధ్యక్షుడిని అనుకరిస్తే కుల దూషణ అవుతుందా?

- హాస్యానికి వక్రభాష్యం చెబుతున్న కేంద్ర ప్రభుత్వం
- అదే పని మోడీ చేస్తే తప్పు కాదా?

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం హాస్య చతురతను కూడా అర్థం చేసుకోలేకపోతోంది. రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌ను అనుకరిస్తూ తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ చేసిన మిమిక్రీ బీజేపీకి ఆగ్రహం తెప్పించింది. బీజేపీ నేతలందరూ ఆయనపై ముప్పేట దాడి చేశారు. పరిశీలకులు మాత్రం బెనర్జీ చర్యను నిరసనగానే చూశారు. మోడీ ప్రభుత్వం మాత్రం దీనిని జాట్లకు జరిగిన అవమానంగా చిత్రీకరించింది.

వాస్తవానికి ప్రధాని నరేంద్ర మోడీ గతంలో అనేక సందర్భాలలో ప్రత్యర్థులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఉదాహరణకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఉద్దేశించి 'దీదీ ఓ దీదీ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను ఎవరు మరిచిపోతారు? కాంగ్రెస్ నేత శశిథరూర్ భార్య సునంద పుష్కర్‌ను ఉద్దేశించి 'యాభై కోట్ల రూపాయల గర్ల్‌ఫ్రెండ్' అంటూ చేసిన వ్యాఖ్యను ఎవరు మరువగలరు?

మోడీ తన ఎన్నికల ప్రచార సభలలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని 'పప్పు' అని అనేక



సందర్భాలలో ఎత్తిపొడిచారు. ప్రతిపక్ష నాయకులను వెక్కిరిస్తూ, అనుకరిస్తూ పార్లమెంటులో వ్యాఖ్యలు చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీని కూడా ఆయన వదిలిపెట్టలేదు. అన్సారీ పాలనాపరమైన అనుభవమంతా మైనారిటీ వ్యవహారాలు, ముస్లిం ప్రపంచానికే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఓ దౌత్యవేత్తగా అన్సారీ రికార్డును ఆయన విస్మరించారు. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు పాఠశాలల్లో కన్పిస్తాయి. అక్కడ బలవంతులైన విద్యార్థులు బలహీనుల్ని ర్యాగింగ్ చేయడం పరిపాటి. ధన్‌కర్‌ను బెనర్జీ అనుకరించడాన్ని సభ్యులందరూ ఆస్వాదిస్తుంటే రాహుల్ గాంధీ తన ఫోన్‌లో ఆ దృశ్యాన్ని బంధించారు. అయితే పలు వార్తా ఛానల్స్ దీనిని తప్పుగా అర్థం చేసుకున్నాయి. రాహుల్ తాను తీసిన వీడియోను సామాజిక మాధ్యమాలలో షేర్ చేసి, తద్వారా అధ్యక్ష స్థానాన్ని మరింత అవమానించేందుకు ప్రయత్నించారంటూ అవి వాస్తవాన్ని వక్రీకరించాయి. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై హోం మంత్రి ఎందుకు ప్రకటన చేయలేదు? భద్రతా వైఫల్యాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని, విచారణకు ఆదేశించిందని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ఇద్దరూ మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. అదేమిటంటే విచారణ కమిటీకి సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనీష్ ...11లో

> 'ఎంపీలు కూర్చున్నప్పుడు నేను వీడియో తీశాను. అది నా ఫోన్‌లోనే ఉంది. మీడియా దానిని చూపించింది. మా ప్రతిపక్ష సభ్యులు 150 మందిని సభ నుండి గెంటేశారు. దానిపై మీడియాలో ఎలాంటి చర్చ జరగలేదు. మా ఎంపీలు కలత చెంది బయట కూర్చున్నారు. కానీ మీరేమో మిమిక్రీ గురించి చర్చిస్తున్నారు ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ల మధ్యే వివాదాస్పద నూతన చట్టాలపై ఎలాంటి చర్చ జరపకుండా సభ ఆమోదించింది. తనకు ఉన్న మందబలాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నీరుకార్చింది. భారత పార్లమెంట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో మెజారిటీ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేసింది. లోక్‌సభలో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంలో జవాబుదారీతనం లేకుండా చేసింది. దీనిపైనా మీడియాలో ఏ చర్చా లేదు.
> - రాహుల్ గాంధీ

తక్కువ దూరానికి పల్లెవెలుగు ఎక్కండి

మహిళా ప్రయాణీకులకు టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



టీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణీకులు తక్కువ దూరానికి పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించాల ని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. తక్కువ దూరానికి కూడా ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కడం వల్ల దూరప్రాంత ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నదని శనివారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రయాణీకులు సహకరించాలని కోరారు. కొందరు మహిళలు అనుమతించిన స్టేజీల్లో కాకుండా మధ్యలోనే బస్సులను ఆపమని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారనీ, దీనివల్ల ప్రయాణ సమయం పెరుగుతుందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించిన స్టేజీల్లోనే ఆపడం జరుగుతుందని స్పష్టంచేశారు. దూర ప్రాంత ప్రయాణీకులకు ప్రాధాన్యత ఇచ్చి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రయివేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

నవతెలంగాణ-మెహిదీపట్నం

హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని అంకుర ఆస్పత్రిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అయితే ఆస్పత్రి సిబ్బంది వెంటనే స్పందించి రోగులను బయటకు పంపడంతో ప్రాణ నష్టం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే పిల్లర్ నెంబర్ 68 సమీపంలో ఉన్న అంకుర ఆస్పత్రిలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ క్రమంలో మంటలు పదో అంతస్తు నుంచి ఐదో అంతస్తుకు వ్యాపించాయి. పై అంతస్తులో పెద్దఎత్తున మంటలు ఉండటంతో నిప్పు రవ్వలు గాల్లో ఎగురుతూ కిందకు పడ్డాయి. ఆస్పత్రిలో ఉన్న గర్భిణులు, చిన్నారులు భయాందోళనకు లోనయ్యారు. అయితే మంటలను గమనించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే



రోగులను బయటికి పంపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, జీహెచ్ఎంసి సిబ్బంది అక్కడకు చేరుకుని నాలుగు ఫైర్ ఇంజిన్ల సాయంతో గంటపాటు తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రి నేమ్ ...11లో

క్యాబ్ డ్రైవర్లకు టీహబ్ ద్వారా ప్రత్యేక యాప్

ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం

- గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల యాక్సిడెంటల్ పాలసీ..: సీఎం రేవంత్ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలవరీ బాయ్‌లు, ఆటో డ్రైవర్ల (గిగ్ వర్కర్లు)కోసం రూ.5 లక్షల యాక్సిడెంటల్ పాలసీ తీసుకురావడంతోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. నాలుగు నెలల క్రితం స్విగ్గి డెలివరీ బాయ్‌ను కుక్క తరిమితే అతడు భవనంపై నుంచి పడి మతి చెందిన ఘటనలో కుటుంబం వివరాలను సేకరించి సీఎం సహాయనిధి నుంచి ఆ కుటుంబానికి రూ. 2 లక్షలు అందించాలంటూ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్యాబ్ డ్రైవర్ల కోసం ఓలా మాదిరిగా టీ హబ్ ద్వారా ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీనిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో క్యాబ్



డ్రైవర్లు, ఫుడ్ డెలవరీ బాయ్‌లు, ఆటో డ్రైవర్ల సమస్యలను తెలుసుకోవటానికి నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటుమని ...11లో

ఊర్లు విషమయం...

ఇథనాల్ కంపెనీ వ్యర్థాలతో పర్యావరణ విధ్వంసం

- నీరు, గాలి, భూమి సర్వం కాలుష్యమయం
- మూగజీవాల మృత్యువాత ... ప్రజలకు ప్రాణాంతక వ్యాధులు



ఆ ఊరిలో అడుగు పెట్టడానికి కొద్దిదూరం నుంచే ముక్కు మూసుకోవాలి. కండ్లు మంటలు పుడతాయి. నీటిలో కాళ్లు పెట్టినా, నీళ్లు ముట్టుకున్నా దద్దుర్లు వస్తుంటాయి. నీళ్లు తాగిన మూగజీవాలు బతికే అవకాశం తక్కువ. గాలి, నీరు, భూమి సమస్తం కాలుష్యమయమై పర్యావరణ దెబ్బతింటోంది. నారాయణపేట జిల్లా మర్రికల్ మండల పరిధిలోని చిత్తనూరు, జిన్నారం, ఎక్లాస్‌పూర్ గ్రామాల పరిస్థితి ఇది. ఇథనాల్ కంపెనీతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై చిత్తనూరు వాసులు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రాంతాన్ని శనివారం నవతెలంగాణ సందర్శించింది. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం తప్ప వారి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావడం లేదని నవతెలంగాణకు చెప్పుకుని వాపోయారు.

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి(పరిపూర్ణం)

ఇథనాల్ ఉత్పత్తి కొరకు కేంద్ర ప్రభుత్వం నారాయణపేట జిల్లా చిత్తనూరు గ్రామ సమీపాన రెండేండ్ల క్రితం 'జూరాల ఆర్గానిక్ ఫార్మా అండ్ ఇండస్ట్రీస్' పేరుతో ఇథనాల్ ఉత్పత్తి ఇండస్ట్రీని పెట్టడానికి అనుమతించింది. ఇథనాల్ ఇండస్ట్రీ పెట్టేందుకు మన్నెంవాగు చుట్టూ ఉన్న వరి పంట పండే భూములతో పాటు అసైన్డ్ భూములను సేకరించారు. అంతా కలిపి 480 ఎకరాల పంటభూములలో ఈ కంపెనీని పెట్టారు. చిత్తనూరు, జిన్నారం, ఎక్లాస్‌పూర్, పర్దీపూర్‌లోని 230 మంది రైతుల నుంచి పంటభూములను కంపెనీ యాజమాన్యం సేకరించింది. ఆధునిక వ్యవసాయం కోసం భూములు కొనుగోలు చేస్తున్నాం.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేవిధంగా పంటలు సాగు



చేస్తాం. ఆధునిక వ్యవసాయం పట్ల అవగాహన పెరగడంతోపాటు రైతు కూలీలకు ఉపాధి లభిస్తుందంటూ తక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా ఉండడంతో రైతులు తమ భూములు అందజేశారు. పెట్రోల్, డీజిల్ తయారీ కోసం ఉపయోగించే లిక్విడ్‌ను ఇథనాల్ కంపెనీలో తయారు చేస్తున్నారు. ఈ కంపెనీకి ప్రతిరోజు 18 లక్షల కిలోల బియ్యం, 24 లక్షల లీటర్ల నీటిని వాడతారు. ఫలితంగా ప్రజలకు భూమి కొరతతో పాటు, నీటికొరత కూడా ఎదురవుతోంది. పైగా మొత్తం పర్యావరణం దెబ్బతిని జీవనమే కష్టమవుతోంది. నిబంధనలను కంపెనీ బేఖాతరు చేసింది. వ్యర్థాలను తగుల బెట్టాల్సిన యాజమాన్యం ఖాళీ ప్రదేశాల్లో పడేయటం, వాగులో కలపడంతో ఆ ప్రాంతమంతా విషతుల్యంగా మారింది. మొదట జీరో కాలుష్యమని చెప్పి ఇప్పుడు 100 శాతం కాలుష్యమయం చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు..

30 కిలోమీటర్ల మేర ప్రభావం

ఈ కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం చుట్టూ 30 కిలోమీటర్ల వరకు ప్రభావం చూపుతోంది. మరికల్ నుంచి ...11లో

> "మా కుమారుడు చరణ్ గ్రామ సమీపంలో ఉండే మన్నెవాగులో ఈత కొట్టడానికి పోయాడు. ఈ వాగులోకి ఇథనాల్ కంపెనీకి చెందిన కాలుష్యం నీరు వస్తుందని తెలియదు. స్నానం చేసి ఇంటికి రాగానే పెయ్యి అంతా బొగ్గలు పుట్టాయి. కండ్లు బైర్లు కమ్మాయి. చేతిలో చిల్లి గవ్వ లేకుంటే మా ఊరి సంఘం వాళ్ల సహకారంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లాం. అక్కడ పట్టకుంటే హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి పోయాం. వేలల్లో ఖర్చు అయ్యింది. కంపెనీ నుంచి ఏమాత్రం సహకారం లేదు."
> **లొడ్డ అంజనేయులు ,చిత్తనూరు**





> "మా గొంతులు పట్టుకుపోతున్నాయి. ఇక్కడి గాలి పీలిస్తే... మాకు అంతులేని రోగాలు వస్తున్నాయి. ఇక్కడి నీరు సైతం విషతుల్యంగా మారింది. వాగులు, చెరువుల నీళ్లు తాగిన మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. గతంలో పదుల సంఖ్యలో గొర్రెలు, గేదెలు చనిపోయాయి. మన్నెవాగులో వదలిన చేపలు క్వింటాళ్ల కొద్ది చనిపోయాయి. ఇప్పుడా కంపెనీ తొలగించకపోతే మేము గ్రామాన్ని ఖాళీ చేయాల్సి వస్తోంది"
> **చింతలయ్య ,చిత్తనూరు గ్రామ యువక మండలి**

ముగిసిన రాష్ట్రపతి శీతాకాలం విడిది

- ఢిల్లీకి ప్రయాణం
- హకీంపేట విమానాశ్రయంలో వీడ్కోలు పలికిన సీఎం, గవర్నర్, మంత్రులు 11లో..



కేయూలో ర్యాగింగ్!

81 మంది విద్యార్థినుల సస్పెన్షన్

- జువాలజీ విభాగంలో వెలుగులోకి..
- ఆ విభాగం సీనియర్ విద్యార్థినులపైనా వేటు!
- జాడలేని యాంటీ ర్యాగింగ్ కమిటీల ఏర్పాటు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కేయూ క్యాంపస్ కాకతీయ యూనివర్సిటీలోని మహిళా హాస్టల్‌లో ర్యాంగింగ్ కొద్ది రోజులుగా చాపకింద నీరులా సాగుతోంది. కామర్స్ విభాగంలో జరిగిన ర్యాగింగ్ ఘటనపై విచారణ సాగుతుండగానే జువాలజీ విభాగంలోనూ సీనియర్లు జూనియర్లను వేధించినట్టు గురువారం వెలుగులోకి వచ్చింది. ఈనెల 18న కామర్స్ విభాగం సీనియర్ విద్యార్థినులు హాస్టల్లో జూనియర్లను ర్యాగింగ్ చేసినట్టు ఓ బాధిత విద్యార్థిని బయటికి చెప్పడంతో విచారణ జరిపిన ప్రొఫెసర్ల బృందం రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావుకు నివేదిక సమర్పించింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు 81 మంది సీనియర్ విద్యార్థినులను వారం రోజులపాటు హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. ఆయా విద్యార్థినులకు సమాచారం కూడా ఇచ్చామని హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తెలిపారు.

జువాలజీ సీనియర్ విద్యార్థినులు 25 మందికి పైగా..

మహిళా హాస్టల్‌లోని జువాలజీ విభాగం సీనియర్లు.. జూనియర్లను ర్యాగింగ్ చేసినట్టు తాజాగా ఆ విభాగాధిపతి ...11లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,490	▲	260
22 క్యారెట్లు	58,200	▲	200
కిలో వెండి	80,500	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	85
రిటైల్ (లైవ్)	రూ.	107
స్కిన్‌తో	రూ.	155
స్కిన్‌లెస్	రూ.	177

పీవీకీర్తిని పెంచేలా పని చేస్తాం

- మాజీ ప్రధాని వర్ధంతిలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కీర్తిని పెంచేలా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. పీవీ 19వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో గల పీవీ ఘాట్ వద్ద శనివారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి పీవీ అని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారినప్పుడు ఆయన సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. 'బంగారాన్ని కుదవ పెట్టి అప్పులు తేవడంపై ఆయన ఒకే మాట చెప్పారు. తెలివైన వాడు సగం ఆస్తిని కుదవపెట్టి అయినా సరే మిగతా ఆస్తిని కాపాడుకుంటారు' అని చెప్పినట్టు వివరించారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి పీవీ అని పీవీ కొనియాడారు. వారికి ఆ భూములను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. వారికి వాటిని పంచేందుకు పీవీ బలమైన పునాదులు వేశారని అన్నారు. పీవీ మన మధ్య లేకపోయినా ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు ఆచరణీయమని తెలిపారు. పీవీ ఘాట్, జైపాల్ రెడ్డి ఘాట్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. వీరిద్దరూ తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారని కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, హిమచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ వాణీదేవితోపాటు ఆయన కుటుంబ సభ్యులు పీవీ జ్ఞానభూమి వద్ద నివాళులర్పించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి, అల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'స్వేదపత్రం' విడుదల నేటికి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, వివిధ రంగాల్లో పురోగతిపై ఆ పార్టీ రూపొందించిన 'స్వేదపత్రం' డాక్యుమెంట్ విడుదల ఆదివారానికి వాయిదా పడింది. తొలుత శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పత్రాన్ని విడుదల చేస్తామంటూ బీఆర్ఎస్ ప్రకటించిన సంగతి విదితమే. అనివార్య కారణాల వల్ల ఆదివారానికి వాయిదా వేస్తున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. ఉదయం 11 గంటలకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'స్వేదపత్రాన్ని' విడుదల చేయనున్నట్టు తెలిపింది.

పీవీకి అన్యాయం చేసిన కాంగ్రెస్ : కేటీఆర్

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లోగల పీవీ ఘాట్‌కు వెళ్లిన కేటీఆర్... అక్కడి పీవీ సమాధిని సందర్శించి, ఘన నివాళులర్పించారు. ఆయన ప్రధాని హోదాలో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్‌తో కలిసి.. అప్పుల్లో కూరుకుపోయిన భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని తెలిపారు. అయితే ఆయన సేవలను గుర్తించని కాంగ్రెస్ పార్టీ...పీవీకి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. దాన్ని సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో పీవీ ఘాట్‌ను నిర్మించాలనీ, ఆయనకు భారతరత్న బిరుదునిచ్చి భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా చరిత్రలో సముచితమైన స్థానాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

జనవరి 6 నుంచి ఓటర్ల నమోదు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కొత్త ఓటర్ల నమోదు, చిరునామాల మార్పు, ఫోటో గుర్తింపు కార్డుల అప్‌గ్రేడ్ తదితర సమస్యల పరిష్కారానికి 2024 జనవరి 6వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఫారం-7 ద్వారా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరు ఫోటో గుర్తింపు కార్డుల్లో ఫోటోలు సరిగా కనిపించకపోవడం, ఫోటోల అప్‌గ్రేడ్, కొత్త గుర్తింపు కార్డుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ నాటికి అన్ని ఫిర్యాదులు, దరఖాస్తుల్ని పరిష్కరించి, ఫిబ్రవరి 6వ తేదీన ఓటర్ల జాబితాల సప్లిమెంటరీల ముద్రణ, 8వ తేదీ తుది ఓటర్ల జాబితాల ముద్రణ చేపట్టాలని కార్యాచరణ ప్రకటించారు. దీనికోసం బూత్ లెవల్ అధికారులను నియమిస్తామనీ, అన్ని పోలింగ్ కేంద్రాల్లో దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఎయిడెడ్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలివ్వండి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎయిడెడ్ విద్యాసంస్థలు, కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులు, గురుకులాల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు నవంబర్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రిస్టమస్ పండుగ సందర్భంలో వేతనాలు రాక పలువురు ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్టమస్ పండుగకు ముందుగానే నవంబర్ వేతనాలను విడుదల చేయాలంటూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నాలుగురోజుల క్రితమే వినతిపత్రం సమర్పించామని గుర్తు చేశారు. అయినప్పటికీ వేతనాలు ఇంకా విడుదల కాలేదని తెలిపారు. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని వేతనాలను విడుదల చేయించాలని వారు కోరారు.

వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన పెరియార్

హేతువాద భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన నేత

సమాజంలో మనుషులంతా సమానమే

- దళితులు భక్తులుగానే కాదు పూజారులు కావాలని ఆకాంక్ష :

ఎస్వీకే వెబినార్‌లో రచయిత్రి వి గీత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హిందూమతంలోని వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా పెరియార్ రామస్వామి నాయకర్ జీవితాంతం పోరాడారని రచయిత్రి వి గీత అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం 'పెరియార్ జీవితం ప్రాసంగికత' అనే అంశంపై వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరియార్ మూఢ విశ్వాసాలను వ్యతిరేకించారని చెప్పారు. హేతువాద భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారని వివరించారు. హిందూమతంలో పుట్టుకతోనే బ్రాహ్మణులు ఎక్కువ, మిగిలిన వారు తక్కువ అనే భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. సమాజంలో మనుషులంతా సమానమేనంటూ ఆయన నినదించారని చెప్పారు. అసమానతలు, అంటరానితనం, కుల వివక్ష పోవాలనీ, ఆత్మగౌరవం ఉండాలని అనేక పోరాటాలు చేశారని వివరించారు. ఈ విషయంలో అంబేద్కర్, పెరియార్ ఆలోచనలు ఒకే విధంగా ఉన్నాయని అన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉండాలని ఆనాడే బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరాడని చెప్పారు. దేవాలయాలను నిర్మించిన బహుజనులు, దళితులు ఆ తర్వాత అందులోకి ప్రవేశం ఉండబోదని చెప్పడం సరైంది కాదన్నారు. దళితులు భక్తులుగానే కాకుండా పూజారులుగా ఉండాలంటూ ఆకాంక్షించారని అన్నారు. దేవాలయాల ఆస్తులు బడులు, ఆస్పత్రుల నిర్మాణానికి, సామాజిక అవసరాలకు వినియోగించాలని సూచించారు. స్త్రీ, పురుషుల మధ్య అంతరాలు, ఆధిపత్యం పోవాలన్నారని గుర్తు చేశారు. పురుషాధిక్య సమాజంలో మహిళలకు సమాన హక్కులుంటేనే సమసమాజం వస్తుందన్నారని వివరించారు. బ్రాహ్మణులు సంప్రదాయాల పేరుతో పెండ్లి, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు పెట్టేవారనీ, వారి ఆధిపత్యాన్ని ప్రదర్శించే వారని అన్నారు. రాహు కాలంలో పెండ్లి చేసేవారనీ, కులాంతర, వితంతు వివాహాలను ప్రోత్సహించారని చెప్పారు. ఆ కుటుంబాలు ప్రశాంతంగా జీవించిన ఉదాహరణలను సమాజం దృష్టికి తెచ్చేవారని అన్నారు. దేవుడు అంటే విశ్వాసం ఎక్కువుంటుందనీ, దాన్ని చెదరగొట్టేందుకు వినాయకుడి విగ్రహాలను పగలగొట్టేవారని చెప్పారు. మతం, దేవుడు గురించి ప్రస్తుతం ఏం మాట్లాడినా దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. కానీ ఆనాడే వాటి గురించి శాస్త్రీయంగా, హేతుబద్ధంగా పెరియార్ మాట్లాడారని గుర్తు చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో సమాజంలో పురోభివృద్ధి సాధిస్తున్నదని చెప్పారు. అయితే ఐఐటీ ఖరగ్‌పూర్ తాజా క్యాలెండర్‌లో శాస్త్రీయ విజ్ఞానాన్ని చెరిపేసే విధంగా పురాణాల గురించి ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారిందన్నారు. మహిళా రెజ్లర్లు పోరాడినా వారికి న్యాయం దక్కలేదన్నారు. దేశమంతా ఒకటే జాతి అన్నపుడు పేద, ధనిక తేడా, ఆడ, మగ, కుల,మతాల మధ్య వివక్ష ఎందుకుంటాయని పెరియార్ ప్రశ్నించారని అన్నారు. ప్రతిఒక్కరూ హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఆలోచించాలని కోరారు. ఈనాటికీ పెరియార్ జీవితం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలకు ప్రామాణికంగా ఉంటుందన్నారు. ఆయన ఆలోచనలు ఈ కాలానికీ ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వి గీత ప్రసంగాన్ని ప్రముఖ జర్నలిస్టు కొండూరి వీరయ్య తెలుగులోకి అనువదించారు.

బీడీ అండ్ సిగార్ యాక్ట్ అమలు చేయాలి

కేంద్ర విధానాలతో రోడ్డున బీడీ కార్మికులు

వారి హక్కుల కోసం జనవరి, ఫిబ్రవరి నెలల్లో దేశ వ్యాప్త ఉద్యమం: సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షులు ఏకే పద్మనాభన్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

దేశ వ్యాప్తంగా బీడీ అండ్ సిగార్ యాక్టును అమలు చేయాలనీ, బీడీ కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జనవరి, ఫిబ్రవరి మాసాల్లో దేశవ్యాప్తంగా ఉద్యమం చేయనున్నట్టు సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షులు ఏకే. పద్మనాభన్ చెప్పారు. మూడు రోజులుగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొనసాగిన ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షులు ఏకే పద్మనాభన్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బీడీ పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై చర్చించామన్నారు. ఈ వర్క్ షాపులో 10 రాష్ట్రాలకు చెందిన 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 'యాంటీ వర్కర్స్, యాంటీ నేషన్, యాంటీ పీపుల్ పాలసీ'ని అమలు చేస్తున్నదని విమర్శించారు. మతతత్వ, కార్పొరేట్ శక్తులతో మిళితమైన పాలన దేశంలో నడుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఓవైపు ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మరోవైపు దేశ సహజవనరులను లూటీ చేస్తున్న తీరును ఆయన వివరించారు. బీడీ పరిశ్రమపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు వల్ల లక్షలాది మంది కార్మికుల కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెస్సును ఎత్తివేశారని గుర్తు చేశారు. జీఎస్టీ అధికంగా వేయడం వల్ల బీడీ, సిగార్ పరిశ్రమలు దివాళా తీస్తున్నాయని చెప్పారు. దీంతో కార్మికులకు వారంలో రెండు, మూడు రోజుల పని కూడా దక్కడం లేదని వాపోయారు. నాలుగేండ్లుగా బీడీ కార్మికులకు మెడికల్ బెనిఫిట్స్ అందడం లేదనీ, వారి పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇవ్వడం లేదనీ, సంక్షేమ పథకాలేవీ వర్తింపజేయడం లేదని విమర్శించారు. రానున్న కాలంలో బీడీ కార్మికుల హక్కుల కోసం పోరాటాలను విస్తృతం చేయాలని పద్మనాభన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సమావేశంలో ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేబశిశ్‌రాయ్, తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.గోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ, రాష్ట్ర నాయకులు నూర్జహాన్, పద్మ చౌదరి, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ చికిత్సకు అన్ని ఏర్పాట్లు చేయాలి

అధికారులకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోవిడ్ బాధితుల చికిత్సకు తగిన ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన ఇదే అంశంపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వివిధ ఆస్పత్రుల్లో ఉన్న వెంటిలేటర్‌ల పనితీరును పరిశీలించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బాధితుల చికిత్సకు అవసరమయ్యే ఆక్సిజన్ కన్సన్‌ట్రేటర్లను తక్షణమే ఉపయోగంలోకి తేవాలని చెప్పారు. వివిధ ఆస్పత్రుల్లో వాడుకలో లేని పీఎస్‌ఏ ప్లాంట్లను త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశించారు. వివిధ ఆస్పత్రుల్లో కరోనా వార్డుల్లో అవసరమైన యంత్రాలను, మందులు, డయాగ్నస్టిక్ పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌లు 34, ప్రయివేటు ఆస్పత్రిలో 84 రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతిరోజు 16,500 మందికి ఆర్‌టీపీసీఆర్ ద్వారా శాంపిళ్లను తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్టు మంత్రికి అధికారులు తెలిపారు.. కరోనా వార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. గత రెండు వారాలుగా వివిధ ఆసుపత్రుల్లో ద్వారా ఏర్పాటు చేసిన వార్డుల్లో 6,344 శాంపిళ్లను తీసుకున్నామనీ, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల చివరినాటికి నాలుగు వేల మందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటలకు మీడియాకు కోవిడ్ -19 బులిటెన్ విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్నన్, ఆ శాఖకు చెందిన వివిధ శాఖల విభాగాధిపతులు, గాంధీ, ఉస్మానియా, చెస్ట్, నిలోఫర్ ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్లు, సీడీఎఫ్‌డీ లాబ్‌లు ఇంఛార్జిలు పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలి

- సీఎంకు టిగ్లా లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పి మధుసూదన్‌రెడ్డిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాలని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల సంఘం (టిగ్లా) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య లేఖ రాశారు. మధుసూదన్‌రెడ్డి అక్రమాస్తుల సంపాదనపై 2019లో ఏసీబీ దాడులు జరిగి రెండు నెలలు జైలు జీవితం అనుభవించారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సస్పెన్షన్‌లో ఉన్నారని పేర్కొన్నారు. దౌర్జన్యాలకు, అవినీతికి పాల్పడుతూ అధికారులను బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తున్న మధుసూదన్‌రెడ్డిని ప్రభుత్వ సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించాలని కోరుతూ ఇంటర్ విద్యా కమిషనర్ ఆధారాలతో కూడిన లేఖను ప్రభుత్వానికి ఏప్రిల్‌లో పంపించారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆయన్ను ఎవరూ ఏమీ చేయరన్నట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి తగిన చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

జైలు నుంచి పల్లవి ప్రశాంత్ విడుదల

నవతెలంగాణ-సంతోష్ నగర్

హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియో వద్ద గత ఆదివారం జరిగిన విధ్వంసం కేసులో అరెస్టయిన బిగ్‌బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్ శనివారం జైలు నుంచి విడుదలయ్యాడు. ప్రశాంత్‌కు శుక్రవారం బెయిల్ మంజూరైంది. ప్రశాంత్ శనివారం విడుదలవుతున్నాడని తెలుసుకున్న అతని అభిమానులు, మీడియా హైదరాబాద్ చంచల్‌గూడ జైలు వద్దకు భారీగా చేరుకున్నారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో పల్లవి ప్రశాంత్ జైలు నుంచి బయటకొచ్చి ఎవరికీ కనిపించకుండానే వెళ్లిపోయాడు. అయితే, ప్రశాంత్ ప్రతి నెలా 1, 16వ తేదీల్లో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో హాజరై సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. షరతులు పాటించకపోతే బెయిల్ రద్దు చేస్తామని తెలిపింది.

విద్యార్థుల కోసం ప్రేరణ

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మూడు నెల్ల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గౌరవం-ముందడుగు సాధ్యమని తెలిపారు. శాస్త్రీయ ప్రణాళిక -పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చని వివరించారు. విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలనీ, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. టీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేష్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పదేండ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమ రూపకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్ట్ సంఘం సహకారంతో నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలనీ, వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లలో సంప్రదించాలని తెలిపారు. అనంతరం అతిథులు కార్యక్రమ పోస్టర్లు, బ్యానరు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేణు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్



డాలర్‌తో రూపాయి 85కి తగ్గొచ్చు..

- మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్సీయల్ అంచనా

హైదరాబాద్ : వచ్చే కొత్త ఏడాదిలో రూపాయి మారకం విలువ ఒత్తిడిని ఎదుర్కోవచ్చని.. లోహాలకు డిమాండ్ పెరగొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎంఒఎఫ్ఎస్) అంచనా వేసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 81-85 మధ్య ట్రేడింగ్ కావొచ్చని ఎంఒఎఫ్ఎస్ తన కరెన్సీ, కమోడిటీ ఔట్‌లుక్ 2024లో విశ్లేషించింది. ఆ రిపోర్ట్ ప్రకారం.. ఈక్విటీ, డెట్ విభాగంలో 25 బిలియన్ డాలర్లకు పైగా నగదు ప్రవాహనాలను ఆకర్షించే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా 2024లో ఫెడ్ మూడుసార్లు రేట్లను తగ్గించవచ్చని అంచనా. 2024లో అమెరికా తన అధ్యక్ష ఎన్నికలకు సిద్ధం అవుతోంది. డాలర్‌కు స్వల్ప ప్రతికూలత ఉండటంతో రూపాయి విలువ 81.00 - 85.00 శ్రేణీలో నమోదు కావచ్చు. 2021, 2022తో పోల్చితే 2023లో కమోడిటీలు చాలా సానుకూల ప్రారంభాన్ని కలిగి ఉన్నాయి. లోహాల తీరు ఎక్కువగా చైనాపై ఆధారపడి ఉంటుంది. కొన్ని విభాగాల్లో ఆఫ్‌టేక్ చాలా ఆశాజనకంగా కనిపిస్తోంది. ఇది లోహాల డిమాండ్‌లో పునరుద్ధరణను సూచిస్తుంది.

బిఒబికి చిరిగిన నోట్ల దెబ్బ

- ఆర్‌బిఐ రూ.5 కోట్ల జరిమానా



న్యూఢిల్లీ : బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి)లో చిరిగిన నోట్ల మార్పిడికి సంబంధించిన లావాదేవీల్లో వ్యత్యాసం కనబడింది. దీంతో ప్రభుత్వ రంగంలోని బిఒబికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) భారీ షాక్ ఇచ్చింది. ఈ అంశంలో తమకు ఆర్‌బిఐ రూ.5 కోట్ల జరిమానా విధించినట్లు బిఒబి శుక్రవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. అదే విధంగా చిరిగిన నోట్లలో నకిలీ నోట్లను ఆర్‌బిఐ గుర్తించింది. దీనిపై అదనంగా మరో రూ.2,750 జరిమానా వేసింది.

డిసెంబర్ 18, 20 తేదీల్లో వేర్వేరుగా ఈ జరిమానా విధించినట్లు బిఒబి తెలిపింది. నిబంధనలు పాటించకుండా భారీ మొత్తంలో రుణాలు జారీ చేసినందుకు గత నెలలోనూ ఆర్‌బిఐ రూ.4.35 కోట్ల జరిమానా వేసింది. అదే విధంగా మహారాష్ట్రలోని ఠాణె జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు ఆర్‌బిఐ రూ.2లక్షల జరిమానా విధించింది. ఈ బ్యాంకు తమ డైరెక్టర్లలో ఒకరికి రుణం మంజూరు చేసిన కారణంగా ఈ జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది.

ప్రభుత్వ పాఠశాలకు ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ సాయం



హైదరాబాద్ : ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ మరోమారు తన మానవత దృక్పథాన్ని చాటుకుంది. సమాజంలోని అల్ప వర్గాలకు సాయం చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలకు, విద్యార్థులకు భారీ సాయాన్ని అందించింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని దేవరకొండ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మూడు కంప్యూటర్లు, నిరంతర నీటి సరఫరా కోసం సబ్‌మెర్సిబుల్ పంప్ సెట్, ఆట వస్తువులు, పిల్లలకు బూట్లు, స్టేషనరీ తదితర ఉత్పత్తులను అందించింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రష్మి సిన్హా, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఎస్‌బిఐ లేడిస్ క్లబ్‌కు ఆ పాఠశాల హెడ్ మాస్టర్ డి కిశోర్ ధన్యవాదాలు తెలిపారు

ఓలా రూ.550 కోట్ల ఐపిఒ..

న్యూఢిల్లీ : ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం సెబీ వద్ద దరఖాస్తు చేసుకుంది. ఈ ఇష్యూలో రూ.5,500 కోట్ల నిధులు సమీకరించాలని నిర్దేశించుకుంది. ఇందుకోసం ఆఫర్ ఫర్ సేల్‌లో 95,191,195 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఐపిఒ ద్వారా వచ్చిన నిధులను మూల ధన వ్యయాల, ఓలా గిగాఫ్యాక్టరీ ప్రాజెక్ట్, అనుబంధ సంస్థ ఒఇటి రుణాల చెల్లింపు, పరిశోధనా, ఉత్పత్తుల అభివృద్ధికి, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది.

వివో మనీలాండరింగ్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ వివో ఇండియా మనీలాండరింగ్ కేసులో తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఇడి) మరో ముగ్గురిని అరెస్టు చేసింది. ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వివోతో పాటు మరి కొన్ని సంస్థల మనీలాండరింగ్ కేసును దర్యాప్తు చేసిన ఇడి పలు సెక్షన్ల కింద వివో ఇండియాపై అభియోగాలు మోపింది. వివో రూ.62,476 కోట్ల పన్ను ఎగవేతలకు పాల్పడిందని గతేడాది ఇడి సోదాల్లో వెల్లడయ్యింది.

ఘనంగా సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 113వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఆ బ్యాంక్ హైదరాబాద్ జోన్‌లో ఘనంగా నిర్వహించారు. జోన్ పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లోని శాఖలు, కార్యాలయాలు, రీజినల్ ఆఫీసుల్లోని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సహా ఖాతాదారులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఎన్‌జిఒలకు సాయం చేయడం, హెల్త్ క్యాంప్‌లు నిర్వహించడం, అనాథలకు ఆహారోత్పత్తులు అందించడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. హైదరాబాద్ జోన్‌లో జరిగిన కార్యక్రమంలో జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ పాల్గొని.. తమ ఖాతాదారులకు నాణ్యమైన, సంపూర్ణ బ్యాంకింగ్ సేవలు అందించడానికి తమ సంస్థ అంకితభావంతో ఉందన్నారు. బ్యాంక్ ఉన్నతికి పాల్పడుతున్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇంకెవరైనా మిగిలారా?

ఆరెస్బీ



"ఏమ్‌రా పిలగా! మొకం గట్ల పెట్టినవ్?! " అంటూ సూట్‌కేస్ నెట్టుకుంటూ స్టైల్‌గా ఇంట్లో కొచ్చిన గిరీశం పలకరింపుతో ఫ్లగ్‌లో వేలు పెట్టిన కోతిలా అయిపోయాడు వెంకటేశం. గురువు గారి డ్రెస్ మారింది. పాతకాల పక్కచుట్ట 'హోల్డాల్' స్థానంలో ఆధునిక అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సూట్‌కేసొచ్చింది. పిలక కనపడని లెవెల్‌కి జుట్టు పెంచాడు. పెద్ద కుచ్చులుండే టోపీ పెట్టాడు. "ఓహ్! అందుకేనా తన తండ్రి, ఉరఫ్ నులక అగ్నిహోత్రావధాన్లు, ఈ తురకెవడోయ్ ?"అని గతంలో తనని అడిగింది? ఎదురెళ్లి కౌగిలించుకోవాలనుకున్నా ఏ మూల నుండైనా తండ్రి చూస్తే మైలబడ్డాననీ కొరతేస్తాడ"ని భయపడి వెనక్కి తగ్గాడు.

వెంకటేశం : " అదేమండీ! మీ డ్రెస్‌తో పాటు మాట కూడా మారిందేం?

గిరీశం : " మా నేస్తం పదకొండవ నిజాం సదరదాలత్ బావురల్లీ ఖాన్ ఇస్పహాన్ జంగ్ బహద్దూర్ వారి సంస్థానంలో నాల్రోజులుంటే నీ భాషా కూడా అంతేనోయ్! మై డియర్ షేక్స్‌పియర్! అక్కడ ఏం మజా! ఏం మజా! అంటూ హైద్రాబాద్ జ్ఞాపకాల్లోకి జారిపోయాడు గిరీశం.

వెంకటేశం :" మీరు మజా అంటే గుర్తుకొచ్చిందండోయ్! మీతో మధురవాణిని కూడా తీసికెళ్లారా ఏం? " అంటూ కొంటెగా నవ్వాడు వెంకటేశం!

గిరీశం : ఛీ.. ఛీ.. అక్కడ దాంతో పనేంటి? ఆ దివాణంలో దాని జేజెమ్మ ల్లాంటి వాళ్లు చానా మందే ఉన్నారు.

వెంకటేశం : ఫక్కున నవ్వి " అయితే జేజెమ్మల్తో కాలక్షేపం చేసొచ్చారా?" అనేశాడు.

గిరీశం : కొద్దిగా సర్దుకుని " నిన్ను సురేంద్ర నాథ్ బెనర్జీ అంతటి వాణ్ణి చేద్దామనుకుంటే... నువ్విక్కడే ఆగిపోయావ్ ! జ్ఞానం లేకపోతే పాయే, కనీసం లోకజ్ఞానం కూడా వంట బట్టించుకోవట్లే!" అంటూ విసుక్కున్నాడు. ఈ లోపు అగ్నిహోత్రావధాన్లు పైపంచతో మూతి తుడుచుకుంటూ వంటింట్లోంచి బయటికొచ్చి భార్యతో " ఇంకేమైనా మిగిలుందా?" అని పెద్ద గావుకేక పెట్టాడు. కొద్దిగా మాసిన తెల్లగడ్డం, కొంత పొట్ట, 56 కాకపోయిన ఏ 50/52 అంగుళాల ఛాతి, దాదాపు అదే ఎత్తు, గిరీశం మనుసులో వేరే బొమ్మ మెదిలింది. పైనా కిందా కలిపి, అంటే ఎగువ, దిగువ సభల్లో కలిపి మొన్నటికి 146 మందిని రోడ్లోకి నెట్టేశారు. వాండ్లు సభామర్యాదను కించపరచలే! మరే పాపమూ చేయలే. అధికార పార్టీ పార్లమెంటు సభ్యుడిచ్చిన పాస్‌తో కొందరు యువకులు లోనికి ప్రవేశించి ఏదో రంగుగ్యాసు లోనికి వదిలారు. అది విషవాయువైతే తమ పరిస్థితి ఏంగానని వారి ఆందోళన. దీనిపై గృహమంత్రి ప్రకటన ఇవ్వాలన్నారు ముందు. ఆయన రాజీనామా చేయాలన్నారు కొందరు. ప్రజాస్వామ్యంలో ఆ విధంగా చేయడంలో పాపం ! వారికి ఏ తప్పు కనపడలేదు. ప్రజాస్వామ్యంపై ప్రపంచానికి బోధించే 'తండ్రి'కి కోపం వచ్చింది. ధిక్కారమున్ సైతునే అన్నాడు. 146 మందీ విసిరి వేయబడ్డారు.



" మొన్న మీరు పిలిపించి కౌగిలించుకున్న 'మన దశమగ్రహం' రిషి సునాక్ ఒకే టర్మ్‌లో బోరిస్ జాన్సన్ రాజీనామా చేస్తే, ఆ తర్వాత పీఠమెక్కిన లిజ్ ట్రస్ నలభై అయిదు రోజులకే దిగిపోతే ఆ తర్వాత సింహాసనాధీశుడైన వాడే భారతీయ సంతతివాడైన రిషి సునాక్. నవగ్రహాలు చాలా మందికి తెల్సు. వాటిని దాటితే ఈ దశమ గ్రహం! అల్లుడ్ని దశమ గ్రహమంటారు లేండి. బహుశా అత్తగారింటి వాళ్ల జోకై ఉండచ్చు. 'మన' ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అల్లుడు కావడం వల్ల 'మన దశమగ్రహమైనాడు. ధరలు తగ్గించలేకపోతే , డాలర్‌తో స్టెర్లింగ్ రేటు పెరిగిపోయినందుకు దిగిపోయిన ప్రధానులు వాళ్లు. ప్రజాస్వామ్యంలో ఇటువంటివి ఉంటాయి. ప్రతి ఏడాదీ ఆ ఇరవై దేశాల్లో ఏదో ఒక చోట 'జి-20' దేశాల మీటింగు జరుగుతుంది. మొన్న ఢిల్లీలో మాత్రం మోడీ విదేశాంగ మంత్రాంగం విజయమని దేశమంతా ప్రచారకాండ నడచింది! రిషి సునాక్ బ్రిటన్ ప్రధాని కావడం కూడా మోడీ విజయపరంపరలో అంతర్భాగం చేయనందుకు మోడీ అండ్ కోకు ధన్యవాదాలు చెప్పాల్సిందే!

" ఏమేవ్! అడిగేది వినపడుతోందా?" అన్న అగ్నిహోత్రావధాన్ల అరుపుతో గిరీశం ఈ లోకంలో కొచ్చాడు.

అప్పటికే సుబ్బి పెళ్లి విషయంలో మనస్తాపంతో కుమిలిపోతున్న వెంకమ్మ గారు " ఇంకా నేను మిగిలే ఉన్నాను. నన్ను తినండి!" అనే సరికి " నేనేమైనా నరమాంస భక్షకుణ్ణటే పాపి!" అన్నాడు.

" రెండు కౌరవ సంతానాలంతమంది మిగిలేవన్నారు" అంది ఆ ఇల్లాలు. వివాహ భోజనంబు పాటై పోయిన తర్వాత ఘటోత్కచుడు గిన్నెలు వెతుక్కున్నట్టు" ఇంకా ఇరవై ఒక్కమంది లెక్క తేలట్లే"దని ఒక ఉరుము ఉరిమాడు" అవి ఖాళీ చచ్చినాయి. నేనేమి చేయను" అంది వెంకమ్మ!

ఈ లోపు బుచ్చెమ్మ జోక్యం చేసుకుని " నాన్నా! నన్ను కూడా తిను!" అనింది బేలగా. "స్త్రీ హత్యలు చేస్తానటే వెధవ.. ఖానా ! అని పైకి లేచాడు.

బుచ్చెమ్మ ధైర్యం చేసి " పోనీ సుబ్బిని తినేయ్" అనింది. ' నాకు కన్యాశుల్కం రాకుండా చేయడానికే వీళ్లంతా పగబట్టినట్టున్నారు. స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః అన్నట్టు , ఆడదాని సలహాలు వినేంత చచ్చుదద్దమ్మననుకున్నావా? అంటూ ఆడాళ్ల నోరు లేవనీకుండా చేయాలి అనుకుంటూ తానే ఒకడుగు వెనక్కి తగ్గాడు.

ఆత్మహత్యల భారతం



- రోజుకు 30 మంది అన్నదాతల బలవన్మరణం
- మోడీ పాలన సాధించిన 'ఘనత'కు నిదర్శనం
- రైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వ విధానాలు
- నానాటికీ పెరుగుతున్న రుణభారం
- వ్యవసాయ పథకాలకు తగ్గుతున్న కేటాయింపులు

న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ 2014లో తొలిసారి అధికారంలోకి వచ్చారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ బలవంతంగా ప్రాణాలు తీసుకున్న 1,00,474 మంది రైతులలో కేదారి ఒకరు. అన్నదాతల ఆత్మ హత్యలకు సంబంధించిన గణాంకాలను ఇటీవల జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసింది. దీని ప్రకారం గత తొమ్మిది సంవత్సరాలుగా రోజుకు సగటున సుమారు 30 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

> 'మా వద్ద డబ్బు లేదు. అప్పు ఇచ్చిన వారు ఇంకెంత మాత్రం ఎదురు చూడబోమని చెప్పేశారు. మేము ఏం చేయాలి? మోడీ జీ...మీరు మీ గురించే ఆలోచిస్తున్నారు. మీరు పంటకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలి. అందుకు గ్యారంటీ ఇవ్వాలి. అప్పు ఇచ్చిన వారు బెదిరిస్తున్నారు. సహకార సంఘం అధికారులేమో అవమానిస్తున్నారు. మేము న్యాయం కోసం ఎవరి దగ్గరికి వెళ్లాలి? మీరు ఎలాంటి చర్యలు తీసుకోనందునే నేను ఈ రోజు ఆత్మహత్య చేసుకుంటున్నాను'......మహారాష్ట్రలోని పూనే జిల్లాలో గత సంవత్సరం బలవన్మరణానికి పాల్పడిన దశరథ్ లక్ష్మణ్ కేదారి ఆఖరి మాటలివి.

పట్టించుకోని మీడియా

అన్నదాత మెడ చుట్టూ ఉచ్చు బిగుసుకోవడం అనేది సహజంగానే భావోద్వేగాలకు కారణమవుతుంది. అయితే దురదృష్టవశాత్తూ ఎన్‌సీఆర్‌బీ నివేదికను మీడియా ఎంతమాత్రం పట్టించుకోలేదు. వార్తా ఛానల్స్‌లో దీనిపై చర్చలు కూడా జరగలేదు. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2021లో 10,281 మంది అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు బలవన్మరణానికి పాల్పడితే 2022లో ఆ సంఖ్య 11,290కి పెరిగింది. మహారాష్ట్రలోని విదర్భ, మరట్వాడా ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'జవాన్' రైతుల కడగండ్లను కళ్లకు కట్టినట్లు చూపింది. ఆ చిత్రంలో ఓ రైతు కుటుంబం పంట నష్టపోవడంతో అప్పు తీర్చలేకపోయింది. బ్యాంకుకు చెందిన రుణ వసూళ్ల ఏజెంట్లు ఆ కుటుంబాన్ని అనేక రకాలుగా వేధించారు. దీంతో చివరికి ఆ కుటుంబ యజమాని బలవంతంగా ప్రాణాలు తీసుకున్నాడు.

ఇవన్నీ కారణాలే

ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవడం, కీలక పరిశ్రమల ప్రైవేటీకరణ, విదేశీ వాణిజ్యాన్ని అనుమతించడం, ప్రభుత్వ సబ్సిడీలు తగ్గడం, వ్యవసాయ రుణాలు తగ్గిపోవడం....ఇవన్నీ రైతుల ఇబ్బందులను మరింత పెంచాయి. ప్రభుత్వం నుండి భారీ సబ్సిడీలు పొందుతూ విదేశాల నుండి ప్రవాహంగా వచ్చి పడుతున్న వ్యవసాయ దిగుమతులతో పోటీ పడడం అన్నదాతకు అసాధ్యమవుతోంది. ఉన్న కష్టాలు చాలవన్నట్టు వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చేసిన మోన్‌శాంటో వంటి బడా కంపెనీల గుత్తాధిపత్యం, జన్యుపరంగా అభివృద్ధి చేసిన ఖరీదైన విత్తనాలు , ఎరువులు, క్రిమి సంహారక మందులు పెట్టుబడి వ్యయాన్ని బాగా పెంచేశాయి. రైతులు అటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను, ఇటు మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిస్థితులను ఎదుర్కోలేక సతమతమవుతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత మూడు దశాబ్దాలలో వ్యవసాయ రంగంలో మూడున్నర లక్షల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి.

పెరుగుతున్న రుణభారం

ఎన్నికల ప్రచార సందర్భంగా మోడీ అన్నదాతలపై అంతులేని ప్రేమ కురిపించారు. కానీ ఆ మాటలన్నీ నీటి మూటలేనని రైతులు ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల బలవన్మరణాలు ఎలుగెత్తి చాటుతున్నాయి. దేశంలో అప్పులపాలైన రైతుల సంఖ్య 2013లో 52% ఉంటే 2019 నాటికి 50.2%కి తగ్గిందని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అయితే వాస్తవానికి అదే కాలంలో రుణ ఊబిలో కూరుకుపోయిన అన్నదాతల సంఖ్య 9.02 కోట్ల నుండి 9.30 కోట్లకు పెరిగింది. అంతేకాదు...సగటు రుణభారం 1.6 రెట్లు పెరిగింది. ఫలితంగా అన్నదాతలు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు.

నీరుకారుతున్న పథకాలు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అండ్ ది ప్రైస్ సపోర్ట్ స్కీమ్ (ఎంఐఎస్-పీఎస్‌ఎస్), ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) వంటి కీలక వ్యవసాయ పథకాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. పీఎంఎఫ్‌బీవై పథకానికి కేటాయింపులు పెరుగుతూ 2022-23 బడ్జెట్ అంచనాలలో రూ.15,550 కోట్లకు చేరాయి. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్న రైతుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2022-23 రబీ సీజన్‌లో 4.35 కోట్లు, 2023 ఖరీఫ్‌లో 6.89 కోట్ల మంది రైతులు దరఖాస్తు చేశారు. అయితే చెల్లింపులు మాత్రం చాలా తక్కువగా జరిగాయి. 2022-23 రబీ సీజన్‌లో 7.8 లక్షల మంది రైతులకు రూ.3,878 కోట్లు చెల్లించారు. ఈ నేపథ్యంలో పథకం సమర్థత ప్రశ్నార్థకమవుతోంది.

పీఎం-కిసాన్‌కు 2022-23 బడ్జెట్ అంచనాలలో కేటాయింపులు రూ.68,000 కోట్లకు చేరాయి. అయితే ఈ పథకం భూమి ఉన్న రైతులకే తప్ప భూమి లేని వ్యవసాయ కార్మికుల అవసరాలు తీర్చలేకపోతోంది. వాస్తవానికి మన దేశంలో 2019 నుండి వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక చెబుతోంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ఎంఎస్‌పీలను నిర్ణయిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2014 ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ఉత్తుత్తి హామీలు, విఫలమవుతున్న పథకాలు, అరకొర కేటాయింపులు...ఇవన్నీ దేశంలోని అన్నదాతలను ఆర్థిక సుడిగుండంలోకి నెడుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం నిర్లక్ష్యం చేస్తుండడం వల్లనే అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వాతావరణ సంక్షోభం కూడా రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తీవ్రమైన వడగాల్పుల కారణంగా పంట నష్టం జరుగుతోంది. దిగుబడులు పడిపోతున్నాయి. ఆర్థిక భారంపై అలుపెరుగని పోరాటం చేయాల్సి రావడం, అనిశ్చిత పరిస్థితులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం పెరగడం...ఇవన్నీ మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా రైతును మరింత కుంగదీస్తున్నాయి. రైతులను ఆత్మహత్యల బారి నుండి కాపాడాలంటే ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. సమస్యకు మూల కారణాన్ని అన్వేషించి, దానిని పరిష్కరించడానికి బదులు ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం వంటి పైపై పూతల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.

తగ్గుతున్న కేటాయింపులు

మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ వ్యయంలో వ్యవసాయ కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయి. ఇక రైతు సంక్షేమానికి కేటాయింపుల సంగతి చెప్పనక్కర లేదు. 2014-15 నుండి 2021-22 వరకూ దేశంలో వాస్తవ వేతనాల వృద్ధి రేటు (వ్యవసాయ కార్మికులతో కలిపి) 1% కంటే తక్కువగా ఉండడం గమనార్హం. ఇక గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేటాయింపులు కూడా తగ్గిపోతున్నాయి. 2014-15 బడ్జెట్‌లో ఈ పథకానికి 1.85% నిధులు కేటాయిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు 1.33%కి తగ్గాయి. ఈ ఏడాది రూ.60,000 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం కంటే కేటాయింపులు 33% తగ్గిపోయాయి. మొత్తం జీడీపీలో ఈ కేటాయింపులు కేవలం 0.198% మాత్రమే. ఏటా 100 రోజుల ఉపాధి కల్పించాలన్న లక్ష్యం కూడా నీరుకారిపోతోంది.

బీఆర్‌ఎస్‌కు డీసీసీబీ చైర్మెన్ రాజీనామా

- త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పెద్ద షాక్ తగిలింది. ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో తన అనుచరులు, అభిమానులతో కలిసి చర్చించిన తర్వాత ఏ పార్టీలో చేరబోయేది నిర్ణయం తీసుకుంటానన్నారు. మూడ్రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తానని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరానని, పదేండ్లపాటు పార్టీ కోసం పని చేశానన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉన్నన్ని రోజులు తనకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి జోగు రామన్న తనకు అన్నలాగా తోడున్నారని చెప్పారు. అయితే, భోజారెడ్డి బాటలోనే మరికొందరు కీలక నాయకులు త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని ప్రచారం సాగుతోంది.

భద్రాచలంలో వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం

- రామయ్యను దర్శించుకున్న వేలాది మంది



నవతెలంగాణ- భద్రాచలం రూరల్

ముక్కోటి ఏకాదశి పర్వదినాన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో ఉత్తర ద్వారం గుండా సీతారామచంద్ర స్వామి దర్శనం కల్పించారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి మిథున స్టేడియం వద్ద సందర్శకులు వేల సంఖ్యలో రామయ్య దర్శనం కోసం నిరీక్షించారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉత్తర ద్వారం వద్దకు ఉత్సవ మూర్తులను తరలించిన ఆస్థాన అర్చకులు సీతారామచంద్ర స్వామి వారిని పసిడి హారాలతోపాటు తీరొక్క పువ్వులతో అలంకరించి, ఐదు గంటల సమయంలో సందర్శకులకు దర్శనం కల్పించారు. వేల సంఖ్యలో వచ్చిన జనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ముందుగా పాసులు పొందిన యాత్రికులకు కేటాయించిన సెల్లార్‌లోకి పంపిన అధికారులు ఎక్కడికక్కడ ట్రాఫిక్ నియంత్రించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల వారు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన చరిత్రలో కల్యాణ మహోత్సవం తర్వాత అత్యంత ప్రాధాన్యత గల ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతం కావడంతో అధికారులు, దేవస్థానం సిబ్బంది, పోలీస్ శాఖ వారు ఊపిరి పీల్చుకున్నారు.

30న జాతీయ లోక్ అదాలత్..

తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ న్యాయ సేవా సంస్థ సూచనల మేరకు రాష్ట్రంలో ఈ నెల 30న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్ గోవర్ధన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని స్థాయిల కోర్టుల్లో అదాలత్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వ్యాజ్యాలకు సంబంధించి సామరస్య పూర్వక పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉచితంగా ఈ సేవలను అందించనున్నట్టు పేర్కొన్నారు.

పత్తి రైతులను మోసం చేసిన కేంద్రం

- సీజన్ మధ్యలో మద్దతు ధరలో రూ.వంద తగ్గింపు
- ఆన్‌లైన్ ఇబ్బందులు తొలగించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ-ఖమ్మం

దిగుబడి తగ్గి, గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న పత్తి రైతులను ఆదుకోవాల్సిన సమయంలో కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఖరీఫ్ సీజన్‌కి ప్రకటించిన మద్దతు ధర 7020 రూపాయలలో రూ.100 కోత పెట్టిందని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం నాయకులు శనివారం ఖమ్మం జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను, రైతుల ఇండ్ల పత్తి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. 2021 వ్యవసాయ సీజన్‌లో బహిరంగ మార్కెట్లో పత్తి క్వింటాకు ధర 13 వేల రూపాయలు ఉండేదని, 2022, 2023 వరుస వ్యవసాయ సీజన్లలో 7వేల రూపాయలలోపు మాత్రమే ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవసాయ సీజన్ పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు మూడ్రోజుల కిందటి వరకు రూ.7020 చెల్లించి.. ఇప్పుడు రూ.6900 ధర ఉన్నట్టు సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశీయ పత్తి కంటే విదేశీ దిగుమతులపై భారతీయ వస్త్ర పరిశ్రమ ఆధారపడేలా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు.

తీవ్ర వర్షాభావ పరిస్థితులతోపాటు గులాబీ పురుగు ప్రభావంతో పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు కష్టంలో ఉన్న నేపథ్యంలో గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద పంట ఆన్‌లైన్‌లో నమోదు కాని రైతులు పత్తి అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయల వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్, ముదిగొండ మండల అధ్యక్షులు కందుల భాస్కరరావు, కార్యదర్శి, కోలేటి ఉంపేదర్, చిరుమర్రి ఎంపీటీసీ అరుణ తదితరులు ఉన్నారు.

రాజీ పడకుండా ఇండ్ల నిర్మాణం

- 27న ప్రజలకు తీపి కబురు
- ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తాం
- ఆదర్శ కాలనీ సత్వరమే పూర్తి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ- హుజూర్‌నగర్ రూరల్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం పారదర్శకతతో నిరుపేదలకు అందజేస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రామస్వామి గుట్ట వద్ద ఆదర్శనగర్‌లో నిర్మించిన 2160 ఇందిరమ్మ ఇండ్లను శనివారం నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పొంగులేటి పరిశీలించారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 2013లో గృహ నిర్మాణ శాఖ ద్వారా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను 3 నెలల్లోపు అర్హులైన నిరుపేదలకు అందజేస్తామన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన 109 ఎకరాల భూమిలో దాదాపు రూ.20 కోట్లు రెవెన్యూ శాఖ ద్వారా చెల్లించి గృహ నిర్మాణ శాఖ ద్వారా నిర్మించినట్టు చెప్పారు. దాదాపు 70 శాతం పూర్తయిన పనులను గత ప్రభుత్వం పదేండ్లలో రూ.30 కోట్లు కేటాయించి పూర్తి చేయకపోవడం దుర్మార్గమైన చర్యగా భివర్ణించారు. పదేండ్లుగా నియోజకవర్గంలో 150 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మాత్రమే నిర్మించి.. వాటిని కూడా నిజమైన నిరుపేదలకు అందించలేదన్నారు. 77 ఎకరాలలో ఆదర్శ కాలనీని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, 32 ఎకరాల ఖాళీ స్థలంలో అర్హులైన వారిని గుర్తించి ఇస్తామన్నారు. జిల్లాలోనే కాదు రాష్ట్రంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, గజం భూమి కూడా వదలబోమని, ఆ భూములను అర్హులైన పేదలకు అందించి ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పారు. ఈ నెల 27న ప్రజలకు తీపి కబురు ఉంటుందని, 6 గ్యారంటీలతోపాటు మ్యానిఫెస్టోలోని అన్ని అంశాలనూ పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు.

మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నీటిపారుదల రంగంలో పటిష్ట ప్రణాళికతో రైతులకు మెరుగైన నీటి సదుపాయం కల్పిస్తామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని లిఫ్టులు, చెక్‌డ్యామ్‌లను పునరుద్ధరిస్తామని చెప్పారు. పీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా రోడ్ల మరమ్మతులు చేయడంతోపాటు కొత్త రోడ్లు వేయిస్తామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను సత్వరం మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలని అధికారులకు సూచించారు. తదుపరి అన్ని శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, వెంకట్‌రెడ్డి, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ రమేష్, హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ ఈశ్వరయ్య, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్, డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీవీ తెలంగాణలో పుట్టడం గర్వకారణం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రధానిగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహనీయుడు పివి నరసింహారావు అని, అలాంటి గొప్ప వ్యక్తి తెలంగాణలో పుట్టడం గర్వకారణమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశం ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా పీవీ కీలక భూమిక పోషించారని కొనియాడారు. పీవీ ఆలోచనలను, మార్గాన్ని ముందుకు తీసుకెళ్లేలా భవిష్యత్ తరాలను నడిపించడమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. శనివారం నాడిక్కడ తెలంగాణ భవన్‌లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 19వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క... పీవీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'చిన్న నాటి నుంచే పీవీకి దేశం అంటే చాలా ప్రేమ. అనేక భాషలపై ఆయనకు మంచి పట్టుంది. ఉమ్మడి ఏపీ సీఎంగా భూసంస్కరణల విషయంలో గొప్ప సాహస నిర్ణయాలు తీసుకున్నారు. పీవీ పాలనా దక్షత ఇతర రాష్ట్రాలకు ఉదాహరణగా నిలిచింది. ఆయన పాలనా అనుభవం అందరికీ స్ఫూర్తిదాయకం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన్ రెసిడెంట్ కమిషనర్(ఆర్సీ) డా గౌరవ్ ఉప్పల్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినం..

స్వామివారి దర్శనం చేసుకున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్



నాగర్ కర్నూల్ జిల్లాలోనే అతి పురాతన వైష్ణవ ఆలయాల్లో ఒకటైన శ్రీపురం శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలదిగా భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఇది మనుస్మృతి ఆధారంగా సనాతన ధర్మాలోచనతో జరుగుతున్న పరిపాలన. ఇక్కడ సీతల అగ్ని ప్రవేశాలు, ద్రౌపతి వస్త్రాపహరణం, కుంతి విలాపాలు, అహల్య శాపగాథలు అన్నీ కొనసాగుతాయి. సహన శీలవతిగా నువ్వు భరించాలి! క్రీడలలోకి ప్రవేశించే అమ్మాయిలారా! అమ్మాయిల తల్లిదండ్రులారా ఇది మీకొక హెచ్చరిక. బ్రిజ్ భూషణ్ రెజ్లింగ్ సమాఖ్య పదవి నుంచి వైదొలగినా, అతని సహచరుడు సంజయ్‌సింగ్ ఇప్పుడు గెలిచాడు. గెలవగానే బ్రిజ్ భూషణ్ ఇంటికి వెళ్లి ఆశీర్వాదాలు పొందాడు. నీ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని హామీ కూడా ఇచ్చాడు. ఇక ఎంతో జాగ్రత్తగా వుండాలి మరి!

క్షమించు చెల్లీ!

క్షమించడమూ రాదా నీకు! క్షమించు. మా నేరాలను, ఘోరాలను, అఘాయిత్యాలను, అత్యాచారాలనూ అన్నీ క్షమించే గుణాన్ని, బలాన్ని కలిగుండాలి నువ్వు. ఎందుకంటే అవి రోజురోజుకూ పెరుగుతూనే వుంటాయి. అరికడతామని, బిడ్డను కాపాడతామని ఎన్ని నినాదాలతో కూడిన హామీలనిచ్చినా... అవన్నీ మంచిగ వినపడతాయని చెప్పినవే కానీ చేయటం కష్టమైన పని. అధినాయకులకు, అధికారానికి, చివరకు న్యాయవ్యవస్థకూ సాధ్యం కానిపని. అందుకే క్షమించాలి. క్షమించడమంటే, భరించాలి. భరించడమంటే ఏమిటో కూడా నీకు తెలుసు. నిష్క్రమించటమే కదా! నువ్విప్పుడు ఆ పనే చేశావు. ఇంకెందరు ఆ విధంగా చేయాలో, మీపై పెరుగుతున్న ఆ నేర జాబితా సంఖ్యలు తెలియజేస్తాయిలే. నువ్వు ఏడుస్తూ ఏడుస్తూ... ఈ దేశానికి గర్వకారణమయిన పతకం 'సాక్షి'గా నువు రక్షణగా వేసుకున్న బూట్లు, గ్లౌస్‌లు టేబుల్‌పై పెట్టి వెనుదిరగటం, ఇక ముందు రెజ్లింగ్‌ను కొనసాగించనని, వదిలేయటం మాకొంత సిగ్గుగా వున్నా, బాధనిపిస్తున్నా... నువ్వు క్షమించాలి!

ఒక ఏడాది క్రితం మిమ్మల్ని కాపాడుకుంటూ ప్రోత్సహించాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడే వేధింపులకు పాల్పడుతుంటే రోడ్డెక్కారు. చర్యలు తీసుకుంటామని హామీ మేరకే ఆందోళన విరమించారు. కానీ ఇప్పుడేమయింది. అతని చెప్పుచేతల కదలాడే వాన్ని తిరిగి అధ్యక్షునిగా గెలిపించారు. అతనేమో పార్లమెంటులో దర్జాగా కూర్చున్నాడు. ఏం చేస్తాం! ఓ నాప్రియమైన భారత పుత్రికా! సాక్షి మాలిక్, నీకు మద్దతుగా ఒకరో ఇద్దరో... రెజ్లర్ బజరంగ్ పునియా తన పద్మశ్రీ అవార్డును తిరిగి ఇచ్చేయటానికి ప్రధాని మోడీ ఇంటి ముందుకు వెళ్లవచ్చు. బాక్సర్ విజేందర్ లాంటివాళ్లు నీ పోరాటం న్యాయబద్ధమైనదని జరుగుతున్న అన్యాయంపై రాష్ట్రపతి, ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండు చేయవచ్చు. అయినా నువ్వికి చేసేదేమీ లేదు చెల్లీ! క్షమించాలి. నీకోసం గొంతులెత్తే వాళ్ల అందరూ ఇపుడు సభా బహిష్కారంలో వాళ్లూ రోడ్డునపడ్డారు. ప్రశ్నించే గొంతులేవీ సహించబడటం లేదు.


సంపాదకీయం

ఇది మనుస్మృతి ఆధారంగా సనాతన ధర్మాలోచనతో జరుగుతున్న పరిపాలన. ఇక్కడ సీతల అగ్ని ప్రవేశాలు, ద్రౌపతి వస్త్రాపహరణం, కుంతి విలాపాలు, అహల్య శాపగాథలు అన్నీ కొనసాగుతాయి. సహన శీలవతిగా నువ్వు భరించాలి! క్రీడలలోకి ప్రవేశించే అమ్మాయిలారా! అమ్మాయిల తల్లిదండ్రులారా ఇది మీకొక హెచ్చరిక. బ్రిజ్ భూషణ్ రెజ్లింగ్ సమాఖ్య పదవి నుంచి వైదొలగినా, అతని సహచరుడు సంజయ్‌సింగ్ ఇప్పుడు గెలిచాడు. గెలవగానే బ్రిజ్ భూషణ్ ఇంటికి వెళ్లి ఆశీర్వాదాలు పొందాడు. నీ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని హామీ కూడా ఇచ్చాడు. ఇక ఎంతో జాగ్రత్తగా వుండాలి మరి!

ఇది ఒక్క క్రీడాకారిణుల మీద జరుగుతున్న దాడి మాత్రమే కాదు తల్లీ. దేశంలో మహిళల మీద జరిగే నేరాలు 2016 నుండి 2021 వరకు 26.35 శాతం పెరిగాయి. ఇవన్నీ పోలీసులకు ఫిర్యాదు చేసినవి మాత్రమే. ఫిర్యాదు చెయ్యని నేరాలు ఇంకెన్నో వుంటాయి. తెలిసి జరిగిన నేరాల పైనే మనం చర్యలకు వెనకాడుతున్నాము. ఉన్నావ్ సంఘటనలో మనం ఏం న్యాయం చేశాం. కతువా ఘటనలో న్యాయం జరిగిందా? అంతెందుకు సామూహిక అత్యాచారానికి గురై 14 మంది కుటుంబ సభ్యులు హత్యకు గురయిన బిల్కిస్ బానో కేసులో దోషులకు క్షమాభిక్ష పెట్టిన ఉదార స్వభావపు నేతలున్న సమాజాన నువు ఎన్నింటికో సహించాలి. ఈ కేసు చాలా పాతది. తాజాగా చెబుతా విను. మొన్నటికి మొన్న న్యాయం అందించే న్యాయమూర్తికే మహిళయినందువల్ల వేధింపులు తప్పలేదు. న్యాయ దేవతే న్యాయంకోసం మొరపెట్టుకుంది. ఇక సామాన్యులదేముంది. ధర్మాలను వల్లిస్తాం. అధర్మంగా వ్యవహ రిస్తాం. నీతిని పలుకుతాం. నినాదాలిస్తాం, ఆచరణ కష్టం కనుక వదిలేస్తాం. ఆడది ఆది పరాశక్తి. పూజగదిలోనే. అన్నింటినీ క్షమిస్తావా! కానీ, పోరాటం విరమించకు!

కేంద్రం పూర్తి పెత్తనంలోకి ఎన్నికల కమిషన్

దేశంలో ప్రజాస్వామిక విలువలను వమ్ము చేయడమే గాక రాజ్యాంగ వ్యవస్థల మూలస్ఫూర్తిని కూడా దెబ్బతీస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో నిరంకుశ చర్యలకు పాల్పడింది. ఈ క్రమంలో బాహాటంగా బరితెగించి వ్యవహరించినవి కొన్నయితే, అచ్చంగా చట్టబద్ధంగా, చట్టం కోసమే చేస్తున్నట్టు కనిపిస్తూ చాపకింద నీరులా అనుకున్న పని కానిచ్చిన అతి తెలివి వేషాలు అనేకం.ప్రధాన ఎన్నికల కమిషనర్,కమిషనర్ల నియామక ప్రక్రియకు సంబంధించి పార్లమెంటులో ఇటీవల బిల్లు ఆమోదింపచేసుకోవడం ఈ రెండవ కోవలోకి వస్తుంది.2023 ఆగష్టులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాల అమలు కోసం ఈ చట్టం చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంది. కానీ వాస్తవానికి అక్షరాలా ఆ తీర్పు ప్రభావం లేకుండా చేయడానికీ అందులోని కీలక అంశాలను తిరస్కరిస్తూ చేసిన శాసనం ఇది. 140 మంది ఎంపిల సస్పెన్షన్, దాన్ని కప్పిపుచ్చడం కోసం ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్‌ను అనుకరించారనే గగ్గోలు నేపథ్యంలో కీలకమైన ఈ శాసనం మరుగున పడిపోయింది. వాస్తవానికి అది భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు గొడ్డలి పెట్టులాంటిది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల ప్రక్రియకు ఆధ్వర్యం వహించే ఎన్నికల కమిషన్ నియామకం ప్రధాని ఇష్టారీతికి వదిలేసే దుర్మార్గమది. ఇదంతా సుప్రీంకోర్టు చెప్పినట్టు చెప్పడం మరింత విపరీతం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు(నియామక షరతులు, సర్వీసు పదవీ నిబంధనలు) బిల్లు2023 పేరిట వచ్చిన ఈ బిల్లును రాజ్యసభ డిసెంబర్ 12న ఆమోదించింది. ప్రధానమంత్రి అధ్యక్షులుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నియమించే మరో కేంద్రమంత్రి సభ్యులుగా కమిటీ ఈ ఎంపిక కోసం రాష్ట్రపతికి పేరు సిఫార్సు చేస్తుంది. ఇప్పటికే కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వారే ఈ పదవికి అర్హులుగా వుంటారు. అంటే నియమించే కమిటీలో ప్రధాని మాట అమలవుతుంది. నియామకానికి అర్హులైన వారు కూడా ఆ ప్రభుత్వంలో పనిచేసిన వారే అయి వుండాలి. ఇక ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి గురించి చెప్పేదేముంది?(ఒకసారి సిఇసిగా పనిచేశాక మరో పదవి చేపట్టరాదని మాత్రం ఇందులో వుంది.) ఈ బిల్లు సభ ముందుకు రావడానికి ముందు జరిగిన తతంగం మరింత కీలకమైంది.


తెలకపల్లి రవి

రాజ్యాంగం, రాజకీయానుభవాలు

రాజ్యాంగం 324వ అధికరణం ఎన్నికల కమిషనర్‌ను రాష్ట్రపతి నియమిస్తారని మాత్రమే పేర్కొంది.అయితే ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో శాంతియుతంగా జరిగితేనే ప్రజాస్వామ్యం అన్నపదానికి అర్థముంటుంది. దీర్ఘకాలంపాలన చేసిన కాంగ్రెస్ హయాంలోనే ఎన్నికల కమిషన్ల తీరు విమర్శలకు గురైంది. ఇందిరా గాంధీ హయాంలో ఎన్నికల, ఉప ఎన్నికల నిర్వహణ వాయిదా, కేంద్రబలగాల వినియోగం వంటివి విమర్శల పాలైనాయి. 1972లో పశ్చిమబెంగాల్‌లో సీపీఐ(ఎం), వామపక్షాలను అధికారంలోకి రాకుండా చేయడానికి సైన్యాన్ని దింపి రిగ్గింగ్ చేసినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. చాలాసార్లు శాసనసభలను ముందే రద్దుచేయడం కూడా విమర్శల పాలైంది. ధనబలం ఫిరాయింపులు వంటి అనైతికత తాండవించడం మొదలైంది. కాంగ్రెస్ నుంచి రాజీనామా చేసిన హెచ్ఎన్ బహుగుణ, విపిసింగ్ వంటి వారు ఉప ఎన్నికలు కోరితే వాటిని వాయిదా వేస్తూ రద్దు చేస్తూ ఇష్టానుసారం వ్యవహరించడం కూడా దేశం చూసింది. అప్పట్లో ఒకే ఎన్నికల కమిషనర్ వుండేవారు. అద్వానీ రథయాత్ర తర్వాత, విపిసింగ్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన అనంతరం కీలుబొమ్మ చంద్రశేఖర్ సర్కారు వచ్చింది. ఆ సమయంలో ఎన్నికల కమిషనర్‌గా వివిఎస్ రమాదేవికి అర్హతలున్నా కాదని టిఎన్‌శేషన్‌ను చేశారు. ఎన్నికల కమిషన్ అధికారాలను మొదటిసారి గట్టిగా ఉపయోగించిన శేషన్‌ను ఆదర్శంగా చెబుతుంటారు. కొన్ని విషయాల్లో ఆయన పాలక పార్టీలను అదుపు చేసిన మాట నిజమే గాని తనే ఒక నిరంకుశ కేంద్రంగా మారిపోయారు. మత రాజకీయాలను ఎన్నడూ పట్టించుకోలేదు. పార్టీల ప్రభుత్వాల రాజ్యాంగ బద్ధమైన హక్కులను కూడా భంగపరిచారు. ఆ సమయంలో తనను తొలగించే అవకాశం లేదు గనక మరో ఇద్దరు అదనపు కమిషనర్లను నియమించడం ద్వారా అదుపు చేయాల్సివచ్చింది.

సిఇసిపై సుప్రీం కీలక తీర్పు

తర్వాతి కాలంలో వివిధ ప్రభుత్వాల హయాంలో ఈ తీరు మారిందని కాదు గానీ మోడీ హయాంలో మిగిలిన రంగాలలో వలెనే ఇక్కడా ఏకపక్ష ధోరణి ముదిరిపోయింది. సిబిఐ ఇడి, సివిసి వంటి పదవుల నియామకంలో ఆశ్రితులను నియమించి ప్రతిపక్షాలపై ప్రయోగించే ధోరణి పరాకాష్టకు చేరింది. దీనిపై అనేక సార్లు సంబంధిత వ్యక్తులు సంస్థలూ కూడా సుప్రీం కోర్టులో సవాలు చేయడం చూశాం. ఎక్కువ సందర్భంలో నచ్చినవారిని అడ్డదోవలో అందలమెక్కించడం మాత్రం ఆగలేదు. పలుసార్లు సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని అక్షింతలు వేసినా ఆగ్రహించినా ధోరణి మారింది లేదు. నచ్చిన వాళ్లను నియమించడం వారికి పదేపదే పదవీకాలం పొడగించడం పరిపాటి అయింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విషయంలో ముందే వద్దన్నా వినకుండా నియమించడమే గాక రెండుసార్లు పొడగింపు తీసుకున్నారు. చివరకు ఇదే ఆఖరిసారని హెచ్చరించింది కోర్టు. ఇక మరింత కీలకమైన ఎన్నికల సంఘం విషయంలోనూ ఇదే సమస్య ఎదురైంది. ఏకపక్ష నియామకాలు జరగకుండా ఒక నియామక ప్రక్రియ నిర్దేశించాలని కోరుతూ ఎడిఆర్(అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) తరఫున 2022లో ఒక పిటిషన్ దాఖలైంది. దీన్ని త్రిసభ్య రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుండగానే సిఇసి పదవీ విరమణ వచ్చింది. ఆ సమయంలోనే అరుణ్‌గోయెల్ అనే కార్యదర్శి తన పదవినుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం, 24 గంటల్లోనే సిఇసిగా నియమించడం జరిగిపోయాయి. సుప్రీంకోర్టు ఒకవైపున ఈ విషయం విచారిస్తుండగానే ఇంత హడావుడి దేనికని తీవ్ర విమర్శలు వచ్చాయి. సిఇసి పదవీ కాలం ఆరేళ్లు, లేదా 65 ఏండ్లు నిండడం. ఇందులో ఏ కొలబద్దతో చూసినా గోయెల్ ఎంపికయ్యే అవకాశముండదు.తమముందుకు వచ్చిన నాలుగు పేర్లలోనూ గోయెల్ చిన్నవారుగనక తనను నియమించినట్టు అడ్వకేట్ జనరల్ సమర్థించుకున్నారు.ఈ నియామకాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైనప్పుడు కేంద్రం అధికారాన్ని ప్రశ్నించలేమని కోర్టు చెప్పింది. అయితే ఎడిఆర్ కేసులో దీనిపై సమగ్ర తీర్పు వస్తుందని కూడా సూచించింది.తీరా ఆ కేసు విచారణకు వచ్చినపుడు ఎజి ఆర్ వెంకట్రామన్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఏకపక్షంగా సమర్థించారు. రాజ్యాంగం సిఇసి నియామకంపై ఎలాటి నిర్దేశకాలు చేయలేదని వాదించారు. ఏమీ చెప్పనప్పుడు మరింత జాగ్రత్తగా వుండాలని ,దీనిపై ఏవైనా మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీంకోర్టు చెప్పగా అలా జోక్యం చేసుకోవాలని న్యాయవ్యవస్థకు అధికారం ఇవ్వ లేదని కూడా ఆయన అభ్యంతరం చెప్పారు.రాజ్యాంగం ఈ విషయంలో మౌనం పాటించింది గనక కోర్టులు చేయడానికి లేదన్నారు. జస్టిస్ జోసఫ్ అధ్యక్షతన గల ధర్మాసనం దీనిపై తీర్పునిస్తూ సిఇసి నియామకంలో అనుసరించాల్సిన సూత్రాలపై పార్లమెంటు చట్టం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఇచ్చిన తీర్పులో న్యాయమూర్తి రాజ్యాంగం



సిఇసికి ఎంత ప్రత్యేక స్థానం ఇచ్చిందో అంబేద్కర్ మాటల్లోనే ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం అంటేనే ఎన్నికలు సక్రమంగా జరగడమనీ, దానికి ఎన్నికల సంఘం కీలకమని అంబేద్కర్ అప్పట్లో పేర్కొన్నారు. రాజ్యాంగపరిషత్తు చర్చలో ఈ నియామకంపై నిబంధనలు నిర్దిష్టంగా వుండాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ ప్రొఫెసర్ సిబ్బన్‌లాల్ సక్సేనా ప్రతిపాదించిన సమగ్ర సవరణ ఆ సందర్భంలో జరిగిన చర్చ వివరంగా పొందుపర్చారు. కాగ్ వంటివారితో పోలిస్తే ఎన్నికల సంఘం అత్యంత ముఖ్యం గనకే అందుకు ప్రత్యేక నియామక పద్ధతిని రాజ్యాంగం చెప్పిందనీ, ఇందుకు స్వతంత్రత అనేది కొలబద్ద అని స్పష్టం చేశారు. సిఇసి కార్యనిర్వాహక వర్గానికి లోబడి వుండకూడదనేది కీలకసూత్రం. పార్లమెంటు చట్టం చేసేలోగా కూడా స్వతంత్రత కాపాడేందుకు గాను ప్రధాని ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీ రాష్ట్రపతికి సూచలను చేయాలని నిర్దేశించారు.

తీర్పుకు తూట్లు పొడిచిన కేంద్రం

కోర్టు చెప్పినట్టే తాము కొత్తచట్టం తెచ్చామని కేంద్రం వాదించడం తీర్పును అపహాస్యం చేయడమే. ఎందుకంటే ఏ తీర్పులోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి ఒబిటర్ డిక్టా, రెండు రేషియో డిసిడెండి. మొదటిది ఆదేశపూర్వకం.తప్పక అమలు చేయాలి. రెండోది ఆ తీర్పునకు మూలమైన స్ఫూర్తి వివరణ. ఈ తీర్పులో కేంద్రం చట్టం చేయాలన్నది ఆదేశమైతే సిఇసి స్వతంత్రత కాపాడాలనేది స్ఫూర్తి. సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా చేయడం ద్వారా సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది.అయినా మోడీ సర్కారు ఏవో పొంతనలేని వాదనలతో బిల్లు తీసుకొచ్చింది.

కోర్టు చెప్పినట్టే తాము కొత్తచట్టం తెచ్చామని కేంద్రం వాదించడం తీర్పును అపహాస్యం చేయడమే. ఎందుకంటే ఏ తీర్పులోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి ఒబిటర్ డిక్టా, రెండు రేషియో డిసిడెండి. మొదటిది ఆదేశపూర్వకం. తప్పక అమలు చేయాలి. రెండోది ఆ తీర్పునకు మూలమైన స్ఫూర్తి వివరణ. ఈ తీర్పులో కేంద్రం చట్టం చేయాలన్నది ఆదేశమైతే సిఇసి స్వతంత్రత కాపాడాలనేది స్ఫూర్తి. సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా చేయడం ద్వారా సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. అయినా మోడీ సర్కారు ఏవో పొంతనలేని వాదనలతో బిల్లు తీసుకొచ్చింది. ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా వుంచాలని కోర్టు సూచనగా చెబితే దాని బదులు ప్రధాని నియమించే కేంద్ర మంత్రికి సభ్యత్వం కల్పించింది. ప్రతిపక్ష నాయకుడికి నామక: స్థానం కల్పించినా మెజారిటీ వారికే వుంటుందనేని స్పష్టం. అంతేగాక కార్యదర్శి హోదా కలిగిన వారేనని చెప్పడం కూడా ఎంపికను పరిమితం చేసింది. ఇక ఎంపికయ్యేవారికి ప్రభుత్వం ఎలాటి ప్రత్యేకాభిమానం చూపినట్టు వుండకూడదని కూడా కోర్టుచెప్పింది. కాని ఇక్కడ కావలిసిన వారినే తీసుకోవడం ద్వారా వారు లోబడి వుండాల్సిన పరిస్థితి కల్పించబడింది. ప్రధాన కమిషనరుగా నియమించబడేవారికి సుప్రీం కోర్టు జడ్జిలతో సమానంగా జీతభత్యాలు వుండాలని తీర్పులో చెబితే ప్రభుత్వం మొదట కార్యదర్శి స్థాయి వేతనం మాత్రమే ప్రతిపాదించింది. ప్రతిపక్షాల విమర్శల తర్వాతనే దాన్ని ఆ స్థాయికి చేరుస్తూ సవరణ తెచ్చారు. సిజెఐ కూడా సభ్యుడుగా వుండాలని వచ్చిన సవరణను సభ తోసిపుచ్చింది.కమిషన్ సభ్యులకు విధి నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలకు గాను కేసులు పెట్టే అవకాశం తొలగింపు అధికారం లేకుండా చేయాలన్న సూచనను కూడా ఆమోదించలేదు. ఒక్క సిఇసికి మాత్రమే సుప్రీంకోర్టు జడ్జిల తరహాలో కేసుల నుంచి రక్షణ కల్పించబడింది. కోర్టుల జోక్యం కన్నా రాజకీయ జోక్యమే ఎన్నికల సంఘానికి సవాలు గనక ఆ ఒత్తిడి అలాగే వుంటుందన్న మాట.ఈ విధంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి ఎన్నికల సంఘం బిల్లు తెచ్చారని ఎంపిలు విమర్శించగా రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంకర్ ఆగ్రహించారు. సభలో మనం స్వతంత్రంగా నిర్ణయాలు చేయాలి గాని ఎవరి పెత్తనం మనపై వుండరాదని సూక్తులు చెప్పారు.వాస్తవంగా జరిగింది వేరు. అన్ని విధాల కేంద్రానికి లోబడి వుండేలా ఎన్నికల కమిషనర్ల నియామకానికి రంగం సిద్ధమైంది.ఇక ఎన్నికల స్వతంత్ర నిర్వహణ మరింత ప్రశ్నార్థకమవుతుంది.

జై బజ్‌రంగ్

కైలాసంలో శివుడూ పార్వతి కొలువుదీరి ఉన్నారు. కొంతసేపటి నుండి శివుడి జటాఝటంలో ఏదో అలజడి. శివుడు కుదురుగా కూర్చోలేకపోతున్నాడు. అదంతా పార్వతి గమనిస్తూనే ఉంది.

"ఏమి స్వామి ఏదో ఇబ్బంది పడుతున్నారు?" అనునయంగా అడిగింది పార్వతి

"ఇబ్బంది నాకు కాదు దేవి గంగకు కాబోలు!" బదులిచ్చాడు శివుడు.

"పార్వతి విసురుగా లేచి నిలబడింది."

"అలక ఎందుకు దేవీ! నీవు నా అర్థ భాగానివి! అన్నాడు శివుడు.

"కానీ తనను తలకెక్కించుకున్నారు!" అన్నది పార్వతి మరింత విసురుగా.

"ఇంతలో గంగ ప్రత్యక్షమయ్యింది! కాని ఆమె కంటిలో నీరు ప్రవహిస్తోంది.

గంగ కంటిలో నీళ్లు చూసి పార్వతి కదిలిపోయింది.

"ఎందుకు చెల్లా బాధ పడుతున్నావు!" ప్రేమగా అడిగింది పార్వతి.

"కారణం నేను చెబుతాను తల్లీ, నారాయణ!" అంటూ ప్రవేశించాడు నారదుడు.

"నారదా ఇపుడు నీ రాక ఎచటికి దారితీయునో, అక్కాచెల్లెళ్లు కలిసే ఉన్నారు కదా!

అన్నాడు శివుడు ఆందోళనగా.

"స్వామి నా రాక వల్ల మీకేమీ నష్టము లేదు! ఒకసారి అందరూ అటు చూడండి!"

అంటూ భూలోకం వైపు చూపాడు నారదుడు.

"భూ లోకంలో గంధ మాదన పర్వతం మీద హనుమంతుడు ఎగిరి గంతులు వేస్తున్నాడు. ఆనందంతో నృత్యం చేస్తున్నాడు. అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు. చాలా కాలంగా ఎంతో



బాధగా ఉన్న ఆంజనేయుడు అకస్మాత్తుగా ఇంత సంతోషంగా మారిపోవటానికి కారణమేమిటో వారికర్థం కాలేదు!

"విష్ణుమూర్తి మళ్ళీ రామావతారం దాల్చుతున్నాడా ఏమి! నాతో ఒక్కమాటైనా చెప్పలేదు! అన్నాడు శివుడు.

"అనుమానాలు ఎందుకు స్వయంగా ఆంజనేయుడినే అడిగి ధృవ పర్చుకుందాము పదండి" అన్నది పార్వతి.

అందరూ ఆంజనేయుడి ముందు ప్రత్యక్షమయ్యారు. కాని ఆంజనేయుడు వారిని గమనించే పరిస్థితి లేదు ఆనందంలో మునిగి తేలుతున్నాడు.

"ఆంజనేయా!" శివుడి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు ఆంజనేయుడు.

"ఏమి స్వామి!"అన్నాడు ఆంజనేయుడు ఆనందంగానే.

"ఆంజనేయా! నీ ఆనందానికి కారణమేమి?" అడిగాడు శివుడు.

"నా ఆనందానికి గంగాదేవి కన్నీటికి ఒకటే కారణము!" అన్నాడు ఆంజనేయుడు.

"ఆనాడు భారతీయ రెజ్లర్లు తాము సాధించిన పతకాలు అవార్డులు నాలో నిమజ్జనం చేయటానికి ప్రయత్నించితే కొందరు. మీ సమస్య పరిష్కారం అవుతుంది! మీ పతకాలు గంగలో కలపొద్దు! ఆగండి! అన్నారు! దాంతో వారు ఆగిపోయారు. ఎంతో విలువైన మరింత పవిత్రమైన వారి అవార్డులు నాలో కలిపి ఉంటే నేను మరింత పునీతమయ్యేదానను! ఆ అవకాశం తప్పిపోయిందని ఆవేదన చెందుతున్నాను" అన్నది గంగ.

"మరి నీ ఆనందానికి కారణమేమి?" అడిగాడు శివుడు.

"బజరంగ్ అనే పేరు నాకున్నందుకు ఇంత కాలం ఎంతో బాధపడ్డాను.నిన్నటి నుండి ఈ పేరు ఉన్నందుకు ఆనందపడుతున్నాను!" అన్నాడు ఆంజనేయుడు.

నజర్

"ఇంతకు ముందు బాధ ఎందుకు? ఇప్పుడు ఆనందం ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

"నా పేరు మీద బజరంగ్‌దళ్ అనే సంస్థను పెట్టి నాకు నచ్చని పనులు, నా స్వభావానికి విరుద్ధమైన కార్యక్రమాలు అనేకంగా చేశారు! అందుకే ఇంతకాలం ఎంతో బాధపడ్డాను" వివరించాడు ఆంజనేయుడు.

"మరిప్పుడు నీ ఆనందానికి కారణమేమిటో తెలుపుము!" అన్నాడు శివుడు.

"తమ ఆత్మాభిమానం దెబ్బతిన్నదని. నిరసనగా తనకిచ్చిన బిరుదుని తన ప్రభువుకి తిరిగిచ్చేందుకు సాహసించాడు. బజరంగ్ అంతేకాదు! ఆ బిరుదుని తీసుకోకపోవటంతో రోడ్డు మీదే వదిలేశాడు!కీర్తి ప్రతిష్ఠల కోసం! నానా గడ్డి కరుస్తున్న ఈ రోజుల్లో తనకు కీర్తి తెచ్చిన అవార్డును తోటి క్రీడాకారిణి కోసం వదులు కున్న బజరంగ్ నాపేరుకు గౌరవ ప్రతిష్ఠలు కల్పించాడు. అందుకే "ఈ ఆనందం" అన్నాడు ఆంజనేయుడు.

"నీ రాముడికి గుడి కట్టిస్తున్న రామభక్తులనే ఎదిరించుతున్న వారిని నీవు సమర్థిస్తావా?" అన్నాడు నారదుడు.

"నా రాముడికి గుడి అవసరం లేదు నారదా! తమ స్వార్థం కోసం రాముడికి గుడి కట్టినంత మాత్రాన రామ భక్తులై పోరు! రామాలయం ఉన్నంత మాత్రాన రామ రాజ్యమై పోదు!" అన్నాడు ఆంజనేయుడు కటువుగా.

"అదేమి ఆంజనేయా! భారతదేశంలో ఇపుడున్నదీ సాక్షాత్తు రామరాజ్యమేనని భక్తులంతా అనుకుంటున్నారు!" అన్నాడు నారదుడు వెనుకడుగులు వేస్తూ.

"ఆపు నారదా! మరొక్క మాట అన్నావంటే నీ తల వేయి ముక్కలు చేస్తాను! నా రాముడొక్కడే, రామ రాజ్యమూ ఒక్కటే. మరో రామరాజ్యము ఉండబోదు! ఈ రాజ్యానికి ఒక్కటైనా రామరాజ్య లక్షణముందా?" ఉగ్రరూపంతో ప్రశ్నించాడు ఆంజనేయుడు.

నారదుడు భయపడ్డాడు.

"తన రాజ్యంలో ఒక సామాన్య పౌరుడు తనను పరోక్షంగా విమర్శించితేనే సీతమ్మను అడవులకు పంపిన చరిత్ర నా రాముడిది. ఈ రాజ్యంలో ప్రజలు ఎన్నుకున్న నాయకులకే రాజసభలో నుండి బహిష్కరించిన దుర్నీతి ఉన్నది. తన రాజ్యంలో ప్రజలపై తీవ్రమైన హత్యాకాండ జరుగుతుంటే వెళ్ళి ఓదార్చలేని వాడు నాయకుడేనా? అదే నాయకుడు ఆటలు చూడటానికి రోజంతా వెచ్చిస్తాడా? మమ్మల్ని వేధిస్తున్నవాడిపై చర్య తీసుకోండి మహాప్రభో అని మొరపెట్టుకున్న క్రీడాకారులను పట్టించుకోని వాడు దేశ నాయకుడుగా ఉండటానికి సిగ్గు ఉండొద్దా! ఇలాంటి రాజ్యంలో ఉండటానికి నేనే ఇష్టపడటం లేదు! ఎంత గొప్ప గుడి కట్టినా నా రాముడు ఆ రాజ్యంలో ఉండలేడు. ఇది రామభక్తుల రాజ్యం కాదు! రామభోక్తల రాజ్యం! సెలవు!" అంటూ ఆంజనేయుడు ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

అందరూ అనుసరించారు.

– ఉషాకిరణ్

మానవ హక్కులను మసిచేసిన మనుస్మృతి

మెజారిటీ ప్రజలకు మానవ హక్కులను మృగ్యం చేసేది మనుస్మృతి. మానవ హక్కులకోసం జీవితాంతం పోరాడిన బాబాసాహెబ్ తన ఉద్యమ తొలినాళ్లలోనే మనుస్మృతిని బహిరంగంగా తగలపెట్టారు. 1927 డిసెంబర్ 25న, అంటే 96 ఏళ్ల క్రితం మహద్ చెరువు పోరాటం సందర్భంగా దాన్ని దహనం చేశారు. మహద్ చెరువులోని నీటిపై దళితులకు కూడా హక్కుందని చాటడానికి జరిగిన పోరాటమని మహర్లు, చంబార్లు, మాంగులతో పాటు అంటరానితనానికి వ్యతిరేకంగా కలిసి వచ్చే ఉన్నత కులాల వారినీ సమీకరించారు అంబేద్కర్ మహద్ సభలో మనుస్మృతిని తగలబెట్టాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించే బాధ్యతను ఒక బ్రాహ్మణుడికి అప్పగించారాయన. అప్పటికే ఆంగ్లేయుల పాలనలోని బొంబాయి శాసనసభ, ప్రభుత్వ వనరులను, స్థలాలను అంటరాని వారితో సహా అందరూ ఉపయోగించుకోవచ్చన్న తీర్మానాన్ని ఆమోదించింది. అయినా బ్రాహ్మణులు ఇతర ఉన్నత కులాలవారు అడ్డుకొన్నారు.


ఎస్. వినయకుమార్
9989718311

మనుస్మృతి దహనంతో మొత్తం భారతదేశ దృష్టిని అంబేద్కర్ ఆకర్షించారు. ఆయన ఉద్యమాన్ని, ఆలోచనలను లెక్కచేయని పత్రికలు దహనం తర్వాత అంబేద్కర్‌పై కాలుదువ్వి కయ్యానికి దిగాయి. తమ సంపాదకీయాల్లో ఎడాపెడా తిట్టేశాయి. ఆ తిట్లు అంటరానితనానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం పాలిట వరాలయ్యాయి. అంబేద్కర్ ఉద్యమం గురించి కొత్తగా చాలా మందికి తెలిసొచ్చింది. ఆ ఉద్యమంపై నిప్పులు చెరిగిన పత్రికలకు అంబేద్కర్ తన "బహిష్కృత్ భారత్" పత్రికలో ఘాటైన సమాధానాలు ఇచ్చారు.


వర్ణాశ్రమ ధర్మాన్ని మనుషుల మీద రుద్దడానికే మనుస్మృతి ఉనికిలోకి వచ్చింది. ఈ విషయం మనుస్మృతిలోని రెండవ శ్లోకంలోనే దాపరికం లేకుండా చెప్పారు. "కొందరు మహర్షులు ఒక రోజు మనువు దగ్గరికి వెళ్లి బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులనే నాలుగు వర్ణాల గురించి చెప్పమని అడిగారట. మనువేమో భృగు మహర్షి చెప్తాడని వారిని పంపించారట. సమాజం మనుగడ సాఫీగా సాగడానికి మనుస్మృతి రాశారని ఎవరైనా చెబితే అది పెద్ద మోసం. మెజారిటీ ప్రజలను దోచుకొని మైనారిటీ జనం సుఖభోగాలను అనుభవించడానికే మనుస్మృతి ఉనికిలోకి వచ్చింది. అలాగే మహిళలను అణచిపెట్టడానికి పనికొచ్చింది. ఆ స్మృతి ఒకరు రాసింది కాదు. తమ సుఖం కోసం బ్రాహ్మణులు వందల యేళ్లపాటు తమ ప్రక్షిప్తాలు జోడించారు.

మనుస్మృతిలో దేవుడు బ్రాహ్మణులకు నాలుగు నియమాలను విధించారట. అధ్యయనం (నేర్చుకోవడం) అధ్యాపనం (నేర్పించడం) యజనం(యజ్ఞం చేయడం) యాజనం(యజ్ఞం చేయించడం). క్షత్రియునికేమో ధర్మబద్ధ పాలన, తనవారి సంరక్షణ, వైశ్యులకేమో వస్తుసేకరణ, ధనార్జన ధర్మంగా చెప్పారు. శూద్రుల విధి పై మూడు వర్ణాలకు సేవచేయడమే అని నిర్దిష్టంగా నిస్సిగ్గుగా చెప్పారు. దానికి కారణం నాల్గవ వర్ణమైన శూద్రుల్లో పూర్తిగా అజ్ఞానం ఉంటుందని సిద్ధాంతీకరించారు. వారి శారీరక మానసిక స్థితిలోనూ అనేక దోషాలుంటాయని వర్ణం మార్చుకోవడం సాధ్యం కాదనీ చెప్తుంది. మరి పంచములు ఎలా వచ్చారో స్మృతి చెప్పదు. కాని శూద్రుల కంటే పంచములతో ఎంత అన్యాయంగా, అనాగరికంగా వ్యవహరించవచ్చో చెప్తుంది. మనుస్మృతి క్రీస్తు పూర్వం నుండే రాసిందే అయినా ఇప్పటికీ దాని ప్రభావం హిందూ సమాజంపై గాఢంగా ఉంది. నేటికీ అది విధించిన సానుకూలతలు, ప్రతికూలతలు అమల్లో ఉన్నాయి.

స్త్రీలకు మనుస్మృతి ఆస్తి హక్కునిచ్చిందని, వరకట్నాలు కన్యాశుల్కాన్ని నిషేధించిందని, స్త్రీకి మళ్లీ చేసుకొనే అవకాశం ఉందని సంతానవతి అయిన భార్య బతికుండగా పురుషుడు మరోపెళ్లి చేసుకోవడాన్ని నిషేధించిందని చెప్తారు. ఆ హక్కులన్నీ ఎక్కడికి పోయాయి? వైద్యశాస్త్రం అభివృద్ధి చెందిన నేటి దశలోనూ సంతానం లేకపోవడాని స్త్రీయే కారణం అన్న భావన అత్యధికుల్లో ఇప్పటికీ ఉండటానికి మనుస్మృతే కదా కారణం.

యత్రనార్యస్తు పూజ్యంతే రమంత్రే తత్ర దేవతా: అంటే ఎక్కడ స్త్రీలను పూజిస్తారో అక్కడ దేవతలు సంతోషిస్తారని అర్థం. మనుస్మృతిలో ఈ శ్లోకం ఉన్న మాట నిజం. అదే సమయంలో స్త్రీ బాల్యంలో తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త సంరక్షణలో, ముసలితనంలో పుత్రుడు లేదా బంధువుల సంరక్షణలో ఉండాలి. స్త్రీ స్వతంత్రంగా ఉండటానికి వీల్లేదన్న (నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి) శ్లోకం కూడా మనుస్మృతిలోనే ఉంది కదా? స్త్రీ మాత్రమే కామపీడితురాలు అయినట్లు చెప్పే శ్లోకాలు కూడా మనుస్మృతిలో ఉన్నాయి. అనేక చోట్ల స్త్రీలపై ఆంక్షలు విధించి, ఈ ఒక్క శ్లోకంతో పాప పరిహారం పొందాలంటే ఎలా చెల్లుతుంది?

తండ్రి, సోదరులు తనను ఎవరికి అప్పగిస్తారో అతనికి జీవితాంతం స్త్రీ సేవలు చేయాలి. అతను చనిపోతే మళ్లీ పెళ్లి చేసుకోరాదు. భర్తను ఆదరిస్తే అతను పరలోకంలో కూడా స్త్రీకి సుఖాన్నిస్తాడు. దురాచారి, స్త్రీలోలుడు విద్యాది సుగుణాలు లేని భర్తను కూడా ఆదరించాలి. అంటే ఆ బాపతు పరలోకంలో కూడా వదలడన్న మాట దురాచారి, స్త్రీలోలుడు, విద్యాది సుగుణాలు లేని భర్తను కూడా స్త్రీ దేవుడిలా పూజించాలి. మంత్రాలోచన సమయంలో వికలాంగులను, వృద్ధులను, మ్లేచ్ఛులను, స్త్రీలను అక్కడి నుండి పంపించాలని మనుస్మృతి చెప్తుంది. అప్పులకు సంబంధించి ఒక స్త్రీ మరోస్త్రీకి సాక్ష్యంగా ఉండవచ్చుట. ఇతర విషయాల్లో మంచి బుద్ధి గలవారైనప్పటికీ స్త్రీలు సాక్షానికి పనికి రారట. ఎందుకంటే వారు చపల చిత్తులని మనుస్మృతి చెప్తుంది



కాని నిజానికి సంకల్పశుద్ధి స్త్రీల్లోనే ఎక్కువ కన్పిస్తుంది. ముస్లింల్లోనూ ఇద్దరు స్త్రీ సాక్ష్యులు ఒక పురుష సాక్షికి సమానమట. ఎందుకంటే భగవంతుడు స్త్రీకి సగం మెదడు మాత్రమే ఇచ్చారని ముస్లిం బోధకులు చెప్తుంటారు. ఎంత అశాస్త్రీయం?

మనుస్మృతిని భారత రాజ్యాంగంతో పోల్చుతూ అర్థంలేని వాదన కూడా చేస్తారు. రాజ్యాంగానికి సవరణలు చేసినట్లే మనుస్మృతిలోనూ కాలమాన పరిస్థితులను బట్టి మార్పులు చేసుకోవచ్చంటారు. 1950 నుండి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది కనుక మనుస్మృతితో పని లేదని మాత్రం చెప్పరు. ఎందుచేత? రాజ్యాంగ సవరణకు నిర్దీత పద్ధతులున్నాయి. ఒక వేదిక ఉంది. పార్లమెంట్‌లో మూడింట రెండువంతు సభ్యుల ఆమోదంతో మాత్రమే రాజ్యాంగ సవరణ చేయవచ్చు. మరి మనుస్మృతిని ఎక్కడ, ఎవరు, ఏవిధంగా సవరించవచ్చో చెప్పలేరు. భగవంతుడే మనుషులను అసమాన సామర్థ్యంతో నాలుగు వర్ణాలుగా పుట్టించారన్న మౌలిక అవగాహనలో మాత్రం ఎలాంటి సవరణ జరగలేదు. అలాగే శూద్రులు, పంచములపట్ల సామాజిక వివక్ష చూపాలన్న శ్లోకాల్లో సవరణ జరగలేదు? స్మృతిలో అనేక మూఢ నమ్మకాలూ ఉన్నాయి. వాటికీ జరగలేదు కదా?

యూరపు దేశాలు ఫ్యూడల్ వ్యవస్థనుండి బయట పడి స్వేచ్ఛ ప్రజాస్వామ్యం పేర ప్రభుత్వాలను ఏర్పరచుకొన్నాయి. ఆ ప్రజాస్వామ్యంలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వాలు ఏ పాటివి? అన్న విషయాన్ని పక్కన పెడదాం. ఆ దశలో భారతదేశంలోకి తమ మార్కెట్లను విస్తరించుకోవడానికి వచ్చిన ఆంగ్లేయ కంపెనీలు మనదేశాన్ని వలసదేశంగా మార్చుకొని పరిపాలన సాగించాయి. తమపాలన కోసం ఒక చట్టం రూపొందించాలని చూస్తున్న దశలో వారికి మనుస్మృతి తమకు అనుకూల గ్రంథంగా కన్పించింది. బ్రిటిష్ పాలకుల ఆదేశం మేరకు కోల్‌కతాలోని జగన్నాథ తర్క పంచానన అనే సంస్కృత పండితుడు మనుస్మృతిపై ఒక గంథ్రం రాశారు. మనుస్మృతితో పీడిత వర్గాలను ఎంత సునాయాసంగా దోచుకోవచ్చో బ్రిటిష్ పాలకులు కూడా గుర్తించారు. ఆ తర్వాత చాలామంది ఆంగ్లేయులు మనుస్మృతి ని ఇంగ్లీషులోకి అనువదించారు. ప్రజలను విడదీసి పాలించడానికి ఒక రెడీమేడ్ సాధనంగా వారికి మనుస్మృతి కన్పించడంలో ఆశ్చర్యం లేదు.

ఏ మతమైనా, తమ మత గ్రంథాలు దేవుడి నుండి నేరుగా వెలువడినవేనని. వాటిని సవరించడానికి ఏ మాత్రం వీల్లేదని చెప్తుంది. కాని మతాచరణలో అనేక మార్పులు జరుగుతుంటాయి. మారనిదల్లా మార్చడానికి అవకాశం లేదన్న అబద్ధం మాత్రమే. ఇతర మతాల్లోలాగే వేదాలను కూడా అపౌరుషేయాలని చెప్పారు. అంటే వాటిని పురుషులు(మనుషులు) రాయలేదని అర్థం. వేదాలు సులభంగా అర్థమయ్యేవి గావని అందులో పెక్కు శాఖలున్నాయని, వేదాలకు పరిమితి నిర్ణయించలేమనీ చెప్పారు. దానివల్ల హిందూ మతంలోకి దేనినయినా సులభంగా కలిపేసుకొని దాని అవశేషంగా మిగల్చే అవకాశం దక్కింది. బౌద్ధాన్ని , జైనాన్ని, సూఫీ బోధనలను, దర్గాలను, క్రైస్తవ బోధనలను ఒకటేమిటి సర్వం స్వీకరించి "వాతాపి జీర్ణం" అని త్రేన్చవచ్చు.

అలా చూస్తే బీజేపీ ప్రవచించే పరమత ద్వేషం మత పరమైంది కాదు. అది కేవలం రాజకీయపరమైంది. ముస్లింలపై, క్రైస్తవులపై అది విద్వేషం నూరిపోస్తుంది. మనుస్మృతి శూద్రులకు భావప్రకటనా స్వేచ్ఛను కూడా నిరాకరించింది. పైమూడు వర్ణాల వారిని విమర్శించకుండా వారికి శూద్రులు శుశ్రూష చేయాలని శాసిస్తుంది. కష్టం చేసే వాడికే కదా నిష్కామ కర్మ సిద్ధాంతం వర్తించేది. మానవుల్లో బ్రాహ్మణులు శ్రేష్ఠులని చెప్తుంది. భూమి మీద ఉన్న సంపద అంతటికీ బ్రాహ్మణుడే అర్హుడంటుంది. బ్రాహ్మణుడు ఈ పిండి వంటకం బాగుంది అంటే చాలు మరొకటి వేసుకొమ్మని కోరాలి. ఆ వంటకాన్ని దాచుకోరాదంటూ మనుస్మృతి చెప్తుంది. భోజన ప్రియత్వాన్ని నిసిగ్గుగా చెప్పుకొంది. పక్షులతో మొదలుపెట్టి ఖడ్గమృగం వరకు ఏ మాంసంతో శ్రాద్ధం పెడితే పితరులు ఎన్ని నెలల పాటు సంతృప్తిగా ఉంటారో మనుస్మృతి చెప్తుంది. పళ్లు, ధాన్యం కంటే బ్రాహ్మణుడికి మాంసంతో పెట్టే భోజనమే ప్రశస్తమనీ చెప్తుంది.

ఎవరిదీ కాని నిధి బ్రాహ్మణుడికి దొరికితే దాన్ని అతను పూర్తిగా తీసుకోవచ్చు. రాజుకు దొరికితే సగం బ్రహ్మణుల కిచ్చి సగం ఖజానాకు తరలించాలి. శూద్రుడు ఆస్తికి హక్కుదారుడు కాదు గనుక ఆ సమస్యేరాదు. బ్రాహ్మణుడిని తిడితే క్షత్రియునికి నూరు రూకలు, వైశ్యునికి 200రూకలు, శూద్రునికి దెబ్బలు దండనగా విధించాలి. బ్రాహ్మణుడు క్షత్రియుని తిడితే యాభై రూకలు వైశ్యుణ్ణి తిడితే 25రూకలు, శూద్రున్ని తిడితే 12రూకలు దండన విధించాలి. చట్టం ముందు అందరూ సమానమే సూత్రం వర్తించదు. శూద్రుడు ద్విజులను పాపిష్టివాడా అని తిడితే వాడి నాలుక కోసెయ్యాలి. ఎందుకంటే వాడిది హీనజన్మ అని స్మృతిలోని శ్లోకాలు చెప్తాయి. రాజ్యాంగం దృష్టిలోనేమో పౌరులందరూ సమానమే, మనుధర్మంలో శిక్షలు, దుస్తులు, ఆభరణాలు, ఆచారాలు వర్ణ, కులాలను బట్టి ఉంటాయి. మనం జాగ్రత్తగా చూస్తే పోలీసుల ప్రవర్తనలో ఇప్పటికీ మనుస్మృతి ని అనుసరించే ఉంటుంది. పోలీసులకు శిక్షణ కన్పిస్తుంది. పోలీసులకు రాజ్యాంగం, చట్టంతో పాటు మనుస్మృతి ని కూడా బోధించి, అందులోని చట్ట సహితం కాని పద్ధతులను పాటించరాదని నిర్దిష్టంగా చెప్పాలి.

(డిసెంబర్ 25 మనుస్మృతిని దహనం చేసిన రోజు)

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5 ఖమ్మం
ఆదివారం 24, డిసెంబర్ 2023

రెజొనెన్స్‌లో క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని రెజొనెన్స్ శ్రీనగర్‌లో క్రిస్ట్‌మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో నక్షత్రాల వెలుగులో, దేవదూతల ప్రకాశంలో, పశువుల పాకలో లోకరక్షకుని జననం...యావత్ ప్రపంచానికి శుభదినం, ఆ శుభదిన వేడుకను నిర్వహించారు స్కూల్‌లో చిన్నారుల సమక్షంలో కేక్ కట్‌చేసి క్రిస్ట్‌మస్ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. క్రిస్ట్‌మస్ చెట్టుతో, నక్షత్రాల కాంతులతో దేవదూతల వేషధారణలతో చిన్నారులు ప్రాంగణమంత క్రీస్తు జన్మస్థలాన్ని తలపించేలా అలంకరించారు. కొందరు చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలో బహుమతులను తోటి స్నేహితులకు పంచారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్చిన వాగ్దానాలు వంద రోజుల్లో అమలు చేస్తాం

- లంచాలు తీసుకుంటే అధికారుల భరతం పడతాం
- ఎన్ని కుట్రలు పన్నినా మీ అందరి దీవెనలతో గెలిచా
- రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ- కూసుమంచి

ఎన్ని కష్టాలు ఎదురైనా, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల స్కీములను వందరోజుల్లో అమలు చేస్తామని, రానున్న కొద్ది రోజుల్లోనే రాష్ట్ర ప్రజలకు తీపికబురు అందుతుందని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని, ఏ అధికారి కూడా ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పనిచేయాలని, తన గెలుపు కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రాష్ట్ర రెవెన్యూ శాఖ, గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాలేరు గ్రామంలో గల బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్టియన్ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే నూతన దుస్తులను



నియోజకవర్గంలోని నాలుగు మండలాల లబ్దిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపైన తప్పుడు కేసులు పెట్టారని, ఆ తప్పుడు కేసులను త్వరలోనే పరిష్కారం చేస్తామన్నారు. ఏ ఒక్క అధికారి కూడా ఇక్కడి నుంచి బదిలీ అయ్యే ప్రసక్తే లేదని, ప్రజలకు అందుబాటులో ఉండే సేవలు చేయాలని, అలా కాకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే తన కంటిచూపే సమాధానం అవుతుందని అధికారులను హెచ్చరించారు. గతంలో ఆగిపోయిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. మన రాష్ట్ర పక్కనున్న రాష్ట్రాల్లో కూడా మన కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని నమ్మకాన్ని మీకు ఇస్తున్నానని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఎన్నికల వరకే రాజకీయాలు, మేము కానీ, మా పార్టీ నాయకులు కానీ కక్ష పూరిత చర్యలకు పాల్పడబోమని తెలిపారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంత్రి కేక్ కట్ చేశారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలేరు గ్రామ సర్పంచ్ యడవల్లి మంగమ్మ, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ఎస్డీసి ఎం.రాజేశ్వరి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, విద్యుత్ శాఖ ఎడిఇ కొక్యా నాయక్, పాలేరు నియోజకవర్గ మండలాల తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిపిలు, జెడ్పిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బొగ్గుగని కార్మికుల పక్షాన 'సీఐటీయూ'ది నికార్సైన పోరాటం

- ఎస్‌సీఈయూ రాష్ట్ర కార్యదర్శి బలుగూరు మధు
- సింగరేణిలో సీఐటీయూ నాయకులు ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-సత్తుపల్లి

బొగ్గుగని కార్మికుల పక్షాన సీఐటీయూది నికార్సైన పోరాటమని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి బలుగూరు మధు అన్నారు. సింగరేణిలో ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘ ఎన్నికల సందర్భంగా సీఐటీయూ నాయకులు సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీ, సమంత క్యాంపు వద్ద కరపత్రాలు పంచుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సింగరేణి కార్మికుల నివాస సముదాయం వద్ద ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కార్మికులకు సొంతింటి కల సాకారం కావాలన్నా, మెరుగైన సౌకర్యాలు, పెర్క్స్‌పై ఇన్‌కం టాక్స్ రీయంబర్స్‌మెంట్ రావాలన్నా, కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్‌తో నాణ్యమైన విద్య అందించాలన్నా సీఐటీయూని గెలిపించాలన్నారు. 27న జరిగే గుర్తింపు సంఘ ఎన్నికల్లో సీఐటీయూ ఎన్నికల గుర్తు అయిన ఉదయించే సూర్యుడిపై ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకులు కూకట్ల శంకర్, మద్దినేని గణపతి, పగడాల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మాచర్ల గోపాల్, సత్తుపల్లి పిట్ కార్యదర్శి రమణ, ప్రకాశ్, నాగరాజు, ప్రసాద్, మంగరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు మల్లూరు చంద్రశేఖర్, కొలికపోగు సర్వేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రామకోటి మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని యం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కొరవి రామకోటి(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. రామకోటి మృతదేహంపై పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. రామకోటి జీవితాంతం ఎర్రజెండా నీడలోనే బతికాడని, తుది శ్వాస వరకు పార్టీలో ఉంటూ కీలకంగా పనిచేస్తూ, మత్స్యకార సంఘం కార్యదర్శిగా పది సంవత్సరాల పాటు సేవలందించిన చరిత్ర రామకోటిదన్నారు. రామకోటి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. మృతునికి నలుగురు కుమారులు ఉన్నారు. రామకోటి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు యండపల్లి వెంకట్రామయ్య, చావా నాగేశ్వరరావు, ఏపూరి వరకుమార్, జక్కంపూడి నాగేశ్వరరావు, వడ్లమూడి మల్లయ్య నాగేశ్వరరావు, మునిగంటి వెంకటేశ్వర్లు, పాపిట్ల సత్యనారాయణ, లాల్ బాబు, మత్స్యకార సంఘం అధ్యక్షులు తేనె సూరిబాబు, రామగిరి నాగరాజు, తేనె శీను, కొట్టే రామయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



విద్య, ఉపాధి కోసం జనవరి 1న ఛలో ఢిల్లీ

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్

ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-సత్తుపల్లి

అందరికి విద్య, ఉపాధి కల్పన కోరుతూ వచ్చే జనవరి 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ అన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. అనంతరం సంఘ పట్టణ కార్యదర్శి యశ్వంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకొనేందుకు, అందరికి ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని కోరుతూ ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

డిసెంబరు 28 నుంచి 31వరకు ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ ఉత్సవాలు

ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబరు 28 నుంచి 31 వరకు ఆవిర్భావ దినోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయిశేష, లక్ష్మీప్రసన్న, ఆశా, బేగం, విజయ, శృతి, సత్య కీర్తన పాల్గొన్నారు.



భగవద్గీత సారాంశం... కర్తవ్య బోధన

- సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

నవతెలంగాణ-సత్తుపల్లి

భగవద్గీత సారాంశం అనేది జీవితానికి దిశా నిర్దేశం చేస్తూ, కర్తవ్య దీక్షను బోధిస్తుందని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి అరుణకుమారి అన్నారు. గీతా జయంతి సందర్భంగా సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు భగవద్గీతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జడ్జి అరుణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి అరుణకుమారి మాట్లాడారు. మనలో విలువలు లోపించినప్పుడు, సందిగ్ధ స్థితిలో ఉన్నప్పుడు భగవద్గీత మార్గదర్శకం చేస్తుందన్నారు. అనంతరం జడ్జి అరుణకుమారి విజేతలకు బహుమతులు అందించారు. మండలంలోని సదాశివునిపాలెం ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని స్వర్ణలత గీతలోని ప్రథమ అధ్యాయంలోని 47 శ్లోకాలను వినిపించి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో సృజన నిర్వాహకులు గట్టే వాసు, గార్లపాటి రామకృష్ణ, బొల్లేపల్లి మధుసూదనరాజు, రమణమూర్తి, మాదిరాజు మాలతి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొర్రా వెంకటరావు, బ్రహ్మకుమారి సమాజం నుంచి ఎస్.వెంకటరావు, విశ్వశాంతి కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

- ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలి
- యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు

నవతెలంగాణ - బోనకల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని, ఉపాధ్యాయుల ప్రమోషన్స్ సత్వరం ప్రకటించేలా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండల అధ్యక్షుడు భూపతి ప్రీతం అధ్యక్షతన కాంప్లెక్స్ కమిటీల ఎన్నికల సమావేశం మండల కేంద్రంలో శనివారం జరిగింది. రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామిక ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని, పిఆర్సీని సాధ్యమైనంత త్వరగా ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈ కుబేరులో పెండింగ్లో ఉన్న బిల్లుని విడుదల చేయాలని, ఒకటో తేదీన వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. బదిలీ అయి రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని,కెజిబివి, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ జిల్లా కమిటీ



సభ్యులు సదాబాబు, మండల నాయకులు ఎంసీఆర్ చంద్రప్రసాద్, కే.రమేష్, పి.గోపాలరావు, పి.నరసింహారావు, జి.చిన్న రంగారావు, టి.లక్ష్మి, సీనియర్ నాయకులు నాగ మహేష్, కోటేశ్వరరావు, వి.అరుణకుమారి, ఆర్.మంజుష, కే.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండల కాంప్లెక్స్ కమిటీలు

బోనకల్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా బి.నరసింహారావు జడ్.పి. హెచ్.ఎస్ బోనకల్, కో కన్వీనర్లుగా ఆర్.శ్రీనివాసరావు, డి.అనిత ఎన్నికయ్యారు. జానకిపురం కాంప్లెక్స్ కన్వీనర్‌గా జె.కోటయ్య, కో కన్వీనర్లుగా ఎం.నారాయణ, వి.నాగమణి ఎన్నికయ్యారు. కలకోట కాంప్లెక్స్ కన్వీనర్‌గా వి మురళి, కో కన్వీనర్లుగా ఎం.లవకుశ, నసీమా సుల్తానా ఎన్నికయ్యారు.

పేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో న్యూలక్ష్మీపురం దళిత కాలనీలో ఏడుగురు నిరుపేద వృద్ధులకు క్రిస్మస్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని అదే గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారులు మహమ్మద్ ఖాసింబాబు శనివారం దుస్తులు వితరణగా పంపిణీ చేశారు. న్యూలక్ష్మీపురంలో వివిధ హిందూ, ముస్లింల పండగలకు పేదలు, నిరుపేదలు, వృద్ధులు, మహిళలకు గత మూడు సంవత్సరాల నుండి మహమ్మద్ ఖాసింబాబు తనవంతుగా దుస్తులు, చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. సమాజానికి, సామాజిక సేవలందిస్తున్న సామాజిక ఉద్యమకారులు మహమ్మద్ ఖాసింబాబును గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెల్లటూరి మైసయ్య, గ్రామ పెద్దలు కొట్టే శ్రీనివాసరావు, పి.మురళి, పి.నాగేంద్రబాబు, కనకం ముత్తయ్య, చెరుకూరి నాగేశ్వరరావు, సురభి శ్రీను, గంగరాజు, పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు మేరీ, శాంతా క్లాస్, దేవదూతల వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్‌పర్సన్ హృదయ మేనాన్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

క్రిస్టియన్లకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ - బోనకల్

క్రిస్మస్ పండగ సందర్భంగా క్రిస్టియన్ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న దుస్తులను తహసిల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ శనివారం క్రిస్టియన్ సోదరులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని దివ్య దయాల్ వద్ధాశ్రమంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన పేద క్రిస్టియన్ సోదరులకు ఈ దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్, వివిధ గ్రామాలకు చెందిన క్రిస్టియన్ ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-వైరా



గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం లయన్ కంటి హాస్పిటల్ నందు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మంది పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మరియు చిరు వ్యాపారి అయిన ముత్యం జీవనోపాధి నిమిత్తం నాలుగు చక్రాల బండిని అందించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ 75 మంది నిరు పేదలకు చలికాలంలో ఉపయోగపడే దుప్పట్లు పంపిణీ చేయటం అభినందనీయం అన్నారు. క్రిస్మస్ పండగ ప్రపంచంలో అతి పెద్ద పండుగని కార్యక్రమంలో పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఆర్థిక సహాయం అందించిన ఉండ్రు దంపతులను అభినందించారు. కార్యక్రమంలో జీఎంటి కో ఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు, ఉమెన్స్ కోఆర్డినేటర్ కొమ్మినేని భారతి, ఆర్‌సి లగడపాటి ప్రభకర్‌రావు జడ్‌సి డాక్టర్ శ్రీధర్ గౌడ్, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, కె.గోపి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ ట్రైనిటాట్స్‌లో క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని న్యూ ట్రైనిటాట్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచానికి క్రీస్తు అందించిన శాంతి సందేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సబితా, నసీరా, సంధ్య రాధాకృష్ణ, పర్వీన్, నాగమణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్‌ను గెలిపించారు

- 100రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- క్రైస్తవులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి

పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలందరి సమస్యలు పరిష్కారమవుతాయని, ఎన్నికల్లో మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు 100రోజుల్లోనే అమలయి తీరుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. క్రిస్ట్‌మస్ పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అందించిన దుస్తుల కిట్స్‌ను శనివారం కొత్తూరు రైతువేదిక వద్ద ఎమ్మెల్యే రాగమయి క్రైస్తవులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ 10 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా ఆదుకోనుందనే విషయం తేలిపోయిందన్నారు. మా కుటుంబాన్ని ఆదరించి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అందుబాటులో ఉంటూ మీ సేవ చేస్తూ ఉంటామని రాగమయి దయానంద్ స్పష్టం చేశారు.



నియోజకవర్గంలోని క్రైస్తవుల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా రాగమయి దయానంద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, తహసీల్దారు కూర్మా యోగేశ్వరరావు, ఎంపీడీవో జయరామ్, ఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షులు అలవాల కరుణాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తూరు ప్రభాకరరావు, చల్లగుళ్ల నరసింహారావు, కమల్‌పాషా, కౌన్సిలర్ దూదిపాల రాంబాబు, మందపాటి ముత్తారెడ్డి, రామ్మోహనరెడ్డి, నరేందర్‌రెడ్డి, క్రైస్తవ సంఘ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని తనగంపాడు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఎల్లప్పుడు వారికి అండగా ఉంటుందని దయాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తనగంపాడు సర్పంచ్ కేతినేని వేణు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు బోడ వెంకన్న, కందుకూరి వెంకటనారాయణ, విజయ్, నాగరాజు, ఉపేందర్, సంజీవరావు, హనుమంతరావు పాల్గొన్నారు.



చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నాం

- హామీల అమలుకు ప్రణాళికంగా ముందుకు
- వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్‌నాయక్
- కారేపల్లిలో క్రిస్టియన్ సోదరులకు దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-కారేపల్లి

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. శనివారం కారేపల్లి మండలంలో ఆయన పర్యటించారు. కారేపల్లిలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో క్రిస్టియన్ సోదరులకు ప్రభుత్వం పంపిణి చేసిన దుస్తులను అందజేశారు. కిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్స్ ఆధ్వర్యంలో ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 6 హామీల అమలుకు ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని,



గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మీ పోరాటాలకు అండగా నిలబడ్డామని, త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

ఆలయాల్లో పూజలు చేసిన ఎమ్మెల్యే

ముక్కోటి ఏకాదశి పురష్కరించుకోని కారేపల్లి మండలం కొత్తూరుతండా, కారేపల్లిలోని ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. కారేపల్లి దేవదాయశాఖ ఆధ్వర్యంలో సంత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనము ఏర్పాటు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, ఈవో నల్లమోతు శేషయ్య, ఆలయ అర్చకులు శ్రీనివాసులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈకార్యక్రమాలలో ఎంపీపీ మాలోత్ శకుంతలకిషోర్, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, డైరక్టర్ బానోత్ హీరాలాల్, ఎంపీటీసీలు ఇమ్మడి రమాదేవి, ఆలోత్ ఈశ్వరినందరాజ్, బానోత్ రమేష్, సర్పంచ్‌లు ఆదెర్ల స్రవంతి, ఆజ్మీర నరేష్, మొగిలి ఆదినారాయణ, మాలోత్ కిషోర్, బానోత్ సక్రాం, లక్ష్మన్, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, సురేందర్‌మనియార్, దారావత్ భద్రునాయక్, బానోత్ రాంమ్మూర్తి, మేదరి వీరప్రతాఫ్, గడ్డం వెంకటేశ్వర్లు, గుగులోత్ భీముడు, పొలగాని శ్రీనివాస్, సపావట్ నాగులు, నూనావత్ సాయికిరణ్, సురపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-వైరా

మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం అమ్మకం విషయంలో రైతులు దళారులను నమ్మి మోసోవద్దని, ప్రతి రైతు తమ పంటను నిబంధనలు పాటించి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మచ్చా బుజ్జి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్డా పుల్లయ్య, ఏఎంసి మాజీ చైర్మన్ బిడికె.రత్నం, లక్ష్మి పురం దేవస్థానం మాజీ చైర్మన్ నూతి వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ మడుపల్లిలో రక్త వర్గ పరీక్షలు

నవతెలంగాణ-మధిర

నెలలో ప్రతి నాలుగో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా జడ్పీహెచ్ఎస్ మడుపల్లిలో తొమ్మిదవ తరగతి విద్యార్థులైన ఎస్.రమ్య యం. ప్రగతి, ఎన్.హేమలత, టి.మనీషాలు పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు రక్త వర్గ పరీక్షలు చేసి బ్లడ్ గ్రూప్ కనుగొని విద్యార్థులకు తెలియజేశారు.ఈ విద్యార్థులకుప్రధానోపాధ్యాయులు సిహెచ్. సాధు సమాధానం ఈ పరీక్షలకు కావలసిన రియే జంట్స్ అందజేసి శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులే స్వయంగా రక్త వర్గ పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ గ్రూపుల పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట నరసింహారావు, బూసా కోటేశ్వరరావు, పైడిపల్లి కిషోర్, జె.యెహొూషువ, టి.జ్యోతిర్మయి, బి.చైతన్య, బి.రాణి, సిహెచ్. చిట్టిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సీతా రాముల స్వామి వారి ఊరేగింపు

నవతెలంగాణ-తల్లాడ

ముక్కోటి ఏకాదశి నీ పురస్కరించుకొని మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో శనివారం శ్రీ సీతారాముల స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎర్రి కృష్ణ రావు ఎర్రి నరసింహారావు, చెరుకూరి నరసయ్య కటిక కిరణ్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

25న ఉచిత బస్ పాసులు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

ఈ నెల 25న కొత్త బస్టాండ్‌లో అర్హులైన వికలాంగులందరికీ ఉచితంగా 50 శాతం రాయితీతో కూడిన బస్ పాసులను పంపిణీ చేయనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ రాజలక్ష్మి తెలిపారు. దివంగత మాజీ సర్పంచ్ పసుమర్తి పద్మావతి జ్ఞాపకార్థంగా వారి పుట్టినరోజు సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు ఆర్థిక సహాయంతో చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వికలాంగులు అందరూ సదరం సర్టిఫికెట్ తీసుకొని ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని కోరారు.



క్రిస్మస్ కానుకగా చీరల పంపిణీ

- ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్

నవతెలంగాణ-వేంసూరు

క్రిస్టమస్ సందర్భంగా మండలంలో 180 మందికి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక నందు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గారెంటీ పథకాలను అమలు చేసి తీరుతుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేగా మా కుటుంబం ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ చేదోడు వాదోడుగా ఉంటామని తెలిపారు. కరోనాకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లయితే అధిగమించవచ్చని అన్నారు లింగపాలెంలో వివాదాస్పదంగా ఆగిపోయిన ఎస్సీ కార్పొరేషన్ చెక్కులు ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎంఏ.రాజు, ఈఓఆర్డి రంజిత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు వెల్ది జగన్ మోహన్ రావు, ఎంపీటీసీ రాఘవరెడ్డి, గన్నేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-పెనుబల్లి

సత్తుపల్లి శాసనసభ్యులు మట్ట రాగమయి క్రిస్టమస్ సందర్భంగా శనివారం క్రైస్తవులకుదుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పెనుబల్లి తాసిల్దార్ కార్యాలయంలో 12 మంది కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు ఆకాంక్షలను నెరవేరుస్తామని తప్పకుండా నెరవేరుస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన ప్రతికుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, మేక తొట్టి కాంతయ్య, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

మధిర : వసుర గ్రూప్స్ అధినేత పబ్బతి రవి సహకారంతో మధిర మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు క్రిస్టమస్ పండుగ సందర్భంగా శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతి రవి కుమార్ మిత్రుడు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మునిసిపల్ చైర్మన్ లత జయకర్ మొండితోక, కమిషనర్ రమాదేవి, కౌన్సిలర్స్ చేతుల మీదుగా దుస్తుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా రంగా హనుమంతరావు మాట్లాడుతూమా మిత్రుడు పబ్బతి రవి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మునిసిపాలిటీలో పనిచేస్తున్న సుమారు 100 మంది పారిశద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ కార్యక్రమం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ లత జయకర్ మొండితోక, కమిషనర్ రమాదేవి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీవీ. నరసింహారావు వర్ధంతి

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో శనివారం పివి.నరసింహారావు 19 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. టిపిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా ఐఎన్టీయుసీ అధ్యక్షులు కొత్తా సీతారాములు నాయకులతో కలిసి పివి. నరసింహారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, పాలకుర్తి నాగేశ్వరరావు, కూల్ హెూమ్ ప్రసాద్, దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు, కొట్టేముక్కల నాగేశ్వరరావు, సంపటం నరసింహరావు, నగర కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, నగర కాంగ్రెస్ నాయకులు నుకారపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మధిర : తొలి తెలుగు ప్రధాని, గొప్ప ఆర్థిక సంస్కరణ వేత్త తెలంగాణ ముద్దు బిడ్డ, బహుభాషావేత్త పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురం శెట్టి కిషోర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్, సర్పంచ్ పులిబండ్ల చిట్టిబాబు, మండల కిసాన్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వరరెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలరు మునుగోటి వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జహంగీర్, మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటి, పట్టణ ఐ ఎన్‌టియుసి అధ్యక్షుడు షేక్ బాజీ, కాంగ్రెస్ నాయకుడు కర్నాటి రామారావు, నిడమనూరి వంశీకృష్ణ, పాటిబండ్ల సత్యంబాబు, జిల్లేపల్లి బాబూరావు, అదురీ శ్రీను మొదలగువారు పాల్గొన్నారు.

మేడేపల్లిలో మిర్చితోట పరిశీలన

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో మేడేపల్లి గ్రామానికి చెందిన జూలకంటి రంగారెడ్డి అనే రైతు నాథ్ కంపెనీ చిల్లీ సీడ్స్ వారి విత్తనాలతో మిర్చితోటను సాగు చేయగా నాథ్ కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ ఆర్ఎమ్ రాజారెడ్డితో పాటు,ఎంపిపి సామినేని హరిప్రసాద్ శనివారం మిర్చితోటను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా తోటలో కలయతిరిగి తోట దిగుబడి బాగుందని సాగు చేసిన రైతు సంజీవరెడ్డి తోపాటు, కంపెనీ ప్రతినిధులను ఎంపిపి సామినేని హరిప్రసాద్ ప్రశంసించారు. అనంతరం మిర్చితోట సాగుచేసిన రైతు జూలకంటి సంజీవరెడ్డిని తోటలోని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యూలక్ష్మీపురం గ్రామసర్పంచ్ వాగదాని కన్నయ్య, ముదిగొండ సొసైటీ డైరెక్టర్ దేవరపల్లి అనంతరెడ్డి, నాథ్ సిడ్స్ ఆర్ఎం రాజారెడ్డి, భారతి సీడ్స్, డిస్ట్రిబ్యూటర్ ఏపూరి ఉపేందర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

పార్లమెంటు సభ్యుల తొలగింపు అప్రజాస్వామ్యకం

- **సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి**

నవతెలంగాణ-పెనుబల్లి



ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను పార్లమెంటు నుండి సస్పెన్షన్ విధించడం ప్రజాస్వామ్యాన్ని అస్థిరతపరిచినట్లేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. శనివారం సీపీఐ(ఎం) పెనుబల్లి మండల కమిటీ సమావేశం చలమాల నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నియంతృత్వ పోకడతో ప్రభుత్వం ఏలుతోందన్నారు. ప్రతిపక్ష సభ్యులపై గౌరవం లేకుండా ప్రభుత్వం లెక్కలేనితనంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికలు ఓట్లు సీట్లు గీటురాయిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) పోరాడదన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ మరింత ఉత్సాహంతో ప్రజా సేవే పరమావధిగాప్రజా సమస్యలపై మిలిటెంట్ గా పోరాటాలు సాగిస్తామన్నారు. ఉపాధి హామీ చట్టం, పోడు భూముల పట్టాలు, ప్రతి పేద కుటుంబానికి నిలువు నీడ దొరికే వరకు పోరాడుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పరచాలని ఆ పార్టీ నిర్వహించే ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు చేస్తే స్వాగతిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, చలమాల విఠల్‌రావు, సీపీఐ(ఎం)మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, తాండ్ర రాజేశ్వరరావు, మేకల బాజీ, నాగమణి, గుడిమెట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎన్డీ నాయకుడు కోటేశ్వరరావు మృతి

- **నివాళులర్పించిన న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎం), ప్రజాపంథా, ఆమ్ ఆద్మీ, టీడీపీ నాయకులు**

నవతెలంగాణ-కొణిజర్ల



సీపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు ముత్తనబోయిన కోటేశ్వరరావు(85)అనారోగ్యంతో శనివారం ఉదయం మరణించారు. తెలంగాణా సాయుధ పోరాటం నుండి నక్సలైట్ ఉద్యమంలో పాల్గొని 1969 నక్సల్బరీ కార్యకర్తగా, విప్లవ నాయకుడుగా తెలంగాణా ప్రాంతానికి వచ్చి ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తీగలబంజర గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. కోటేశ్వరరావు మరణవార్త తెలుసుకున్న న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నాగన్న కోటేశ్వరరావు మృతదేహంపై న్యూడెమోక్రసీ జెండా కప్పారు. అనంతరం సీపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ వైరా సబ్ డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం అధ్యక్షతన జరిగిన సంతాప సభలో నాగన్న, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ నల్లమోతు తిర్మల్, టీడీపీ మండలాధ్యాక్షుడు తాతా సుధాకర్‌లతోపాటు పలువురు వక్తలు మాట్లాడారు. కోటేశ్వరరావు భౌతికదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కోటేశ్వరరావు జీవితం తెరిచిన పుస్తకమని తుదిశ్వాస వరకు తన జీవితాన్ని పేదప్రజలకోసం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. కోటేశ్వరరావు ఇల్లు ఉద్యమాలకు కేంద్ర బింధువుగా ఉండేదన్నారు. కుటుంబ సభ్యుల కన్న పార్టీనే మిన్నగా భావించిన మంచి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు గా చరిత్రలో నిలిచిపోయారన్నారు. 1963లోకమ్యూనిస్టు చీలిక సమయంలో సీపీఐ(ఎం) వైపు, 1969 నక్సలైట్ ఉద్యమం తర్వాత విప్లవ కారులవైపు ఆయన నిలిచారు. చంద్రపుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య లాంటి విప్లవోద్యమం అగ్రనేతలతో సాన్నిహిత్యం ఉన్న మనిషిగా గుర్తింపు పొందారు. కోటేశ్వరరావు మరణం ఒక్క న్యూడెమోక్రసీ పార్టీకి మాత్రమే కాదని అన్ని ఎర్రజెండా పార్టీలకు తీరనిలోటన్నారు. కోటేశ్వరరావు సతీమణి నారాయణమ్మ గత నాలుగు సంవత్సరాల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. నలుగురు కూమారులు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు కె.అర్జున్‌రావు, అశోక్, సీవై. పుల్లయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బోంతు రాంబాబు, తాళ్లపల్లి క్రిష, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, న్యూడెమోక్రసీ నాయకులు ఆంగోత్ బాషా, పఠాన్ ఖాసీంఖాన్, ఆమ్ ఆద్మీ జిల్లా నాయకులు స్వర్ణ సుబ్బారావు, దామా వీరయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్, సంగమేశ్, చింతనిప్పు చలపతిరావు, జట్ల ఆనందరావు, కట్టా రాంబాబు, మహమ్మద్ ఆలీ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

కోటేశ్వరరావు కళ్లని నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు

ఖమ్మం నేత్రనిధికి కోటేశ్వరరావు కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు.

కోటేశ్వరరావు మరణం పట్ల ప్రెస్ క్లబ్ సంతాపం

మండల సీనియర్ జర్నలిస్ట్ (నవభూమి) ముత్తనబోయిన శ్రీనివాస్ రావు తండ్రి కోటేశ్వరరావు మ్రుతి పట్ల మండల ప్రెస్ క్లబ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.కోటేశ్వరరావు మ్రుతదేహన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్ (ఆంధ్రజ్యోతి), రాజశేఖర్(ఈనాడు), (ప్రజాపక్షం)వై నరసింహారావు, షేక్ నాగుల్ మీరా (నవతెలంగాణ), పగడాల మధు (సూర్య) తదితరులు పాల్గొన్నారు.



యాదగిరి గుట్టలో తుమ్మల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఖమ్మం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి శనివారం యాదగిరి గుట్ట లక్ష్మి నరసంహస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా పాడి, పంటలతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు.



నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై జనవరి 12న చలో పార్లమెంట్

నవతెలంగాణ-ఖమ్మం

బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం.-(ఎన్ఈపి-2020) రద్దుకై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జనవరి 12 న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా కాషాయకరణ, కార్పొరేట్ కరణ, ప్రైయివేటీకరణకు తెగపడుతున్న బిజేపి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణ కీ విద్యాసంస్థలు కేటాయించకుండా బిజేపి ప్రభుత్వం కక్ష్య పూరితంగా వ్యవరిస్తునదని విమర్శించారు. బిజేపి అవలంబిస్తున్న విధానాలు అప్రజస్వామ్యకమని, ప్రజాస్వామిక మనుగడకు మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. జనవరి 12న జరిగే చలో పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు షేక్ నాగుల్ మీరా, కౌశిక్, రాకేష్, ప్రతాప్, రోహిత్, కిరణ్, నరేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని బీటెక్, ఎంబీఏ, డిప్లొమా, అన్ని బ్రాంచీల గణిత విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ నమూనాలతో మ్యాథ్స్ ఎక్స్‌పో నిర్వహించారు. అనంతరం యాజమాన్యం విద్యార్థులకు గణితంపై క్విజ్‌పోటీలు నిర్వహించి ఇరు కార్యక్రమాల విజేతలకు ప్రిన్సిపల్ ఊటుకూరి శేషారత్నకుమారి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామానుజం గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, వివిధ బ్రాంచీల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



త్రివేణి పాఠశాలలో....

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని త్రివేణి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో రంగు కాగితాలతో నక్షత్రాలతో అలంకరించి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.ఆటలు పాటలు నాటికల రూపంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్మార్ట్ కిడ్జ్‌లో....

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ సంబురాలు నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలియజేసే సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మేరీ మాత పశువుల పాకలో బాల యేసుకు జన్మనివ్వడం, దేవదూతలు గొర్రెల కాపర్లు ఆశీర్వాదాలు అందించడం, వేగుచుక్క ప్రభువు జన్మస్థానాన్ని తెలియచెప్పే సన్నివేశాలలో పాఠశాల చిన్నారులు వేషధారణలతో అబ్బురపరిచారు. మేరీ మాత, శాంతా క్లాజ్, క్రిస్మస్ ట్రీ, దేవదూతలు, గొర్రెల కాపరుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏసుప్రభువు జన్మదినం క్రిస్మస్ ప్రపంచానికే పెద్ద పర్వదినం అని, కరుణామయని బోధనలు అందరికీ మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రెజోనెన్స్ పాఠశాలలో...

ఖమ్మం శ్రీనివాసనగర్‌లో రెజోనెన్స్ పాఠశాలలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు తెల్లని వస్త్రాలు ధరించి దేవతల రూపంలో, మరికొంత మంది శాంతాక్లాస్ వేషధారణలో అందరినీ అలరించారు. పాఠశాల ఆవరణం అంతా విద్యుత్ దీపాలతో, నక్షత్రాలతో, రంగురంగుల కాగితాలతో అలంకరించి, పశువుల పాక నిర్మించి, యేసుక్రీస్తు జన్మించిన స్థలాన్ని యేసు వృత్తాంతాన్ని బొమ్మల రూపంలో, విద్యార్థుల నృత్యాలతో తెలియజేసి, ప్రదర్శించటం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి. నాగేంద్రకుమార్, నీలిమా మాట్లాడారు. అనంతరం పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సర్వజ్ఞ పాఠశాలలో....

నగరంలో విడి.వోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నక్షత్రాల వెలుగులో, దేవదూతల ప్రకాశంలో, పశువుల పాకలో లోకాన్ని రక్షించటం కోసం, పాపాన్ని విమోచించటం కోసం రిక్తునిగా జన్మించిన యేసుక్రీస్తు జననం యావత్ ప్రపంచానికి శుభదినం. ఈ శుభదినాన్ని వి.డి. వోస్ కాలనీ సర్వజ్ఞ పాఠశాలలో కళ్ళకు కట్టినట్లు సెమీ క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్మహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చంద్రశేఖర్, పాఠశాల డైరెక్టర్స్ నీలిమ , ఆర్.వి నాగేంద్రకుమార్ ,ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైరా : న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సెమి క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమైనవి. ఈ వేడుకలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదే విధంగా ఏసుక్రీస్తు జన్మించిన పశువుల పాకను ఏర్పాటు చేసి, బాల ఏసును అందులో కూర్చోండ బెట్టారు. సెమి క్రిస్మస్ వేడుకలలో భాగంగా విద్యార్థులు ఏసుక్రీస్తును స్తుతించుతూ పాటలు పాడి నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో "శాంతాక్లాజ్" ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరెస్పాడెంట్ డాక్టర్ పి. భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ మనం తెలిసి తెలియక చేసిన పాపాలను క్షమించడానికి ఈ భూమిమీద అవతరించిన శక పురుషుడు ఏసుక్రీస్తు అన్నారు. డిసెంబర్ 25, క్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకొని మనం క్రిస్మస్ పండుగను ఆనందంగా-జరుపుకుంటున్నాం అన్నారు. క్రిస్మస్ పండుగ శాంతి, సంతోషం, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని, సాటి మనిషిపై దయ, కరుణ, జాలి కలిగి ఉంటూ మన జీవనాన్ని కొనసాగించాలని ఆయన బోధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆయన చూపెట్టిన మార్గంలో నడుస్తూ ఆదర్శంగా జీవించాలని హితవు పలికారు. మనిషి మానవత్వంతో మసిలితే మహా పురుషుడుగా మారతాడని ఏసుక్రీస్తు నిరూపించడం జరిగిందని అన్నారు. ప్రతి విద్యార్థి సాటి వారిపై మనవత్వాన్ని ప్రదర్శించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీమాథ్యూ, ఏఓ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మధిర

మధిర : ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని భరత్ విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు పాఠశాల అధినేతలు శీలం విద్యాలత వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల ఆరోగ్య పర్యవేక్షకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో యేసు ప్రభు జీవితం పై జానపద పాటల కార్యక్రమం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విద్యాసంస్థల అధినేతలు శీలం విద్యాలత వెంకటరెడ్డి సెమీ క్రిస్మస్ కేకును కట్ చేసి ఏసుప్రభు జీవితాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పశువులపాక, చూపరులని ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శీలం విద్యాలత వెంకటరెడ్డి దంపతుల కుమారుడు శీలం భరత్‌రెడ్డి సతీమణి సౌజన్య వారి కుమారుడు ఆదర్శ్, కుమార్తె ఆద్యా, పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, నాగరాజు, అజీమ్, పాషా, గణేష్, రమేష్, ప్రశాంతి, హెప్సిబ, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి : మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్‌బో పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎండి ఏర్షద్ అహ్మద్ మాట్లాడుతూ... అన్ని మతాలను సమానంగా ఆదరిస్తూ మంచి నడవడికతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాంటా క్లాజ్ వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. అలాగే కేక్ కటింగ్ చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థిని విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ పాపారావు, అకాడమిక్ ఇంచార్జ్ ఇంతియాజ్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుదినం_జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం 24, డిసెంబర్ 2023

మత సామరస్యమే ప్రభుత్వ లక్ష్యం

- క్రిస్టమస్ కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే కోరం



నవతెలంగాణ-ఇల్లందు

భారత దేశం లౌకిక దేశమని అన్ని మతాలను సమానంగా చూస్తూ మత సామరస్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ కోరం కనకయ్య అన్నారు. స్దానికి సిఇఆర్ క్లబ్‌లో శనివారం పేదలకు క్రిస్మస్ కిట్లు పంపిణీ చేశారు. తొలుత కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఇల్లందు పట్టణం, మండలంలో సుమారు 300, టేకులపల్లికి 200, కామేపల్లి, గార్ల, బయ్యారం మండాలకు 150 చొప్పున పేదలకు నూతన వస్త్రాల కిట్‌లు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రిస్మస్ పండుగ రోజు పేదలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ అంకెపాక నవీన్, సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ రాము, తహశీల్‌దార్ రవికుమార్, ఇఓఆర్డిఓ చిరంజీవి కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అద్యక్షులు డానియెల్, పులి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపు

- విలేకర్ల సమావేశంలో నాయకులు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం ఘన విజయం సాదింస్తుందని నాయకులు తెలిపారు. శనివారం చంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెంలో టిబిజికేఎస్ నుండి ఐఎన్‌టియూసీ భారీ చేరికలు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో ఐఎన్‌టియూసీ సంఘం ఘన విజయం సాదింస్తుందని చెప్పారు. టిబిజికెఎస్ కార్మిక సంఘం నుండి పలువురు నాయకలు ఐఎన్‌టియుసి కార్మిక సంఘం చేరికలతో బలోపేతం అయిందని ఐఎన్‌టియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్ నాయక్, జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ అల్బర్ట్, సోమిరెడ్డి, ఎండి రజాక్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తూము చౌదరి, ఆళ్ల మురళి, చీకటి కార్తీక్‌లు చెప్పారు. సింగరేణి కార్మిక కుటుంబాలక కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని, ఈసారి జరిగే సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలలో ఐఎన్‌టియూసీ కార్మిక సంఘాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం లోనే సింగరేణి ఉద్యోగులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, సింగరేణి కార్మికులందరికి సొంత ఇంటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని, కార్మికులకు ఇన్ కంటాక్స్ యాజమాన్యంచే కట్టిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, జేబీ.మోహన్, విజేందర్, గోపు కుమార్, చిలకా రాజయ్య, ఎస్‌కె. గౌస్, చేరిపేల్లి నాగరాజు, సత్తార్ పాష, సకినాల మధు, భీముడు, రాజశేఖర్, చిట్టి బాబు, పోచం శ్రీనివాస్, కొమరయ్య ఎస్‌డి. గౌస్, మధు, సత్యనారాయణ, ప్రభాకర్, చిరంజీవి, భరత్, శ్రీధర్ బాబు, కార్మికులు పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీలో పలువురు చేరికలు

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో టీబీజీకేఎస్ అనుబంధ సంఘం నుండి ఐఎన్‌టీయూసీలో పలువురు చేరినట్లు శనివారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సింగరేణి అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ కార్మికుల ఆత్మీయ సమావేశంలో, ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్యను ఘన సన్మానం చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ సింగరేణి అనుబంధ సంఘం టీబీజీకేఎస్ నుండి 25 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీ ఐఎన్‌టీయూసీలో సింగరేణి కార్మికులు ఎమ్మెల్యే సమక్షంలో చేరారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ మంగీలాల్ నాయక్, గడ్డం మధురెడ్డి, పోషాలు, సంజయ్, హరి, సర్దార్, నాయకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి : పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో చదువుకుంటున్న 2600 మంది 10వ తరగతి విద్యార్థులు పదవ తరగతిలో అత్యున్నత ఫలితాలు, 10/10 జిపిఏ సాధించడం కోసం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూపొందించబడిన ప్రత్యేక స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఐటీడీఏ పీఓ పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి తెలుగు, హిందీ, గణితం, ఇంగ్లీష్, ఫిజిక్స్, బయలాజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం విషయాలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందించారు. అట్టి స్టడీ మెటీరియల్ని పీఓ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ 100 రోజుల ప్రణాళికను రూపొందించి అమలు చేయడం, రోజు వారీ పరీక్షల మార్కుల ఆధారంగా తక్కువగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక బోధన జరిపి వెనుకబడిన విద్యార్థులు కూడా మెరుగైన మార్కులు సాధించడం, అలాగే ఏ, బి గ్రేడ్‌లో మార్కులు సాధిస్తున్న విద్యార్థులు ఏ-1 గ్రేడ్, 10/10 జీపీఏ సాధించడానికి ఈ స్టడీ మెటీరియల్ దోహదపడుతుందన్నారు. కనుక ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్స్ ప్రణాళిక బద్ధంగా వీటిని ఉపయోగించి విద్యార్థులందరూ 100% ఉత్తీర్ణతతో పాటు 10/10 జీపీఏ సాధించడానికి కృషి చేయాలని ప్రాజెక్ట్ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ టిడబ్ల్యూ భద్రాచలం పి.మణెమ్మ, ఏసీఎంఓ టి.రమణయ్య, ఏటీడీఏ భద్రాచలం పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ కమిటీ సభ్యత్వానికి చిట్టిబాబు రాజీనామా

నవతెలంగాణ-దమ్మపేట

గత నెల 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ఓటమి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో దమ్మపేట శివాలయ ఎండోమెంట్ కమిటీ సభ్యుడిగా ఉన్న పానుగంటి వీరవెంకట సత్యనారాయణ (చిట్టిబాబు) శివాలయ పాలక వర్గ సభ్యుడిగా బీఆర్ఎస్ పార్టీ ఓటమి పొందడంతో నైతిక బాధ్యత వహిస్తూ కమిటీ సభ్యుడిగా తన రాజీనామాను శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పానుగంటి చిట్టిబాబు మాట్లాడుతూ రాజకీయాల్లో హుందాతనంగా గౌరవ మర్యాదలతో కూడి విలువలతో రాజకీయాలు చేయాలనే ఉద్దేశ్యంతో తాను శివాలయ కమిటీ నుండి వైదొలగడానికి తాను నిర్ణయం తీసుకుని పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

క్రిస్మస్ కానుకలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సుజాతనగర్



మండల కేంద్రంలోని కల్వరి సీయోను ప్రార్ధన మందిరంలో శనివారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. అనంతరం పాస్టర్ పాల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా కప్పి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా, సొసైటీ ఛైర్మెన్ మండే హనుమంతరావు, తహసీల్దార్ శిరీష, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సిపిఐ మండల సంయుక్త కార్యదర్శి కుమారి, హనుమంతరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వేల్పుల భాస్కర్, సుజాత, టౌన్ సెక్రటరీ చెరుకూరి రామారావు, ఎంపీటీసీ బత్తుల మానస, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భూలోకంలో సాక్షాత్కరించిన 'వైకుంఠం'

శోభమాయంగా సాగిన సీతారాముల ఉత్తర ద్వార దర్శనం

భూలోకంలో సాక్షాత్కరించిన వైకుంఠ రామున్ని శ్రీరామ నామ జపం చేస్తూ ఎముకలను కొరికే చలిని సైతం లెక్కచేయకుండా అర్ధరాత్రి నుండే బారులు తీరి భద్రాద్రి రామయ్య దర్శనం చేసుకొని పులకించిన భక్తజనం.

స్వామివారిని గరుడ వాహనంపై తిరువీధి సేవలో ఊరేగించిన అధికారులు







నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామయ్య ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు జై శ్రీరామ్..జై జై శ్రీరామ్ అంటూ జయ జయధ్వానాలు చేశారు. వేదపండితులు ముక్కోటి విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్‌లతో పాటు ఇతర సెక్టార్లలోని భక్తులు వేడుకను తిలకించారు. స్థానాచార్యులు భక్తులకు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. అర్చకులు 108 ఒత్తులతో వెలిగించిన హారతిని భక్తులు అందుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా దర్శనం తర్వాత ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్ని ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్లు పర్యవేక్షణకు జిల్లా అధికారులను, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ డాక్టర్ వినీత్.జి పర్యవేక్షించారు. వేడుకలకు ఉప ముఖ్యమంత్రి సతీమణి మల్లు నందిని బట్టి విక్రమార్క, భద్రాచలం, పినపాక, ఇల్లందు, అశ్వారావుపేట శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఖమ్మం కలెక్టర్ వి.పి.గౌతం దంపతులు, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ దంపతులు, అదనపు కలెక్టర్లు డాక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, ఎఎస్పీ పంకజ్ పరితోష్, దేవస్థానం ఈఓ రమాదేవి తదితరులు హాజరయ్యారు.

గరుడ వాహనరూపుడైన రామచంద్రుడు భక్తులకు శ్రీమహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి విశేష ఆరాధన, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వే చాలు, గరుడ ప్రబంధాలు, ఇతిహాసాలు, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతకాన్ని పఠించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతినిచ్చారు. భక్తరామదాసు కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీని వాస్ మూలవరులకు స్నపనం నిర్వహించారు.

ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చిన అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు తరలివెళ్లారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండా కమ్మ వారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మ వారు, గరుడ వాహనంపై శ్రీరామచంద్రమూర్తుల తిరువీధి సేవ సాగింది. మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేదమంత్రోచ్చారణ మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలు ప్రారంభం.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం

అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం విజయవంత కావడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా హర్షం వ్యక్తం చేశారు. సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాలు నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన భక్తులకు, పాత్రికేయులకు ధన్యవాదాలు తెలిపారు.

-: కలెక్టర్ ప్రియాంక అలా



అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పది

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతెలంగాణ-చంద్రుగొండ

అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని మద్దుకూరు గ్రామంలో గల శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఎమ్మెల్యే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని యువతకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరికి చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోజా నాయక్, సారేపల్లి శేఖర్, ఉప్పతల ఏడుకొండలు, తుమ్మలపల్లి సురేష్, నల్లమోతు రమణ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షేక్ అన్వర్, మండల కాంగ్రెస్ నాయకులు బడుగు శంకర్, సంక శంకర్, బుంగ శ్రీను, ద్రోణ వెల్లి చలపతి, సర్పంచులు పద్దం వినోద్, రుక్మిణి ఆలయ కమిటీ సభ్యులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశం, రాష్ట్రంలో బొగ్గు బ్లాక్‌ల ప్రయివేటీకరణ

నవతెలంగాణ-మణుగూరు



దేశం, రాష్ట్రంలో బొగ్గు బ్లాక్‌ల ప్రయివేకరణ జరుగుతుందని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. శనివారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలోని ఓసీ4 నందు ఎలక్షన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం బొగ్గుబ్లాక్‌ల ప్రయివేటీకరణ కోసం తెచ్చిన ఎన్ఎమ్‌డీఆర్ చట్టాన్ని టీజీబీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎంపీలు అనుకూలంగా ఓటు వేసి ఆ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదింప చేశారని దాని ఫలితంగా నేడు దేశం, రాష్ట్రంలో బొగ్గు బ్లాక్ ల ప్రైవేటీకరణ జరుగుతుందని అన్నారు. సింగరేణిలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం అత్యంత ఆసక్తికరంగా జరుగుతుందని అన్నారు. కార్మికులందరూ ఏఐటీయూసీతోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నిర్ణయానికి వచ్చారని అన్నారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కార్మికుల ఆశలు వారికి ఇచ్చిన హామీలను మరిచిపోయి కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం కేవలం పైరవీలకే పరిమితమైనారు అని అన్నారు. సింగరేణి బొగ్గు బావులలో బొగ్గు వెలికి తీసే ప్రక్రియ సింగరేణి కార్మికులతోనే జరిపించాలని 2003 సంవత్సరంలో ఏఐటీయూసీ అగ్రిమెంట్ చేయించిందని ఆ అగ్రిమెంట్‌ని టీజీబీకేఎస్ చేతగానితనం వలన నేడు అన్ని మైన్స్‌లలో అవుట్ సోర్సింగ్ పేరుతో ప్రైవేట్ వారికి అప్పజెబుతున్నారని అన్నారు. మాయమాటలతో ఎల్లకాలం కార్మికులను మోసం చేయలేరని, ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమితోనే యూనియన్ ఆస్తిత్వమే ప్రశ్నార్థకం అయిపోయిందని అన్నారు. ఎందరో త్యాగధనులు అమరవీరులు స్థాపించిన ఏఐటీయూసీ ఎర్రజెండా కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతుందని అన్నారు. యువ కార్మికులందరూ చైతన్యంతో కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత మణుగూరులో మెడికల్ ఇన్వాల్యుడేషన్ అయిన కార్మికుల పిల్లలకు మణుగూరులో అపాయింట్మెంట్ ఇప్పిస్తామని, మెడికల్ ఇన్వాల్యుడేషన్‌లో అవినీతి లేకుండా చేస్తామని, కార్మికులకు డబల్ బెడ్ రూమ్ క్వార్టర్ సదుపాయం కల్పిస్తామన్నారు. తదితర హామీలను తెలిపారు. నిరంతరం కార్మికుల హక్కుల రక్షణ సంస్థ పరిరక్షణ కోసం పోరాడే ఏఐటీయూసీ ఎర్రజెండా గుర్తు నక్షత్రం పైనే తమ అమూల్యమైన ఓటును వేసి సింగరేణిలో 27న జరిగే గుర్తింపు ఎన్నికలలో అఖండ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వర్, ట్రెజరర్ ఆవుల నాగరాజు ఆఫీస్ బేరర్స్ నంబూరు శ్రీనివాస్, పిట్ సెక్రటరీలు జి పుల్లారావు, కోడి రెక్కల శ్రీనివాసరావు, నాయకులు కందిమల్ల శ్రీనివాసరావు, జి.పాపారావు, నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుగనులను కమర్షియల్ మైనింగ్‌గా మార్చిన కేంద్రం

- అదే బాటలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- సీఐటీయూను గెలిపించండి
- సింగరేణి భవిష్యత్ కాపాడుతాం
- రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాజారావు

నవతెలంగాణ-ఇల్లందు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోడీ బొగ్గుగనులను కమర్షియల్ మైనింగ్‌గా మార్చారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రాజారావు అన్నారు. స్దానిక కార్యాయలయంలో శనివారం మాట్లాడారు. మైనింగ్ పేరుతో కోల్ ఇండియాతో పాటు సింగరేనిలో సైతం బొగ్గుబ్లాకులను ప్రయివేటుపరం చేస్తోందన్నారు. దీని మూలంగా ప్రస్తుతం ఉన్న భూగర్భగనులు, ఓసిలు మరో 10, 15 సంవత్సరాలు మాత్రమే జీవిత కాలం ఉండనుందనది అన్నారు. కొత బ్లాకులు రాకపోతే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్ధకమే అన్నారు. పరిశ్రమను రక్షించుకోవాలంటే కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలన్నారు. గుర్తింపు సంఘంగా ఉన్న టీబిజికెఎస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణను అడ్డుకోలేదన్నారు. ఫలితంగానే సత్తుపల్లి, కోయగూడెంలో బ్లాకులు ప్రయివేటుపరం అయ్యాయన్నారు. ఇల్లందులో త్వరలో ప్రారంభించనున్న పూసపల్లి ఓసి సైతం ప్రయివేటుకు అప్పజెప్పడానికి గత ప్రభుత్వం ఏర్పట్లు చేసిందన్నారు. సొంతింటి పథకం, పేర్ల మార్పిడి, ఇన్‌కం ట్యాక్సు రద్దు, ప్రధాన వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సింగరేణిలో పూర్తిగా రాజకీయ జోక్యం పెంచిందన్నారు. బాడ్ల రూపంలో బ్యాంకు బ్యాలెన్స్‌లు సుమారు రూ.29వేల కోట్లు ఖాళీ చేసిందన్నారు. దీంతో సింగరేణి ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇవ్వలేని పరిస్థితి తెచ్చిందన్నారు. సింగరేణిలో ఒక్కసారి సిఐటియును గెలిపించాలన్నారు. 27న జరగనున్న గుర్తింపు సంఘ ఎన్నికల్లో 11 డివిజన్‌లలో సిఐటియును గెలిపిస్తే సింగరేణి భవిష్యత్ కాపాడుతామని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు కూకట్ల శంకర్, బ్రాంచి కార్యదర్శి ఎండి.అబ్బాస్ పాల్గొన్నారు.

గోటి తలంబ్రాలకు శ్రీకారం

నవతెలంగాణ-దమ్మపేట



ప్రతి సంవత్సరం భద్రాచల సీతారాముల కళ్యాణానికి ప్రత్యేకంగా దమ్మపేట నుండి గోటి తలంబ్రాలను ముక్కోటి ఏకాదశినాడు ప్రారంభించి హోళి పండుగ రోజున భద్రాద్రి దేవాలయంలో గోటి తలంబ్రాలను అప్పగించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో శనివారం దమ్మపేట మాజీ సర్పంచ్ అత్తులూరి వెంకటరామారావు నివాసం వద్ద సీతారామచంద్రమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గోటి తలంబ్రాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మురహరి నాగరాజు-సత్యావతి, రఘు-గంగ, అత్తులూరి వెంకటరామారావు-విజయకుమారి, అత్తులూరి సతీష్‌కుమార్-వరలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని గోటి తలంబ్రాలకు శ్రీకారం చుట్టారు. మహిళలు పాల్గొన్నారు.

నిజాయితీకి పట్టం కట్టండి

- కార్మికుల హక్కులను రక్షించుకుందాం
- ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటెయ్యండి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం నిజాయితీగా పనిచేస్తున్న సిఐటియూకీ పట్టం కట్టాలని, ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వెయ్యాలని సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ సింగరేణి కార్మికులకు పిలుపు నిచ్చారు. శనివారం సింగరేణి బొగ్గు బావుల వద్ద, కార్పొరేట్ ఏరియాలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బొగ్గు గనుల వద్ద పిట్ మీటింగ్‌లు, గేట్ మీటింగులను ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌లో ఏజే.రమేష్ పాల్గొని మాట్లాడుతూ నిజాయితీకి పట్టం కట్టండి, సిఐటియూని గెలిపించండి అని సింగరేణి కార్మికులను కోరారు. సిఐటియూని గెలిస్తైనే సింగరేణికి రక్షణ ఉంటుందని అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం, అక్రమాలతో కాలం వెళ్లదీస్తున్న అవకాశ వాద సంఘాలను ఓడించాలని అన్నారు. సొంతింటి కల నెరవేరలంటే సీఐటీయూ సంఘాన్ని గెలిపించాలన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సిఐటియూ యూనియన్‌ని గెలిపించాలని కోరారు. సింగరేణి ప్రైవేటు పరం చేస్తున్న యూనియన్లను ఓడించేందుకు ప్రతి కార్మికుడు సిద్దంగా ఉండాలని కోరారు. ఒక్కసారి సీఐటీయూని గెలిపిస్తే, కార్మికుల సత్తా చాటుతాం అని అన్నారు. పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్‌ను రద్దు చేయాలన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలకు అడ్డుకట్ట వేయాలంటే సిఐటియుని గెలిపించాలన్నారు. యాజమాన్యంకు తలొగ్గి, కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టే సంఘాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఇప్పటివరకు అధికారంలో ఉన్న యూనియన్లు కార్మికుల హక్కులు కాలరాసే విధంగా సింగరేణి సంస్థను బొగ్గు బ్లాక్లుగా వేరుచేసి ప్రైవేటుపరం చేసే పద్ధతికి శ్రీకారం చుట్టాయని అన్నారు. కార్మికులు కష్టపడి తమ రక్తాన్ని చమట చుక్కగా చేసి శ్రమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు అండగా నిరంతరం సిఐటియు నిలబడిందన్నారు.

ప్రైవేటీకరణను కార్మికుల హక్కుల కాపాడేందుకు సిఐటియు కృషి చేసిందని గుర్తు చేశారు. వేతన ఒప్పందాల విషయంలో కార్మికులకు న్యాయం చేసే విధంగా జేబీసీసీఐ సమావేశాల్లో గట్టిగా కోట్లాడి హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు. కాబట్టి (సీఐటీయూ) సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, నాయకులు వై.వెంకటేశ్వరరావు, కర్ల వీరాస్వామి, వెంకన్న, కె.రమేష్ బాబు, నాజర్, సమ్మయ్య, రామ్మూర్తి, డి.వీరన్న, భూక్య రమేష్, లిక్కి బాలరాకు, లక్ష్మి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సుక్మా దండకారణ్యంలో ఎదురు కాల్పులు

- ముగ్గురు మావోయిస్టులు మృతి?

నవతెలంగాణ-చర్ల:

సరిహద్దు చత్తీస్గడ్ సుక్మా జిల్లా గోగుడా దండకారణ్యంలో శనివారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. గోగుండా దండకారణ్యంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఆ ప్రాంతంలో సైనికులు అడవిని జల్లెడ పట్టగా తరసపడ్డ మావోయిస్టులకు పోలీసులకు మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగిందని, ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నుంచి నలుగురు మావోయిస్టులు కాల్చి చంపబడ్డారని పోలీసులు పేర్కొన్నారు. డీఆర్‌జీ సుక్మా, దంతేవాడ, సిఆర్పిఎఫ్ 2వ, 111వ బెటాలియన్‌ల సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో మావోయిస్టులు మృతి చెంది ఉంటారని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్, సీఆర్పీఎఫ్ డీఐజీ అరవింద్ రాయ్ తెలిపారు. కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను పెంచి ఘటనా స్థలంలో సైనికుల అన్వేషణ కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గాయపడిన మావోయిస్టులు పారిపోకుండా భద్రతాబలగాలు చుట్టుముట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎస్పీ వివరించారు.

గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తాం

- సర్వమతాల సంక్షేమమే లక్ష్యం
- సుఖ సంతోషాలతో క్రిస్టమస్ జరుపుకోవాలి
- కానుకల పంపిణీలో ఎమ్మెల్యే కూనంనేని



నవతెలంగాణ-కొత్తగూడెం

చట్టసభలో ప్రజా గొంతుక వినిపించాలని ఆకాంక్షతో ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ జనం పక్షాన గళం విప్పుతానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కొత్తగూడెం పట్టణ పరిధిలోని అంబేద్కర్ భవన్ నందు ఏర్పాటు చేసిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమానికి అయన హాజరై, నిరుపేద క్రైస్తవ కుటుంబాలు పండుగ కానుకలను అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతోపాటు, ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలు, పథకాలు ప్రతి గడపకు చేరేవిధంగా కృషి చేస్తానన్నారు. సర్వమతాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాల్సిన అవసరం ఉందని, అందుకోసం తన వంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. పండుగల సమయంలో పేద క్రిస్టియన్, ముస్లిం, హిందూ కుటుంబాలకు కానుకలు, పండుగ సామగ్రి అందజేయడంతోనే సరిపెట్టుకోవద్దని, వారి జీవన స్థితిగతుల్లో మార్పు తెచ్చే చర్యలు చేపట్టాలని కోరారు. పేద క్రిస్టియన్ కుటుంబాలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను సుఖసంతోషాలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపిపి బాదావత్ శాంతి, ఆర్డీవో శిరీష, తహసీల్దార్ పుల్లయ్య, మైనార్టీ ఈడీ సంజీవరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ప్రసాద్, ధర్మరాజు, నాయకులు వాసిరెడ్డి మురళి, కూసపాటి శ్రీను, మంద హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఐటీడీఏ ద్వారా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ



నవతెలంగాణ-పినపాక

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు గిరిజన అభ్యర్థులకు ఐటీడీఏ ద్వారా ఉచిత ఆన్లైన్ శిక్షణ అందిస్తున్నట్లుగా పినపాక ఎంపీడీవో చంద్రశేఖర్ తెలియజేశారు. శనివారం ఆయన పినపాక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జీడి కానిస్టేబుల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీపరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లుగా తెలియజేశారు. ఎస్టీ స్టడీ సర్కిల్ ఐటిడిఏ భద్రాచలం అనే యూట్యూబ్ చానెల్ ద్వారా (45) రోజుల పాటు ఉచిత ఆన్లైన్ శిక్షణ కల్పించబడుతుందన్నారు. స్టడీ మెటీరియల్ కోసం www.itdabcm.com నందు తెలియబరిచిన చానెల్‌లో జాయిన్ అవ్వగలరని కోరారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 29వ తేదీ నుండి ఫిబ్రవరి 18వ తేదీ వరకు రోజుకు 6 గంటల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ తరగతుల సిలబస్ ముందు నిర్వహించే ఆర్ఆర్బి పరీక్షలకు కూడా ఉపయోగపడుతుందని కావున ఎక్కువ సంఖ్యలో నిరుద్యోగ యువత ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు భవిత సెల్ ఐటీడీఏ భద్రాచలం 6302608905, 8106141505 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని కోరారు.

వివేకానంద పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని వివేకానంద విద్యానికేతన్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల చిన్నారులు క్రిస్మస్ కేక్ను కట్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినం గురించి విద్యార్థులకు తెలియచేశారు. అనంతరం విద్యార్థులు ప్రత్యేక నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించే దే క్రైస్తవం

- డిప్యూటీ కలెక్టర్, నియోజక వర్గం ప్రత్యేక అధికారిణి మాధవి



నవతెలంగాణ-అశ్వారావుపేట

శాంతి పూర్వకమైన సేవా తత్పరతను పెంపొందించడం మే కాకుండా సమాజంలో క్రైస్తవం సౌభ్రాతృత్వం కల్పిస్తుందని డిప్యూటీ కలెక్టర్, అశ్వారావుపేట నియోజక వర్గం ప్రత్యేక అధికారిణి మాధవి అన్నారు. స్థానిక రైతు వేదికలో శనివారం తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ అధ్యక్షతన క్రిస్టమస్ పురస్కరించుకుని ప్రభుత్వం అందజేసే కానుకల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 325 మంది క్రైస్తవ లబ్ధిదారులకు భోజనం వసతి కల్పించి, నూతన వస్త్రాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ మూర్తి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్.కే పాషా, అశ్వారావుపేట, పేరాయిగూడెం సర్పంచ్‌లు రమ్య, సుమతి, ఎంపీటీసీ భారతీ, సత్యవరపు తిరుమల బాలగంగాధర్, నాయకులు మొగళ్ళపు చెన్నకేశవ రావు, తుమ్మ రాంబాబులు పాల్గొన్నారు.



క్రిస్టమస్ కానుకల పంపిణీ

నవతెలంగాణ-దమ్మపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టమస్ పండుగ సందర్భంగా నూతన దుస్తుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం దమ్మపేట మండలం, ముష్టిబండ గ్రామంలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించి కేకు కట్‌చేసి క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారినీ మాధవి చేతులమీదుగా క్రిస్టియన్ మహిళలకు నూతన చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు చామర్తి గోపిశాస్త్రి మాట్లాడుతూ సర్వమతాలను గౌరవించి లౌకిక వాదంతో ముందుకు సాగే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఈ క్రిస్టమస్ వేడుకలు క్రిస్టియన్ సోదరులు అందరూ కూడా సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట తహాశీల్దారు ముజాహిద్, ఎంపీపీ. సోయం ప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు అత్తులూరి వెంకటరామారావు, రావు గంగాధరరావు, కక్కిరాల రమేష్, కూకలకుంట రమేష్, కూకలకుంట మాధవరావు, పగడాల రాంబాబు, ప్రజలు పాల్గొన్నారు.

టేకులపల్లిలో ఘనంగా ముక్కోటి ఏకాదశి



నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లిలోని శ్రీ కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వారము ప్రత్యేక పూజ కార్యక్రమాలు వేద మంత్రాలతో వైభవంగ నిర్వహించినట్లు సర్పంచ్ నిరోషా నాయక్ శనివారం తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య, సర్పంచ్‌లు బోడ నిరోష మంగీలాల్ నాయక్, బోడ సరిత, పీఏసీఎస్ డైరెక్టర్ గుడిపూడి కృష్ణర్జున్ రావు, ఉపసర్పంచ్ కె.సురేష్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యా నాయక్, అయ్యప్ప మాలధారణ ధరించిన గురు స్వాములు, మన్సింగ్ స్వామి, జయంత్ స్వామి, వెంకటేశ్వర్లు స్వామి, అంజన్న స్వామి రమేష్, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం : ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప శ్రీ కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార పూజ మహెూత్సవములో పాల్గొన్న కోరం కనకయ్యను అయ్యప్ప మాలధరించిన గురు స్వాములు, బోడ మంగీలాల్ నాయక్ గురుస్వామి, తోటకూరి జయంత్ గురు స్వామి, కృష్ణ, చిన్నేష్, కోటేష్ స్వాములు శాలువలతో సన్మానించినట్లు తెలిపారు.

సమిష్టి కృషితో సింగరేణి అభివృద్ధిలో నెంబర్ వన్

- సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాం
- ఘనంగా సింగరేణి డే వేడుకలు



నవతెలంగాణ-కొత్తగూడెం

అందరి సమిష్టి కృషి వలన సింగరేణి అభివృద్ధిలో దూసుకుపోతుందని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాం తెలిపారు. శనివారం సింగరేణి డే సందర్భంగా కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో సెంట్రల్ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవ సంబరాలను డైరెక్టర్ బలరాం జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మన సంస్థ అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుందన్నారు. గత ఏడాది సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 671 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. అలాగే 667 లక్షల టన్నుల బొగ్గునురవాణా చేసినట్లు తెలిపారు. చరిత్రలోనే అత్యధికంగా రూ.33,000 కోట్ల టర్నోవరు సాధించడంతో పాటు రికార్డ్ స్థాయిలో రూ.2,222 కోట్ల లాభాలను సాధించామన్నారు. ఇదంతా సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. గత ఏడాది సింగరేణి కార్మికులందరికీ సంస్థ సాధించిన లాభాల్లో 32 శాతం లాభాల వాటా బోనస్ గా పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశ విద్యుత్ అవసరాలు రోజురోజుకీ పెరిగిపోతున్న నేపథ్యంలో ఒక బాధ్యత గల ప్రభుత్వ సంస్థగా మనం ఎంతో అంకితభావంతో పనిచేస్తూ విద్యుత్ సంస్థలకు ఎటువంటి బొగ్గు కొరత రాకుండా బొగ్గును సరఫరా చేస్తున్నామని వివరించారు. మంచిర్యాల వద్ద మనం నెలకొల్పిన 1,200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రారంభం నుంచే అత్యుత్తమ పనితీరుతో దేశంలో ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో నెంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. రాష్ట్ర విద్యుత్తు అవసరాలు తీర్చడంలో తమ వంతుగా ఇప్పటి వరకు సుమారు 60 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును అందించిందని తెలిపారు. సింగరేణి డే సందర్భంగా వివిధ డిపార్ట్మెంట్లకు చెందిన సింగరేణి స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. స్టాల్స్‌ను డైరెక్టర్ బలరాం సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు జీఎంలు ఉద్యోగులు, ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

దేశానికి వెలుగులందిస్తున్న సింగరేణి : జీఎం

ఇల్లందు : శతాబ్ద కాలంగా బొగ్గును వెలికి తీస్తూ సింగరేణి దేశానికి వెలుగులందిస్తోందని జీఎం జాన్ ఆనంద్ అన్నారు. సింగరేణి డే సందర్భంగా శనివారం జీఎం, ఓసి కార్యాలయాలు, పూసల్లి గ్రామంలో జెండావిష్కరణలు చేశారు. బ్రిటీష్ కాలంలో పూసపల్లి భూగర్భగనిలో విషవాయువులకు అసువులుబాసిన అధికారులు, కార్మికులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. 1886లో బొగ్గుగనులు ప్రారంభమయ్యాయన్నారు. ఆనాడు బొగ్గు వెలికి తీయడానికి దుర్భర పరిస్థితులు ఉండేవన్నారు. కార్మికులు, అధికారులు బాగ శ్రమించాల్సి వచ్చిందన్నారు. లాంతర్ల వెలుగులతో భూగర్భగనిలోనికి వెళ్ళి బొగ్గును వెలికి తీసేశారని అన్నారు. బ్లాస్టింగ్ చేయడానికి బాంబు చేతితో వేసి పరిగెత్తేవారని అన్నారు. ప్రమాదాలు కూడా చోటు చేసుకునేవన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయన్నారు. ఓసిలు వచ్చాయన్నారు. కొత్త టెక్నాలజీ ద్వారా కేవలం 30 మంది కార్మికులతో వేల టన్నుల బొగ్గు వెలికి తీస్తున్నారని అన్నారు. బొగ్గుగనుల్లో నాటి చట్టాలే అమలవు తున్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాలలో సుమారు 350 కిమీ మేర 8,800 మిలియన్ టన్నుల బొగ్గు ఉందన్నారు. ఈ సందర్భంగా నిరంతరం శ్రమిస్తున్న అధికారులు, కార్మికులకు సింగరేణి డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైజిఎం పర్సనల్ మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-పాల్వంచ

కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమక్షంలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కేక్ కట్ చేసి జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తు జన్మించిన రోజును క్రిస్టమస్ పండుగగా ప్రజలు ఎంతో సంతోషంగా, ఆనందంగా, భక్తిశ్రద్ధలతో వేడుకలు చేసుకుంటారని చెప్పారు. అభివృద్ధిలో మన జిల్లా ఆదర్శవంతంగా నిలవాలని ప్రభువు ఆశీస్సులు ప్రతి కుటుంబంపై సమృద్ధిగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. మన జిల్లా అభివృద్ధి పదంలో పయనించాలని, ప్రజలు సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆ క్రమంలోనే అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో నేడు సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలోని నిరుపేదలకు క్రిస్మస్ బహుమతులు అందచేస్తున్నట్లు చెప్పారు. రానున్న నూతన సంవత్సరంలో లక్ష్యాలను సాధించుటలో సమిష్టి కృషి చేయాలని అర్హులైన పేదల దరికి చేర్చి వారి జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నింపాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ జీసస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని శాంతి మార్గంలో నడవాలని చెప్పారు. ఇతరులకు సహాయం, సేవ చేసే గుణాన్ని అలవరుచుకొని నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం సిబ్బంది వివిధ శాఖల ఉద్యోగులకు కేక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, జడ్పి సీఈఓ విద్యాలత, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవ రావు, డిఆర్వో రవీంద్రనాథ్, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, ఉపాధి కల్పనాధికారి విజేత, ఇంటర్మీడియట్ అధికారి సులోచన రాణి, వైద్యాధికారి డాక్టర్ శిరీష, డిసిఓ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బి ఈ భీమ్లా, ఇరిగేషన్ అధికారి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిక్కిరిచిన ఆర్టీసీ ప్రాగణం

- ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ యాత్రికులు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇప్పటికే మహాలక్ష్మి పథకంతో తక్కువ దూరాలు కూడా ఎక్కువ శాతం మహిళలు ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తున్న నేపథ్యంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భద్రాచలానికి విచ్చేసిన యాత్రికుల సంఖ్య గణనీయంగా ఉండడంతో ఆర్టీసీ బస్సు ప్రాగణం యాత్రికులతో ప్రయాణికులతో శనివారం కిక్కిరిసిపోయింది. యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చి పోయే ప్రతి బస్సు వెంబటి మగ, ఆడ, చిన్న, పెద్ద తేడా లేకుండా ఎక్కే ప్రయత్నం చేస్తూ ప్రత్యక్ష నరకాన్ని అనుభవించారు. ఆర్టీసీ అధికారుల తీరుపట్ల ప్రయాణికులు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. మహాలక్ష్మి పథకం అమలైన నాటి నుండి ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ముక్కోటి వంటి ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా కూడా భద్రాచలంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గత నాలుగు రోజులు నుండి చలి తీవ్రత పెరగడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఆర్టీసీ బస్టాండ్‌లోని పడిగాపులు కాయడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కల్పవృక్ష నారసింహ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- 750 ఏళ్ళ నాటి సాలగ్రామ దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాద్రి దివ్య క్షేత్రంలో కొలువైన గో గోవింద కల్ప వృక్ష నరసింహసాల గ్రామ ఆశ్రమంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను పురస్కరించుకొని గోవిందుని దర్శనం కొరకు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఎంతో మంది భక్తులు కల్పవృక్ష నారసింహ సాలగ్రామ మూర్తిని దర్శనం చేసుకోవడం జరిగినది. ఎన్నడూ లేని రీతిలో సుదూర ప్రాంతాల నుండి అశేష భక్తజనం రావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం జరిగినది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ రాఘవునితో పాటుగా నారసింహున్ని దర్శనం చేసుకుని భక్తజనులు పులకించిపోయారని సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఎంతోమందికి సంస్థ ఆధ్వర్యంలో వసతి భోజన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. అలానే ఉదయం వైకుంఠ ద్వార దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించడం మా భాగ్యమని, ఇంతమందికి సేవ చేసుకునే అదృష్టాన్ని కల్పించిన దేవదేవుడు ఆ లక్ష్మీనారసింహుని ఆశీస్సులు సంపూర్ణంగా ప్రతి ఒక్కరికీ కలగాలని అన్నారు. నూజివీడు, గుంటూరు నుండి వచ్చిన కోలాట భజన బృందాల వారితో ప్రాంగణమంతా రామనామంతో మారుమ్రోగిపోయింది. ఎంతో మంది భక్తులు భజనలు కీర్తనలతో రామయ్య తండ్రిని వేడుకుంటూ ముక్కోటి వేడుకలు నిర్వహించడం జరిగినది. భక్తులకు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నృసింహ సేవా వాహిని సభ్యులు వాలంటీర్లుగా సేవలను అందించి రామయ్య సేవలో పాల్గొన్నారు.

పర్ణశాలలో వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

- ఉత్తర ద్వారంలో పర్ణశాల రామయ్య భక్తులకు దర్శనం
- శోక రాముడిగా భక్తులకు అనుగ్రహం
- తిలకించి తరించిన భక్తజనం





నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామయ్య ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు జై శ్రీరామ్... జై జై శ్రీరామ్ అంటూ జయ జయధ్వానాలు చేశారు. అర్చకులు ముక్కోటి విశిష్టతను వివరించారు. అర్చక స్వాములు భక్తులకు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. 108 ఒత్తులతో వెలిగించిన హారతిని భక్తులు అందుకున్నారు. గరుడ వాహనరూపుడైన రామచంద్రుడు భక్తులకు శ్రీమహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి విశేష ఆరాధన, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వే చాలు, గరుడ ప్రబంధాలు, ఇతిహాసాలు, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతకాన్ని పఠించారు. శోక రాముడికి అష్టోత్తర శత హారతినిచ్చారు. ఉత్తర ద్వారా దర్శనం స్వామివారిని నేల తాళాలు మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి పర్ణశాల రామయ్యను దర్శించుకున్నారు.

పర్ణశాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి.చంద్రశేఖర్, ఎంపీడీవో ముత్యాలరావు, మణుగూరు ఎంపీడీవో చంద్రమౌళి, సీఐ దోమల రమేష్, ఉత్సవాల ప్రత్యేక అధికారులు శ్రావణ్ కుమార్, అనిల్ కుమార్, ఐటిడిఏ డీడీ మణెమ్మ, సీతమ్మ సాగర్ డిఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రాజ్ సుహాస్, విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డి, ఎస్సైలు కేశవ్, గణేష్, మెడికల్ ఆఫీసర్స్ రేణుక రెడ్డి, పుల్లారెడ్డి, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భవిష్యత్ కోసం ఐఎన్‌టీయూసీని గెలిపించండి



నవతెలంగాణ-మణుగూరు


కార్మికుల భవిష్యత్ కోసం ఐఎన్‌టీయూసీని గెలిపించాలని ఖమ్మం జిల్లా సొసైటీ ఉపాధ్యక్షులు టి.బ్రహ్మయ్య అన్నారు. శనివారం మణుగూరు ఏరియా పీకే ఓసీ-2లో వైస్ ప్రెసిడెంట్ వెలగపల్లి జాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికుల భవిష్యత్ కోసం, సింగరేణి ప్రాంత అభివృద్ధి కోసం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామన్నారు. కార్మికులందరూ సింగరేణి రక్షణ, భవిష్యత్తు కోసం ఆగమవుతున్నటువంటి సింగరేణిని రక్షించడం కోసం, అణిచి వేయబడుతున్న టువంటి కార్మికుల హక్కుల కోసం, కార్మికుల బంగారు భవిష్యత్తు కోసం ఐఎన్‌టీయూసీ గుర్తు గడియారం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం పికె ఓసీ-2 ఆపరేషన్ ఫిట్ సెక్రటరీ మాట్లాడారు. దేశానికి వెలుగులు నింపే చీకటి సూర్యులు మన సింగరేణి కార్మికులు అని, కానీ ఈ చీకటి సూర్యులు దేశానికి వెలుగును ఇవ్వగలుగుతున్నారే తప్ప తన జీవితంలో మాత్రం వెలుగులు నింపుకోలేకపోతు న్నాడన్నారు. చివరలో వైస్ ప్రెసిడెంట్ జాన్ మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ గెలిచిన కొన్ని రోజుల వ్యవధిలో సింగరేణి కార్మికులందరికీ సొంత ఇంటి పథకం కింద 250 గజాల స్థలం, 20 లక్షల వడ్డీ లేని రుణం, పెరిక్స్ మీద ఇన్ కమ్ టాక్స్ యాజమాన్యంచే కట్టిస్తాం, కారుణ్య నియామకాలను సులభతరం చేస్తాం, సింగరేణి ప్రతి ఏరియాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టిస్తాం, పిల్లల చదువుకు సీబీఎస్, ఐఐటీ, డిజిటలైజడ్ విద్యావ్యవస్థని తీసుకువస్తాం అని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమరాజు, సామా శ్రీనివాస్ రెడ్డి, నామ వెంకటేశ్వర్లు, బ్రాంచ్ సెక్రటరీ బోగా రాజలింగు, బ్రాంచ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ జె.కరుణాకర్, ఆపరేషన్ ఫిట్ సెక్రటరీ రాంశెట్టి కృష్ణ చేతన్, వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ టి.పెద నాగయ్య, ఫిట్ జాయింట్ సెక్రటరీ ఎండీ.కరీమ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ కె.శివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఇల్లందు బొగ్గుగనుల్లో మరువలేని మధుర దృష్యాలు

- 1889లో బ్రిటీష్‌వారు ఆవిష్కరించిన ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్, ఫిల్టర్ బెడ్, సెంట్రల్ కోల్ హ్యాండ్లింగ్, రైల్వే స్టేషన్







నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి బొగ్గుగనులకు పుట్టినిల్లయిన ఇల్లందులో 1870లో డాక్టర్ విలియం కింగ్ బొగ్గు నిక్షేపాలను కనుగొన్నారు. 1886లో హైదరాబాదు దక్కన్ కమిటి ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో బొగ్గు తవ్వకాలు మొట్టమొదట ప్రారంభమయ్యాయి. భూగర్భగనుల్లో బొగ్గుతీత ప్రారంభించింది. ఆనాడు విద్యుత్ లేదు. చీమ్మ చీకటిలోనే కిరోసిన్ లాంతర్ల సహాయంతో బొగ్గును తవ్వేవారు. గుర్రాలు, ఇతర జంతువుల మీదు బొగ్గు బస్తాలు వేసి బయటకు తీసుకువచ్చేవారు. భూ గర్భగనుల్లో పనులు చేయడానికి కూలీలు భయపడేవారు. ఆనాడు బలవంతంగా బ్రిటీష్ దొరలు యువకులను తీసుకువచ్చి పనులు చేయించేవారు. కాలక్రమంలో యంత్రాలు నడడానికి, విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్మడంకోసం బ్రిటీష్‌వారు 1928లో సొంతగా విద్యుత్ ప్లాంట్, రక్షిత మంచినీటికోసం ఫిల్టర్‌బెడ్, సెంట్రల్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, సింగరేణి ప్రధాన కార్యాలయం, రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. దేశంలోనే సింగరేణి బొగ్గుగనులకు ముఖ్య కేంద్రంగా ఇల్లందు(బొగ్గుట్ట) విరాజిల్లింది. ప్రస్తుతం ఇవన్ని కనుమరుగై అపురూప చిత్రాలు మాత్రమే మిగిలాయి.

దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెండాలపాడు గొత్తి కోయ గ్రామములో డాక్టర్ కె.తనుజ, వెంకట్ ప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇంటి ఇంటికి తిరిగి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలను వైద్య పరీక్షలు చేసిజలుబు, దగ్గు, చిన్న, చిన్న రుగ్మతల మందులు అందజేశారు. అందరికీ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ,హెల్త్ సూపర్ వైసర్ ఇమామ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశాలు కె.రాజేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | డిసెంబర్ 24, 2023 | www.navatelangana.com

జాతీయ రైతు దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో శనివారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రైతన్నలకు శుభాకాంక్షలు తెలియచేస్తు కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు నాయకులు నల్లమల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ అన్నదాతలకు అండగా సమాజం ముందుకు రావాలని కోరారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాధన్ సిఫార్సులు అమలు చేస్తూ... రైతు పండించే అన్ని పంటలకు లాభసాటి ధరల కోసం కేంద్ర ప్రభుత్వం పై పోరాడేందుకు రాజకీయాలకు అతీతం గా రైతులు సంఘటితం గా సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాధాకిషోర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, చావా నారాయణ, రావూరి సైదబాబు, సౌమ్య, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మంజుల, కరుణ, భారతి, విజయనిర్మల, ఫాతిమా జోహార, దిద్దుకూరు వెంకటేశ్వరరావు, నాగులు మీరా, గజ్జెల లక్ష్మి, నగర నాయకులు హాస్రీఫ్ ఖాదర్ బాబ, పంతంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం రూరల్ మండలంలోని తనగం పాడు సర్పంచ్ కేతినేని వేణు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో వీరికి కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు ములకలపల్లి ఉపేందర్, చల్లా సంజీవరావు, చల్లా ఉపేందర్, హనుమంతరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, తిరుమలకొండ నాగరాజు, తొట్ల విజయ్, బోడ వెంకన్న, కందుకూరి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-మధిర

మధిర మండలంలోని చిలుకూరు గ్రామ పంచాయితీ పరిధిలోని గ్రామ పంచాయతీ నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను, అంగన్వాడి కేంద్రాలను, టాయిలెట్స్‌ను శని వారం ఎంపిడిఓ షేక్ సిలార్ సాహెబ్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను తనిఖీ చేసి, సెక్రెటరీలకు సూచనలు చేశారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనాల్లో ప్రతిరోజు గడ్డిని తొలగించాలని, వచ్చే వేసవికాలం దృష్ట్యా ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడి టీచర్లు నర్సరీ మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

నవ్వుతూ నవ్విస్తూ ఆనందంగా సాగుదాం

- తహసీల్దార్ సుధాకర్

నవతెలంగాణ-కామేపల్లి

నవ్వుతూ నవ్విస్తూ ఆనందంగా ముందుకు సాగుదాం అని కామేపల్లి తహశీల్దార్ సుధాకర్ అన్నారు.కామేపల్లి మండల క్రిస్టియన్ సోదరులు సెమి క్రిస్మస్ వేడులను కొత్తలింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ అధికారికంగా ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ని తహశీల్దార్ సుధాకర్ కట్ చేశారు. ఈసందర్భంగాతహశీల్దార్ మాట్లాడుతూ అందరు క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. అందరుకలిసి మెలిసి ఉండి పండుగను జరుపుకోవాలన్నారు. ఆత్మకు మరణం లేదు మనిషికి మాత్రమే మరణం ఉన్నదని అందరు కలిసి జీవిద్దాం అభివృద్ధి చేసుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ.ప్రవీణ్ కుమార్, డీటీ శంకర్, ఆర్ఐ సక్రు, పాస్టర్ల సంఘం మండల అధ్యక్షులు అబ్రహమ్, స్యామ్, ప్రభుధాస్, స్యామ్ సుందర్, ఎలిసా, ఏసు వీరితోపాటు మండలపరిధిలోని పాస్టర్లు, పింజరమడుగు ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, జిల్లానాయకులు ఫత్తే ఆహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో పర్యటించిన డీఎమ్ఓ

నవతెలంగాణ-కామేపల్లి

మండలంలో డిఎంఓ డాక్టర్ లక్ష్మీనారాయణ కామేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నెల్లూరి చందనతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి ప్రజలకు సలహాలు సూచనలు చేశారు. ప్రజలు సీజనల్గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను కచ్చితంగా పాటించాలని దోమలు లేకుండా ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కచ్చితంగా నిర్వహించాలని మురికి నీరు నిలవ లేకుండా చూసుకోవాలని దోమలను నియంత్రించేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. ప్రజా ఆరోగ్యమే వైద్య ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇ ఓ దూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణిలో వైకుంఠ ఏకాదశి, గీతా జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో నిర్వహించిన ఉత్సవాలు కన్నుల మిన్నుగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా పాఠశాలలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటుచేసి శ్రీమహావిష్ణువుని పూజించారు. అలాగే కురుక్షేత్ర యుద్ధంలో యుద్ధానికి విముఖత చూపిన అర్జునుని దైన్యాన్ని పోగొట్టి ధైర్యాన్ని నింపిన భగవద్గీత జయంతిని జరుపుకున్నారు. త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత కేవలం అర్జునునికి మాత్రమే కాదని ప్రపంచంలో సర్వ మానవాళి ఈ భగవద్గీత నుంచి స్ఫూర్తి పొందాలని అన్నారు. భగవద్గీత పిరికితనాన్ని దూరం చేసి మానవుని మదిలో ధైర్యాన్ని నింపుతుందని, జీవన పోరాటంలో విజయాన్ని అందిస్తుందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే అని గీతాచార్యుడు చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ దుష్ట శిక్షణ కోసం శిష్ట రక్షణ కోసం భగవానుడు భూమిపైన ఎల్లప్పుడూ అవతరిస్తాడని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఆలపించిన గీతా శ్లోకాలు విష్ణు సహస్రనామాలు పాటలు అందరికీ స్ఫూర్తివంతంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలి

- బూర్గంపాడు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత

నవతెలంగాణ-బూర్గంపాడు

క్రిస్మస్ పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని బూర్గంపాడు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత అన్నారు. మండల కేంద్రమైన బూర్గంపాడులోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం తహశీల్దార్ తిరుమలచారి ఆధ్వర్యంలోక్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బూర్గంపాడు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదరీ, సోదరులకు క్రిస్మస్ పండుగ, నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆమె తెలిపారు. మండల ప్రజలందరు సంతోషంగా క్రిస్మస్ పండుగ జరుపుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు గ్రామ సర్పంచ్ సిరి పురపు స్వప్న, తహశీల్దార్ తిరుమలచారి, వివిధ పార్టీల మండల నాయకులు, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

భారత ఖ్యాతిని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి పీవీ

నవతెలంగాణ-పాల్వంచ



భారతదేశ ఖ్యాతిని విదేశాల్లో సైతం చాటిచెప్పిన మహోన్నతవ్యక్తి పివి.నరసింహారావు అని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాజీ ప్రధాని స్వర్గీయ పివి.నరసింహారావు వర్ధంతి సందర్భంగా పాల్వంచలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పీవీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ పివి బహుభాషాకోవిదుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, బత్తుల వెంకటేశ్వరరావు, తాళ్లూరి సత్యనారాయణ, డిష్ నాగేశ్వరరావు, కందుకూరి రాము, ఉండేటి శాంతివర్ధన్, దారా చిరంజీవి, వజ్జల రాము, పులి సత్యనారాయణ, మాలోత్ కోటి, మహీపతి రమేష్, గంధం సతీష్‌లి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడి చేసుకుని డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

- నూతన రకాల పంటల వంగడాల పంపిణీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



రైతులు పంట మార్పిడి చేసుకుని డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకోవాలని భద్రాది కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా రైతులకు సూచించారు. శనివారం ఉద్యాన పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో ఆధునిక కూరగాయల నూతన రకాల పంటల వంగడాలను విత్తనాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయాలని తెలిపారు. రైతాంగ అధికారులు శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు పాటించి అధిక దిగిబడ్ఙు అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఇదే సమయంలో కొబ్బరి సాగు గురించి ప్రచురించిన దక్కన్ ల్యాండ్ మాసపత్రిక డిసెంబర్ 2023లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానపట్టు పరిశ్రమశాఖ అధికారి జినుగు మరియన్న, కార్యాలయ సూపరిండెంట్ విజయ్ కుమార్, ఉద్యాన అధికారులు ఆర్.శాంతి ప్రియ, సందీప్, రైతులు శివ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక రైతు

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



దేశానికి వెన్నెముక రైతు మాత్రమేనని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని మహదేవపురం గ్రామంలో గల రైతు వేదికలో ఐటి సి-ఎం ఎస్‌కె(బంగారు భవిష్యత్తు), మైరాడా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక రైతుఅని రైతు పది వేళ్ళను మట్టిలోకి వెళితేనే మన ఐదు వేళ్ల నోట్లోకి వెళతాయని అన్నారు. వ్యవశాయం చేసే ప్రతి రైతు వ్యవసాయాన్ని భారంగా కాకుండా భాధ్యతగా చెయ్యాలని సూచించారు. రైతులందరు మట్టిని సంరక్షించడంతో పాటు తక్కువ మోతాదులో ఎరువులు, పురుగు మందులను వాడుతు సేంద్రియ వ్యవసాయా వైపు మొగ్గు చూపాలని సూచించారు. దీంతో పాటు ఆధునిక సాంకేతిక పద్దతులను అవలంబించడం, అంతర్గత పంటలను, వాతావరణ పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా వరి పంటను నాటు పద్ధతి కంటే నేరుగా విత్తనం విత్తే పద్దతిని అవలంబించడం వల్ల ఖర్చులను, సమయాన్ని, అధిక నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైరాడ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ ఆఫీషర్ బి.అజయ్, సర్పంచ్‌లు సుమిత్ర, సీతారామయ్య, ఎంపిటిసి మడకం రామారావు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-పాల్వంచ

స్థానిక నెహ్రూ నగర్‌లోని నారాయణ ఈ టెక్నో పాఠశాలలో శనివారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నారాయణ టెక్నో స్కూల్స్ అడిషనల్ జనరల్ మేనేజర్ (ఏజి ఎం) వేణుగోపాల్ రావు, ఆర్ అండ్ డి హెడ్ సంగీతలు పాల్గొనగా అతిథులుగా హై స్కూల్ కోఆర్డినేటర్ పున్నం చందర్, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ యేసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా వందలమంది ప్రజలు జరుపుకునే సాంస్కృతిక పండుగ అని లాటిన్ భాషలో క్రిస్ట్ అనగా క్రిస్తు, మాస్ అనగా ఆరాధనా అంటే క్రిస్తును ఈరాధించి ఆయనను కీర్తిస్తూ ఆనందించడమే క్రిస్మస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు, ఏఓ శ్రీనివాస్, ఏడి రామకృష్ణ, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పినపాక : పినపాక మండలం ఈ.బయ్యారం క్రాస్ రోడ్‌లో గల రాధిక హై స్కూల్, ఎక్సలెంట్ భాష హైస్కూల్‌లల్లో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌లు నరేందర్, షాజిమాన్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శించిన క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జననం ప్రదర్శన, శాంతా క్లాస్ వేషధారణ అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ జయ సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నిరోషారెడ్డి, ఉపాధ్యాయులు హిమబిందు, వాణి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

2023 సాహిత్య పురస్కారాలు, పుస్తకావిష్కరణ సభ

నవతెలంగాణ- ఖమ్మం

తెలుగు సాహిత్యరంగ అభివృద్ధి కోసం కవిత్వం, కథలను ప్రోత్సహించుటకు ఖమ్మం ఇస్తటిక్స్ ఆధ్వర్యంలో ప్రతిఏటా కవిత్వం, కథల పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారాలు అందజేస్తున్నామని ఖమ్మం ఇస్తటిక్స్' బాధ్యులు పి. రవిమారుత్ అన్నారు. శనివారం ఖమ్మంలోని హార్వెస్ట్' పాఠశాలలో పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు కవులను ప్రోత్సహించేందుకు కవిత్వం, కథలను సేకరించడం. జరిగిందని, కవిత్వం, కథల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తతీయ, ప్రోత్సాహక బహుమతులు అందించడం జరిగిందని తెలిపారు. ప్రముఖ రచయిత్రి కత్తి పద్మ, ఎల్. ఎస్. ఆర్. ప్రసాద్, ప్రసాదమూర్తి, రమణమూర్తి, సంకిరెడ్డి నారాయణరెడ్డి, రమణజీవి, ముకామల చక్రధర్, అనంతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారన్నారు. బహుమతులు పొందిన కథలను సంకలనంగా ప్రచురించి సభలో ఆవిష్కరించినట్లు తెలిపారు. 2023 ఇస్తటిక్స్ సాహిత్య పోటీలకు వందకు పైగా కవిత సంపుటులు, 140కి పైగా కథలు పోటీకి వచ్చాయని కమిటీ అభ్యర్థన మేరకు కవిత్వానికి ముగ్గురు, కథలకు ముగ్గురు న్యాయ నిర్ణేయితలుగా వ్యవహరించి విజేతలను నిర్ణయించారని తెలిపారు. కవిత్వం విభాగంలో కవి వసీరా సంపుటి 'సెల్ఫీ' 40,000 బహుమతిని గెలుచుకుందని మరో ముగ్గురికి ప్రత్యేక ప్రశంసగా అవార్డులు ప్రత్యేక జ్యూరీ నిర్ణయించిందని, అనిల్ డ్యాని కవిత్వ సంపుటి 'గాంధారి వాన', లండ సాంబమూర్తి కవితా సంపుటి 'నాలుగు రెక్కల పిట్ట' అరుణ నారద పట్ల కవితా సంపుటి 'లోపలి ముసురు' ప్రత్యేక ప్రశంసకు అర్హమైనవిగా జ్యూరీ ఎంపిక చేసిందని తెలిపారు. కథల విభాగంలో ఉత్తమ కథగా శ్రీ ఊహ రచన 'లడాయి' 25వేల రూపాయల బహుమతిని గెలుచుకుందని, ద్వితీయ ఉత్తమ కథ రచనగా స్వర్ణ కిలారి రచన 'ఆరోతనం', 15వేల రూపాయల బహుమతిని తృతీయ ఉత్తమ కథగా జి.ఉమామహేశ్వర్ రచన 'సంభావన' 10 వేల రూపాయల బహుమతిని గెలుచుకున్నాయని, మరో రెండు కథలకు జ్యూరిస్ ఛాయస్ గా ప్రత్యేక బహుమతులు ఇవ్వడం జరిగిందని, ఆ కేటగిరిలో పెద్దింటి అశోక్ కుమార్ కథ 'కలలు రాలుతున్న నేల', కుప్పిలి పద్మ 'నా స్నేహితురాలు మణిపూరి ఎక్స్' ఎంపికయ్యాయని వివరించారు. బహుమతులు గెలుచుకున్న ఐదు కథలతో పాటు మరో పది కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేసి ఒక సంపుటిగా ప్రచురించి అతిధులు ఆవిష్కరించడం జరిగిందని వివరించారు. వీటిలో ముని సురేష్ పిళ్లే కథ 'పడమటిల్లు', పి శ్రీనివాస్ గౌడ్ కథ 'నా కొడుకు లచ్చిమి', నాదెళ్ల అనురాధ కథ 'మ్యూచువల్', దాసరి రామచంద్రరావు కథ 'ఆకలి బహువచనం రాయప్రోలు రమణ శాస్త్రి కథ 'ముదాబహం', తాళ్లపల్లి యాకమ్మ కథ 'అరడుగులు' హుమాయున్ సంఘీర్ కథ 'సుగంధ', కన్యగంటి అనసూయ కథ 'నీవు నమ్మిన దారుల్లో, శిరంశెట్టి కాంతారావు కథ 'అడవి కన్నీరు పెట్టిందో..కథలను సంకలనంలో ప్రచురించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఇస్తటిక్స్ బాధ్యులు ప్రసేన్, సీతారాం, మువ్వా శ్రీనివాసరావు, వంశీకృష్ణ, ఫణి మాధవి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం

నవతెలంగాణ-నేలకొండపల్లి



రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా సరిహద్దు గ్రామం పైనంపల్లి వద్ద శనివారం వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లాలోని నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామంలోకి చేరుకోగానే పార్టీ శ్రేణులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. మంత్రి కాన్వాయ్ పైనంపల్లి నుండి నేలకొండపల్లి, కోనాయిగూడెం, కోరట్లగూడెం, రాజేశ్వరపురం, మూటపురం మీదుగా కూసుమంచి క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వస్తువు కొనుగోలుకు రశీదు తప్పనిసరి

- జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

నవతెలంగాణ-పాల్వంచ



వినియోగదారులు ఏ వస్తువు కొన్నా తప్పనిసరిగా రశీదు (బిల్) పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. శనివారం ఐడి ఓసీలోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో 37వ జాతీయ వినియోగ దారుల దినోత్సవం నిర్వహించారు. వస్తువు వినియోగంలో ప్రతిఒక్కరు సమానులేనని ప్రతి వస్తువు కొనుగోలుకు తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. రశీదు ఉన్నప్పుడే ప్రశ్నించ గలుగుతామన్నారు. అంతేగాక ఇబ్బందులు ఉండవని అవసర మైతే కేసు పెట్టవచ్చునన్నారు. వినియోగ దారుల హక్కులను కాపాడేందుకు విస్తృత ప్రచారంతో పాటు అవగాహన కల్పించేందుకు చర్యలు కూడా తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రవీంద్రనాథ్, జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి, జిల్లా మేనేజర్ త్రినాధ్‌బాబు, సిబ్బంది, తూనికల కొలతల అధికారి మనోహర్, వినియోగదారు హక్కుల కమిటీ సభ్యులు బాలు, రగుమా చారి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అభ్యసనం ఉత్తమ ఫలితాలను ఇస్తుంది

- ఏడీ హేమంత్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఏ విద్యలో అయినా క్రమశిక్షణతో కూడిన అభ్యసనం ఉత్తమ ఫలితాలను ఇస్తుందని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్ కుమార్ అన్నారు. కళాశాల మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ నిర్వహించే ప్రెషర్ స్ డేని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఎవరి అభిరుచికి తగ్గట్లు ఇతర రంగాలలోను రాణించాలని, ఇందుకు తగ్గా ఏర్పాట్లు కళాశాల యాజమాన్యం సమకూర్చు తుంది అని అన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. సీనియర్ లు,జూనియర్‌లు అనే వ్యత్యాసం లేకుండా అందరు కలిసిమెలిసి ఉండాలని, శ్రద్ధతో చదివి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, తల్లి దండ్రుల ఆశలను నెరవేర్చాలని హితబోధ చేసారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ గోపాల క్రిష్ణ మూర్తి, ఐవిఎస్ రెడ్డి, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-పినపాక

పినపాక మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ సమీపంలో గల రైతు వేదికలో శనివారం క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఈ.బయ్యారం సర్పంచ్ రజిని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 175 మంది పేద క్రైస్తవ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ అందజేసే కానుకలు అందజేసినట్లుగా తెలియజేశారు. అనంతరం వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వ మతాలకు ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. క్రైస్తవ సోదరులు తాసిల్దార్ వీరభద్రప్రసాద్, వైస్.ఎంపీపీ సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు, పాస్టర్లు పాల్గొన్నారు.

కొప్పిశెట్టి సురేష్‌కు అభినందనలు

నవతెలంగాణ-వైరా

తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ కొప్పిశెట్టి సురేష్‌ను శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ సహచర అధ్యాపకులు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి అభినందించారు. అధ్యాపకులు బి.వీరభద్రరావు, శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు, ఉమా సుందరి ,బాబురావు, శ్రీకాంత్, ఈశ్వరరావు, వెంకట ముత్యం, మధు, సుధాకర్, కవిత, నాన్ టీచింగ్ సిబ్బంది రవీందర్‌రెడ్డి, రాంబాబు, నరేష్ తదితరులు శాలువాలతో పూలమాలతో సత్కరించారు.

విప్లవోద్యమంలో మార్పులు అనివార్యం

బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం ముందడుగు

నవతెలంగాణ-కారేపల్లి

పెట్టుబడిదారీ విధానం విసిరే సవాళ్లను అధిగమించడానికి కమ్యూనిస్టు విప్లవోద్యమంలో మార్పులు చేసుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఉందని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ డివిజన్ కార్యదర్శి టీ.ఝాన్సీ అన్నారు. శనివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండలాల కమిటీ సమావేశం శనివారం కారేపల్లి మండలంలో టేకులగూడెంలో సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లడుతూ మూడు విప్లవ పార్టీలైన పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్షియేటివ్‌లు విలీనం అవటం శుభపరిణామన్నారు. దీనిని పురష్కరించుకొని 2024 మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మం ఐక్యతా జాతీయ మహాసభలు జరగనున్నాయన్నారు. బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఈ ఐక్యత సభ ఒక ముందడుగు అని అన్నారు. మూడు విప్లవ పార్టీల విలీనం వలన 14 రాష్ట్రాలలో బలమైన ఉద్యమాలకు పునాది పడనుందన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా సంయుక్త మండలాల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎన్వీ రాకేష్, నాయకులు గుగులోతు తేజా నాయక్, భాస్కర్, పాపారావు, వేములపల్లి వీరన్న, అనసూర్య, సరోజిని, రంగ్యా, రాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి పర్వదినం

ఉత్తర ద్వార నుండి భక్తులకు దర్శనం

నవతెలంగాణ -ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభుగా వెలసిన జమలాపురం శ్రీ వెంక టేశ్వర స్వామి వారి ఆలయం నందు నిర్వహించే వైకుంఠ ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రంగురంగుల విద్యుత్ దీపాలతో పూల మాలలతో స్వామివారి గుడి వెనక భాగమున ప్రత్యేక మండపంను ఏర్పాటు చేసి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి ఉదయం తెల్లవారు జామున నాలుగు గంటలకే స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం ద్వారా భక్తులకు దర్శనానికి దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రములు ధరింపజేసి పూలమాలలు అలంకరించి అంగరంగ వైభవంగా స్వామి వారిని అమ్మవార్లను భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం నుండి దర్శించుకోవడానికి తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల నుండి దూర ప్రాంతాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదినానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తర ద్వార దర్శనానికి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సకల ఏర్పాట్లను చేశారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం శనివారం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రధాన దేవాలయంలో స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగ అభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారా దర్శనం ప్రత్యేక మండప నిర్మాణానికి, స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఖమ్మం గ్రానైట్ అధిపతి తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలా కుమారి దంపతులు సుమారు రెండు లక్షల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, వకుళ మాత కళ్యాణ మండపం నిర్మాణ దాత తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మల కుమారి దంపతులు, విజయవాడ పట్టణానికి చెందిన డాక్టర్ సుషేన్‌కుమార్ డాక్టర్ రేష్మ దంపతులు, ఆలయ పర్యవేక్షకురాలు కె.విజయ కుమారి, ఆలయ వేద పండితులు, అర్చకబృందం, ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఉన్నతాధికారులకు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైద్యారోగ్య రంగంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యాదానాయక్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ క్రిస్టిన జెడ్ చోంగ్త్, కమిషనర్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్ వి కర్ణన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ త్రివేణిని శనివారం యూనియన్ ప్రతినిధులతో ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వైద్య, ఆరోగ్య రంగాన్ని పటిష్ట పరచాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఆ రంగం చాలా పెద్దదనీ, దాన్ని పటిష్ట పరచటానికి నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం, నూతనంగా నియమితులైన అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. అన్ని కేడర్ల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, రెగ్యులర్ చేసేంతవరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ ప్రతి నెల మొదటి తేదీన వేతనం చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని కోరారు. ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలనీ, జీవో 142ను రద్దు చేయాలని విన్నవించారు. ఇతర అన్ని సమస్యలు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత తొందరగా చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. ప్రతినిధుల బృందంలోయూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర కోశాధికారి కవిత, నాయకులు వి విజయ వర్ధన్ రాజు, ఎస్ హరి శంకర్, జే సుధాకర్, నవీన్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుమారస్వామి, కిరణ్, శ్రీనివాస్ అనిల్ కుమార్, కిషన్, లక్ష్మి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు భద్రతా వైఫల్య ఘటన

- ఆరో నిందితుడికి కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : పార్లమెంటు భద్రతా వైఫల్య ఘటన కేసులో ఆరో నిందితుడు మహేష్ కుమావత్ పోలీసు కస్టడీని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు శనివారం 13 రోజులపాటు పొడిగించింది. ఈ కేసు విచారణలో భాగంగా నిందితుడు మహేష్ కస్టడీ పొడిగింపు కోసం ఢిల్లీ పోలీసుల దరఖాస్తును ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ హర్దీప్ కౌర్ అనుమతించారు. నిందితుడికి సైకలాజికల్ టెస్ట్ జరుగుతుందని, అతని మనస్తత్వ విశ్లేషణ నివేదిక ఆధారంగా తదుపరి విచారణ కోసం 13 రోజులపాటు కస్టడీని పొడిగించాలని ఢిల్లీ పోలీసుల దరఖాస్తును ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖండ్ ప్రతాప్‌సింగ్ కోర్టుకు సమర్పించారు. శనివారంతో నిందితుని ఏడు రోజుల పోలీసుల కస్టడీ ముగియనుంది. ఈరోజు పాటియాల హౌస్ కోర్టులో ఢిల్లీ పోలీసులు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఢిల్లీ పోలీసుల దరఖాస్తు మేరకు పాటియాలా హౌస్ కోర్టు నిందితునికి 13 రోజులపాటు కస్టడీని పొడిగించింది. డిసెంబర్ 13వ తేదీన పార్లమెంటు సమావేశాలు జరుగుతుండగా లోక్‌సభలోకి చొరబడి పొగబాంబులు విసిరారు. ఈ ఘటనకు పాల్పడిన ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారిపై ఉపాచట్టం కింద కేసు నమోదు చేశారు.

మళ్లీ పెరుగుతున్న కోవిడ్ కేసులు

- నలుగురు మృతి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 752 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక శుక్రవారం ఒక్కరోజే కరోనా వల్ల నలుగురు మృతి చెందారు. గురువారం కంటే శుక్రవారానికి యాక్టివ్ కేసులు 423 పెరిగాయి. కేరళ, కర్నాటక రాష్ట్రాలలోనే యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళలో 266, కర్నాటకలో 66 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రస్తుతం దేశంలో 3,420 యాక్టివ్ కేసులున్నాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. కాగా భారత్‌లో జెఎన్.1 సబ్ వేరియంట్ వ్యాప్తి పెరుగుతుండడంతో ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవాలో ఇప్పటివరకు 21 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇక కేరళలో కరోనా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 2,872 యాక్టివ్ కేసులున్నాయి. గడచిన 24 గంటల్లో 565 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ తెలిపింది.

గాజాకు మానవతా సహాయాన్ని వేగవంతం చేయాలి

- తీర్మానాన్ని ఆమోదించిన యూఎన్ భద్రతా మండలి

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కీలక నిర్ణయం తీసుకున్నది. గాజాకు మానవతా సహాయాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చే తీర్మానాన్ని ఆమోదించింది. అయితే, తీర్మానం ఇజ్రాయెల్, పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ మధ్య అత్యవసరమైన శత్రుత్వ ముగింపు కోసం అసలు అభ్యర్థనను మినహాయించింది. ముట్టడి ప్రాంతంపై ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అక్టోబర్ 7 నుంచి కనీసం 8,000 మంది పిల్లలతో సహా 20,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత.. యుద్ధం 11 వారాల పాటు కొనసాగింది. కాగా, 15 మంది సభ్యుల భద్రతా మండలి సమావేశంలో గాజాలో శత్రుత్వాన్ని తుంచివేయాలని చాలా మంది సభ్యులు చేసిన డిమాండ్‌ను యూఎస్ వ్యతిరేకిస్తూనే ఉన్నది. మానవతావాద సాయంపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక నియంత్రణను ఇచ్చే నిబంధనను తొలగించాలని కూడా యూఎస్ పట్టుబట్టటం గమనార్హం. యూఎస్, అరబ్ దేశాల తరపున యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇతర దేశాల మధ్య ఒక వారం కంటే ఎక్కువ చర్చల తర్వాత ఈ తీర్మానం ఆమోదించబడటం గమనార్హం. రష్యా ప్రతిపాదించిన సవరణను అమెరికా వీటో చేసిన తర్వాత ఈ ఆమోదం జరిగింది.

రెండు గంటల కంటే తక్కువే చర్చ

- సగం బిల్లులు అలానే ఆమోదం
- పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ నివేదిక



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఆమోదించిన బిల్లుల్లో సగం బిల్లులు ఒక్కొక్కటి రెండు గంటల కంటే తక్కువే చర్చ చేసినట్టు స్పష్టమైంది. '15వ లోక్‌సభలో కమిటీలకు సూచించబడిన బిల్లుల నిష్పత్తి 15వ లోక్‌సభలో 71శాతం నుంచి 17వ లోక్‌సభలో 16శాతానికి తగ్గింది' అని పీఆర్ఎస్ పేర్కొంది. ఈ శీతాకాల సమావేశాల్లో ఎటువంటి బిల్లును హౌస్ కమిటీలకు సూచించలేదు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ విశ్లేషణ ప్రకారం, 17వ లోక్‌సభ ఆమోదించిన బిల్లుల్లో దాదాపు సగం బిల్లులు ఒక్కొక్కటి రెండు గంటల కంటే తక్కువ చర్చల తరువాత ఆమోదం పొందాయి. 16శాతం మాత్రమే స్టాండింగ్ కమిటీలకు సూచించారు.

గురువారం ముగిసిన శీతాకాల సమావేశాల వరకు.. 17వ లోక్‌సభ వ్యవధిలో 172 బిల్లులు చర్చించి ఆమోదించారు. వీటిలో 86 (48శాతం) లోక్‌సభ ఆమోదించగా, 103 (60శాతం) రాజ్యసభ ఆమోదించింది.

లోక్‌సభ 34 (20శాతం) బిల్లులను రెండు నుంచి మూడు గంటల చర్చతో, 28 (16 శాతం) ఒక్కొక్కటి మూడు నుంచి నాలుగు గంటల చర్చతో, 24 (14 శాతం) బిల్లులను నాలుగు గంటల కంటే ఎక్కువ చర్చలతో ఆమోదించింది.

రాజ్యసభ 30 (17 శాతం) బిల్లులను ఒక్కొక్కటి రెండు నుంచి మూడు గంటల చర్చతో, 22 (13 శాతం) బిల్లులను ఒక్కొక్కటి మూడు నుంచి నాలుగు గంటల చర్చతో మరియు 17 (10 శాతం) బిల్లులను ఒక్కొక్కటి నాలుగు గంటల కంటే ఎక్కువ చర్చతో ఆమోదించింది.

'15వ లోక్‌సభలో కమిటీలకు సూచించబడిన బిల్లుల నిష్పత్తి 15వ లోక్‌సభలో 71 శాతం నుంచి 17వ లోక్‌సభలో 16శాతానికి తగ్గింది' అని పీఆర్ఎస్ పేర్కొంది. ఈ శీతాకాల సమావేశాల్లో ఎటువంటి బిల్లును హౌస్ కమిటీలకు సూచించలేదు.

డిసెంబర్ 21న షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగా వాయిదా పడిన శీతాకాల సమావేశాల్లో 10 బిల్లులు ప్రవేశపెట్టగా, 17 బిల్లులు ఆమోదించారు. వీటిలో మూడు క్రిమినల్ చట్టాలు ఉన్నాయి. ఇవి లోక్‌సభలో 9 గంటల 28 నిమిషాల పాటు చర్చించబడ్డాయి. రాజ్యసభలో ఆరు గంటల ఎనిమిది నిమిషాలు చర్చించారు. 'క్రిమినల్ లా బిల్లులపై లోక్‌సభలో జరిగిన చర్చలో 34 మంది సభ్యులు పాల్గొన్నారు. వారిలో 25 మంది బీజేపీకి చెందినవారు. రాజ్యసభలో 40 మంది సభ్యులు పాల్గొన్నారు. అందులో 30 మంది సభ్యులు బీజేపీకి చెందినవారు'అని పీఆర్ఎస్ తెలిపింది.

ఫిబ్రవరిలో సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశం

- హన్మకొండలో నిర్వహణ
- బ్రోచర్‌ను విడుదల చేసిన సీఐటీయూ నేతలు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు 2024 ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో హన్మకొండలోని బాలవికాసలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. హన్మకొండ రాంనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఆహ్వాన సంఘానికి సంబంధించిన బ్రోచర్లను జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య, కార్యదర్శి రాగుల రమేష్, ఉపాధ్యక్షులు గాదె ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను దివాళాతీయించి బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేవిధంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు కార్మిక కోడ్‌లను యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకొచ్చి కార్మిక వర్గానికి అన్యాయం చేసిందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కార్మిక వర్గం ఏ వైఖరి తీసుకోవాలనే దానిపై ఈ వర్కింగ్ కమిటీ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా 250 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశాలను విజయవంతం చేయడానికి 75 మందితో ఆహ్వానసంఘం ఏర్పాటు చేశామన్నారు.

ఆహ్వాన సంఘం

ఆహ్వానసంఘం అధ్యక్షులుగా పింగిళి సంపత్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా జూలపల్లి సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాగుల రమేష్, కోశాధికారిగా టి.ఉప్పలయ్య ఉపాధ్యక్షులుగా జి. ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, వేల్పుల సారంగపాణి, పుల్ల అశోక్, యస్ రజిత, కోరే ఐలయ్య, బొల్లారపు సంపత్, గాదె మొగిలితో పాటు 61 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు.

అమలు యంత్రాంగమే ముఖ్యం

చట్టం కాదు...



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో అనేక వ్యవస్థలను సమూలంగా మార్చేశారు. ప్రధాని కోరిక కూడా అదే. అన్ని వ్యవస్థల పైన తనదైన ముద్ర ఉండాలని ఆయన ఆకాంక్ష. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ చట్టం స్థానంలో హిందీ పేర్లతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లులను తేవడం వెనుక కూడా ఉద్దేశం అదే. ఈ బిల్లులపై లోక్‌సభలో జరిగిన చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానం ఇస్తూ ఇవన్నీ వలస పాలకుల కాలం నాటి చట్టాలని, అవి బ్రిటీష్ వారి ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్దేశించినవని చెప్పుకొచ్చారు. గత చట్టాలలో మాదిరిగా ఈ కొత్త చట్టాలు ఎవరినీ శిక్షించడం కోసం కాదని, న్యాయాన్ని అందించడం కోసమేనని కూడా ఆయన తెలిపారు.

భారత రాజ్యాంగం ప్రజలకు స్వేచ్ఛ, హక్కులు కల్పించడం పైన దృష్టి పెట్టింది. ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలనను అందించేందుకు కట్టుబడి ఉంది. అమిత్ షా చెప్పిన విధంగా చట్టాల్లో చేసే మార్పులు మంచివైతే స్వాగతించవలసిందే. కానీ పాత చట్టాలనే పేర్లు మార్చి రూపొందిస్తే ప్రయోజనం ఏముంటుంది? రాజకీయ నాయకులు తాము చేసే గోరంత పనిని చూపించి కొండంత మెప్పు పొందాలని భావిస్తుంటారు. మోడీ-షా ద్వయం కూడా అంతే.

రాజద్రోహం అనే పదాన్ని నూతన చట్టం నుండి తొలగించామని షా చెప్పారు. బాలగంగాధర తిలక్, గాంధీ, వల్లభాయ్ పటేల్ వంటి స్వాతంత్ర్య సమరయోధులను బ్రిటీష్ పాలకులు ఈ నేరం కిందే నిర్బంధించారని వివరించారు. అయితే ఆయన ఉద్దేశ పూర్వకంగానే జవహర్‌లాల్ నెహ్రూ పేరును ప్రస్తావించలేదు. నెహ్రూ సుదీర్ఘ కాలం పాటు జైలులో గడిపిన విషయాన్ని ఆయన విస్మరించారు. ఎందుకంటే నెహ్రూ అంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు సుతరామూ గిట్టదు. మరి నూతన చట్టంలో ఏముంది? ఆనాడు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారన్న కారణంతో స్వాతంత్ర్య సమరయోధులను జైళ్లలో కుక్కారు. మరి ఇప్పుడు మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టం ప్రకారం దేశానికి వ్యతిరేకంగా మాట్లాడితే శిక్షించవచ్చు.

అసలు రాజద్రోహం అంటే ఏమిటి? ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు హింసాత్మక చర్యలు చేపడితే దానిని రాజద్రోహంగా పరిగణిస్తారు. అయితే మోడీ ప్రభుత్వం చెబుతున్న భాష్యం వేరేలా ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే వారిపై క్రూరమైన చట్టాలు ఉపయోగించి సుదీర్ఘ కాలం నిర్బంధిస్తున్నారు. మోడీ-షా ద్వయం ప్రవచించే జాతీయతావాదం అదే.

చట్టంలో మంచి ఏముంది? చెడు ఏముంది? అనేది పక్కన పెడితే వాటిని శాంతి భద్రతల పరిరక్షణ యంత్రాంగం ఎలా ఉపయోగిస్తుంది, న్యాయస్థానాలు ఆ చట్టాలను ఎలా అన్వయించుకుంటాయి అన్నదే ప్రధాన ప్రశ్న. దేశంలో ఇప్పటికే వలసవాదుల కాలం నాటి పోలీసు వ్యవస్థే కొనసాగుతోంది. చట్టాలను బేఖాతరు చేస్తూ వారు ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తారు. చట్టం ఎంత మంచిదైనా దానిని అమలు చేసే యంత్రాంగం సరిగా లేకపోతే ఉపయోగమే ఉండదు.

జమ్మూకాశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

- ఉగ్రవాదుల కోసం ముమ్మర గాలింపు

రాజౌరి : జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి జిల్లాలలో శనివారం ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఇటీవల రెండు సైనిక వాహనాలపై దాడి చేసి ఐదుగురు జవాన్ల మరణానికి కారణమైన ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఘటనకు సంబంధించి సైనిక దళాలు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించాయి. అయితే వారు ముగ్గురూ అనుమానాస్పద రీతిలో చనిపోవడంతో ప్రజలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనుమానితులను పోలీసులు చిత్రహింసలు పెడుతున్నట్లు చూపే వీడియోలు వైరల్ అవుతుండడంతో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు.

పూంచ్, రాజౌరి జిల్లాలలో నెలకొన్న వాస్తవ పరిస్థితిపై సైన్యం, అధికారులు పెదవి విప్పడం లేదు. వదంతులు వ్యాప్తి చెందకుండా, శాంతి భద్రతల పరిస్థితి తలెత్తకుండా చూసేందుకే ఇంటర్నెట్ సేవలను నిలిపివేశామని అధికార వర్గాలు తెలిపాయి. కాగా పరిస్థితిని సైన్యం, పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో పారామిలటరీ దళాలను మోహరించారు.

మనీలాండరింగ్ కేసు..

- ఉప ముఖ్యమంత్రి తేజస్వీకి ఈడీ సమన్లు

పాట్నా : బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ శనివారం మరోసారి సమన్లు జారీ చేసింది. రైల్వే ఉద్యోగాల భర్తీకి సంబంధించిన కుంభకోణంలో విచారణకుగాను జనవరి 5న హాజరు కావాలని ఆదేశించింది. మరోవైపు విదేశాలకు వెళ్లాలని ఉందంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు స్వీకరించింది. వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 18 వరకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వెళ్లేందుకు ఉపముఖ్యమంత్రి కోర్టును ఆశ్రయించారు. ఇంతకు ముందు ఇదే కేసులో ఈ నెల 27న మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు తేజస్వీ యాదవ్‌కు ఈడీ నోటీసులు జారీ చేసినా ఆయన హాజరుకాలేదు. ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్, బీహార్ మాజీ సీఎం రబ్రీ దేవి, బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్, ఆర్జేడీ ఎంపీ మిసా భారతికి ఈ కేసులో ఉపశమనం లభించింది. ఉద్యోగాల కోసం భూ కుంభకోణం కేసులో ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు నలుగురికి బెయిల్ మంజూరు చేసింది. 2004లో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో రైల్వే బోర్డు ఐఆర్‌సీటీసీకి రైల్వే క్యాటరింగ్, రైల్వే హోటల్స్ సేవలను అప్పగించింది. రాంచీ, పూరీకి చెందిన హోటల్స్ నిర్వహణ, అభివృద్ధి కోసం జారీ చేసిన టెండర్‌లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. టెండర్ దక్కించుకున్న హోటల్ యాజమాన్యం లాలూ కుటుంబానికి పాట్నాలో మూడెకరాల భూమిని ఇచ్చినట్టు ఆరోపణలు ఉండగా.. ఈ కేసులో లాలూ రబ్రీ దేవి, తేజస్వీ యాదవ్ సహా పలువురిని నిందితులుగా చేర్చారు.

ఉగ్రవాదులకు, వేర్పాటువాదులకు చోటు ఇవ్వకూడదు : జై శంకర్

గాంధీనగర్ : అరికాలోని స్వామినారాయణ్ దేవాలయ గోడలపై రాసిన విద్వేష రాతలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖామంత్రి ఎస్. జైశంకర్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'స్వామి నారాయణ్ దేవాలయ గోడలపై ఖలిస్తానీ అనుకూల నినాదాలతో గ్రాఫిటీని నేను చూశాను. తీవ్రవాదులు వేర్పాటువాదుల వంటి శక్తులకు చోటు ఇవ్వకూడదు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు చేయాలని ఫిర్యాదు చేశాం. ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అమెరికా అధికారులకు విజ్ఞప్తి చేశాం.' అని ఆయన అన్నారు. కాగా, నెవార్క్‌లోని స్వామి నారాయణ ఆలయ గోడలపై ఖలిస్తానీ అనుకూల నినాదాలతోపాటు ప్రధాని మోడీ వ్యతిరేకంగా గ్రాఫిటీ చేసినట్లు హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఎక్స్‌లో పోస్టు చేసింది. గుడి గోడలపై ఖలిస్తానీ ఉగ్రవాది జర్నైల్ సింగ్ బింద్రాన్‌వాలే పేరు రాశారు. ఈ రాతలు భక్తులను భయాందోళనకు గురిచేస్తాయి. ఇది విద్వేషాలను రెచ్చగొట్టే చర్యల కిందకే వస్తుంది. ఈ రాతలపై పోలీసులు దర్యాప్తుల చేయాలని హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఎక్స్‌లో కోరింది.

ఎస్ఈబీసీ కాదు.. ఈడబ్ల్యూఎస్ కేటగిరి

- మరాఠాల విషయంలో బాంబే హైకోర్టు



ముంబయి : ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న మరాఠాలకు సంబంధించిన రిజర్వేషన్ కేటగిరిపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 2019లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఎస్ఈబీసీ) కేటగిరీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న మరాఠా అభ్యర్థులను ఆర్థికంగా వెనుకబడిన విభాగం (ఈడబ్ల్యూఎస్) కింద పరిగణింపబడతారని స్పష్టం చేసింది. ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బాంబే హైకోర్టు సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన మహారాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఫిబ్రవరి ఉత్తర్వును న్యాయమూర్తులు జస్టిస్ నితిన్ జామ్దార్, జస్టిస్ మంజూషా దేశ్‌పాండేలతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సబ్-ఇన్‌స్పెక్టర్, ట్యాక్స్ అసిస్టెంట్, క్లర్క్-టైపిస్ట్ పోస్టులతో పాటు అటవీ శాఖ, ఇంజినీరింగ్ సర్వీసెస్‌కు సంబంధించి 100 మందికి పైగా అభ్యర్థులు సవాలు చేయటంతో హైకోర్టు తీర్పు వచ్చింది. 2021లో సుప్రీంకోర్టు మరాఠా కోటాను కొట్టివేసిన తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం ఆ సమయంలో కొనసాగుతున్న రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు ఆర్థికంగా బలహీనమైన విభాగం కోటాను పొడిగించింది.

సిరిసిల్ల రైలుమార్గం పనుల్లో జాప్యం

భూసేకరణలో అడ్డంకులు

- నేతలు దృష్టి పెడితే రైలు కూతకు మోక్షం
- కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గంపై జిల్లా వాసుల ఆశలు



నవతెలంగాణ - సిరిసిల్ల

వస్త్రోత్పత్తి రంగంలో రెండో సోలాపూర్‌గా పేరొంది.. జిల్లా కేంద్రంగా అభివృద్ధి పథంవైపు పయనిస్తున్న సిరిసిల్లతోపాటు దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం ఉన్న వేములవాడకు రైలు మార్గం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత ప్రజలు రైలు కూత కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తపల్లి -మనోహరాబాద్ మార్గం పూర్తయితే రైలు కూత వినపడనుంది. పనులు సాధ్యమైనంత తొందరగా చేయాలని అధికారులు భావిస్తున్నప్పటికీ భూసేకరణలో అడ్డంకులు జాప్యానికి కారణమవుతున్నాయి. దీనిపై నేతలు దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

దశాబ్ద కాలం నుంచి ఎదురు చూపులే..

రాజన్నసిరిసిల్ల జిల్లాను కలుపుతూ 151.36 కిలోమీటర్ల పొడవున కొత్తపల్లి -మనోహరాబాద్ రైలు మార్గం ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం నుంచి ప్రతిపాదన ఉన్నప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. ఈ రైలు మార్గాన్ని రూ.1160.47కోట్ల అంచనాతో 2020-21నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ మార్గానికి కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ రైలు మార్గానికి అవసరమైన భూసేకరణ, దానికి అయ్యే వ్యయం అంతా భరించాలని రైల్వే శాఖ గత రాష్ట్ర ప్రభుత్వానికి షరతు విధించడంతోపాటు నిర్మాణ పనుల్లో మూడోవంతు భరించాలని నిబంధన పెట్టింది. కేంద్రం షరతులకు గత ప్రభుత్వం అంగీకరించడంతో రైలు మార్గం సర్వే పనులు మొదలుపెట్టారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో రైలు మార్గం సర్వే పనులు పూర్తికాగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూ యజమానుల అడ్డంకులతో సర్వే పనుల్లో జాప్యం జరిగింది. జిల్లాలో 17 రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 950 ఎకరాల వరకు రైల్వే లైన్ నిర్మాణం కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. ఇందులో 12 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. జిల్లాలో దాదాపు 60కిలోమీటర్ల పొడవు రైలు మార్గం రానుంది. విస్తీర్ణపరంగా జిల్లాలో 50శాతం మాత్రమే రైల్వే లైన్ నిర్మాణం కోసం భూ సర్వే పూర్తయిందని తెలుస్తోంది.

అడ్డంకులు తొలగితేనే పనుల్లో వేగం

రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న అడ్డంకులు తొలగితేనే పనుల్లో వేగం పెరగనుంది. భూసేకరణ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించాల్సి ఉంది. సిరిసిల్ల జిల్లాలో 950ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. అధికారులు సర్వే చేసినా సమస్యను ఆయా ప్రాంతాల రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉంటుంది. వేములవాడ సిరిసిల్ల ప్రాంతాల్లో కొన్నిచోట్ల సర్వే పనులను భూయజమానులు అడ్డుకోవడంతో అధికారులు నిలిపివేశారు. ఈ ప్రాంతాల్లో భూములు కోల్పోయే రైతులతో రెవెన్యూ యంత్రాంగం మాట్లాడి సమస్య పరిష్కరిస్తే సర్వే పనుల్లో వేగం పుంజుకుంటుంది. రైలు మార్గం పూర్తయితే మెదక్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన సిరిసిల్ల నుంచి వస్త్ర ఉత్పత్తి ఎగుమతులు, దిగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది. పరోక్షంగా కార్మికులకు లాభం కలగనుంది. హైదరాబాదుకు రాకపోకలు పెరిగి వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందడానికి దోహదపడనుంది.

వయసు శరీరానికే కానీ, మనసుకు కాదని నమ్ముతూ.. ఏడుపదుల వయసులోనూ అలసిపోకుండా పరుగు తీస్తోంది. నిండైన ఆత్మవిశ్వాసంతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధిస్తుంది. పరుగు తీసిన ప్రతిచోట పతకం ఖాయం చేసుకుంటుంది. 30 ఏండ్లకే ఏమీ సాధించలేకపోయామని నిరాశ... నిస్పృహలకు గురయ్యే యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమే వెటరన్ అథ్లెట్ **టమాటా రామానుజమ్మ**. మలేషియాలో జరిగిన పోటీల్లో 70ఏండ్ల వయసులోనూ పరుగు తీసి రజత పతకం సాధించింది. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ గౌరవాన్ని సమున్నత స్థానంలో నిలుపుతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని దేశం తరఫున మలేషియా వెళ్లేందుకు ఎంపికైంది.

ఏడుపదుల వయసులోనూ ఆగని పరుగు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ రామానుజమ్మ. రెండున్నర శత దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలతో పాటు అంతర్జాతీయ వేదికలపై పరుగు తీస్తూ ప్రతిభ కనబరుస్తోంది. మాస్టర్ అథ్లెట్‌గా పేరు పొందిన ఆమె 100కుపైగా పతకాలు సాధించింది. పరుగు పందెంతోపాటు యోగా, కరాటేలోనూ ప్రతిభ కనబరుస్తోంది.

క్రీడల పట్ల ఆసక్తితో...

పదవ తరగతి వరకు చదువుకున్న రామానుజమ్మ 10ఏండ్ల ప్రాయం నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకుంది. భర్త భూషయ్య సహకారంతో మొదటి సారి 1995లో మాస్టర్ అథ్లెట్‌గా పరుగు పందెంలో పాల్గొంది. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పరుగుపై ఆసక్తి పెంచుకొని మహిళలోకానికి ఆదర్శంగా నిలిచింది. 1996లో కరీంనగర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ వెటరన్ అసోసియేషన్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది. ప్రస్తుతం 70 ఏండ్ల నిండిన ఆమె ఇప్పటివరకు పరుగు పందెం, జావలిన్ త్రో, షాట్ పుట్ క్రీడల్లో 60 బంగారు పతకాలు, 44 వెండి పతకాలతో పాటు మరెన్నో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలను అందుకుంది. హర్యానాలో

సమాజ సేవలోనూ

క్రీడల్లోనే కాదు సమాజసేవలోనూ ముందు భాగంలో ఉంటానంటుంది. రామానుజమ్మ తన కండ్లతో పాటు దేహాన్ని సైతం మరణానంతరం కరీంనగర్లోని చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థకు మెన్స్ క్లబ్ ద్వారా దానం చేసేందుకు ముందుకు వచ్చింది. దేహాన్ని ఆసుపత్రికి అందించేందుకు అంగీకార పత్రాన్ని ఇచ్చింది. 70 ఏండ్ల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా ఆమె అందర్నీ పలకరిస్తూ సాగిపోతున్నది.

పరుగుల రాణి..

1997లో ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరిగిన ఏపీ వెయిటర్ అమెచ్యూర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొని వంద మీటర్ల రిలే పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. 1998లో ఏలూరులో జరిగిన పోటీల్లో పసిడి పతకం సాధించింది. 1999లో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఏపీ రాష్ట్ర వెటరన్ అమెచ్యూర్ అథ్లెటిక్ మీట్‌లో స్వర్ణం సాధించింది. 2000లో హైదరాబాదులో జరిగిన ఓపెన్ వెటరన్ అథ్లెటిక్ మీట్‌లో, 2001 వరంగల్ జిల్లా కాజీపేటలో జరిగిన పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో పసిడి పతకం సాధించింది. 2004-05 హైదరాబాద్, చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2007 జనవరిలో వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం సాధించిన ఆమె 2012 డిసెంబర్లో విశాఖపట్నంలో జరిగిన పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది.



స్వర్ణం దూరం చేసింది

నాకు చిన్ననాటి నుండి ఆటలపై ఉన్న ఆసక్తితో పోటీల్లో పాల్గొంటున్నాను. అందుకే పోటీలు ఎక్కడున్నా పట్టుబడి మరీ వెళ్తాను. పాస్పోర్టులో నా వయసు 50గా నమోదయింది. దీంతో నా వయసు 70 అయినా 50 ఏండ్ల వాళ్లతో పోటీపడి పరుగు తీయాల్సి వచ్చింది. దీంతో నాకు మూడో స్థానంలో రజతం వచ్చింది. 70 ఏండ్ల వాళ్లతో పోటీ పెడితే బంగారు పతకం సాధించేదాన్ని. చిన్న పొరపాటు నాకు స్వర్ణాన్ని దూరం చేసింది. అయినా అంత దూరం వెళ్లి పతకం సాధించడం మరచిపోలేని అనుభూతి. త్వరలో ఈనెల 30న రాష్ట్రస్థాయి మీట్ అథ్లెటిక్‌లో పాల్గొంటున్నాను.

- దాసరి శిరీష,
సిరిసిల్ల రూరల్

మానసిక ఆరోగ్యానికి...

పతి ఒక్కరూ శారీరక ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకుంటారు కానీ మానసిక ఆరోగ్యం గురించి పట్టించుకోరు. దీనివల్ల చిన్న విషయానికి కూడా ప్రతిసారి టెన్షన్‌కు గురవుతారు. మానసిక ఆరోగ్యం బాగుండాలంటే మంచి దినచర్యను పాటించాలి. దీనివల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతాం. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. ఇందుకోసం ఎలాంటి అలవాట్లు పాటించాలో ఈ రోజు తెలుసుకుందాం.

తగినంత నిద్ర : మంచి నిద్ర మనసుకు చాలా విశ్రాంతినిస్తుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం సరైన సమయంలో నిద్రపోవడం సరైన సమయంలో మేల్కొనడం మానసిక ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. కాబట్టి నిర్ణీత సమయంలో నిద్రపోవడాన్ని అలవాటు చేసుకోవాలి. 6 నుంచి 8 గంటల పాటు నిరంతరాయంగా నిద్రపోయేలా చూసుకోవాలి. మీ మనసు ఎంత రిలాక్స్‌గా ఉంటే అంత మెరుగ్గా పని చేస్తుంది. ఇది మీ ఏకాగ్రతను పెంచుతుంది. దీనివల్ల మీరు బాగా పని చేస్తారు.



రోజూ వ్యాయామం: రోజువారీ వ్యాయామాలు మిమ్మల్ని మానసికంగా దృఢంగా ఉంచుతాయి. రోజూ 15 నుంచి 30 నిమిషాల పాటు నడవడం లేదా వ్యాయామం చేయడం వల్ల మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వ్యాయామం చేసినప్పుడు శరీరంలో హ్యాపీ హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మిమ్మల్ని ప్రశాంతంగా ఆరోగ్యంగా చేస్తాయి.

సమతుల్య ఆహారం: ప్రశాంతమైన మనసు కోసం ఆరోగ్యకరమైన ఆహారం అవసరమని వైద్యులు చెబుతున్నారు. మంచి ఆహారం మనసుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని ఎన్నో పరిశోధనలు రుజువు చేశాయి. అందువల్ల ప్రతిరోజు మసతుల్య ఆహారం తినడం అలవాటు చేసుకోవాలి. తద్వారా మనసు ప్రశాంతంగా టెన్షన్ లేకుండా ఉంటుంది.

డ్రగ్స్‌కు దూరంగా: వైద్యుల ప్రకారం ఏ రకమైన డ్రగ్స్ అలవాటు అయినా మానసిక ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తుంది. కాబట్టి మనం అలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

సామాజిక సంబంధాలు: మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులతో మీరు ఎంత బాగా కనెక్ట్ అయి ఉంటే మీ మానసిక ఆరోగ్యం అంత మెరుగ్గా ఉంటుంది. అందువల్ల నిత్యం ప్రజలతో మాట్లాడాలి. మీ అభిప్రాయాలను పంచుకోవాలి. దీనివల్ల మీ మనసు తేలికపడుతుంది. మీకూ ప్రశాంతత లభిస్తుంది.

కాఫీ మరకలు వదిలేలా..



దుస్తుల మీద కాఫీ, టీ మరకలు పడినపుడు త్వరగా వదిలవు. అలాంటి సమయంలో ఇంట్లో అందుబాటులో ఉండే వస్తువుల ద్వారా వాటిని తొలిగించుకోవచ్చు. అదెలాగంటే....

- కాఫీ పడిన వెంటనే నీళ్లు చల్లితే మరక పెద్దదవుతుంది. అలా కాకుండా టిష్యూ పేపర్ని లేదా దూది ఉండల్ని ఆ మరకలపై ఉంచితే చాలా వరకు అవి పీల్చేస్తాయి. కొద్ది సమయం తర్వాత దుస్తులను ఉతికితే సరి.. మరకలు అంతగా ఏర్పడవు.
- అందుబాటులో ఉండే లిక్విడ్ డిటర్జెంట్‌లు అందుబాటులో ఉంటే కొంచెం వేలితో తీసుకుని మరక పడిన చోట రాయాలి. పావుగంటయ్యాక ఆ ప్రాంతంలో మాత్రమే రుద్ది ఉతికితే సరిపోతుంది.
- తెల్లని దుస్తుల మీద మరక మరీ ఇబ్బందిగా కనిపిస్తుందనుకుంటే.. గుడ్డులోని తెల్లసొన తీసుకుని దానికి కాసిని వేడి నీరు కలిపి ఈ మిశ్రమంలో స్పాంజిని ముంచి మరక మీద రుద్దాలి. తర్వాత నీళ్ళు పంపు కింద ఉంచితే సరిపోతుంది.
- వెనిగకర్ లో చల్లటి నీళ్ల కలిపి అందులో మరకలు పడిన దుస్తుల్ని నానబెట్టాలి. అరగంటయ్యాక సబ్బుతో ఉతికితే మరక త్వరగా పోతుంది.

ఊర్లు విషమయం...

(మొదటిపేజీ తరువాయి)

చిత్తనూరు ప్రధాన రహదారి గుండా వెళ్తుంటే కంపెనీ కాలుష్యానికి ముక్కు పుటాలు అదిరిపోతాయి. మన్నెవాగుతో పాటు సమీప చెరువులన్నీ విష జలాశయాలుగా మారాయి. ఈ కంపెనీ నుంచి వచ్చిన కాలుష్యం వల్ల మనుషులే కాదు,మూగ జీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి. మిషన్‌బగీరథ నీరు సైతం విషంగా మారుతోంది.

గ్రామాలకు కూలీలు ఎవ్వరూ... రావడం లేదు

ముఖ్యంగా చిత్తనూరు గ్రామంలో పొలం పనుల కోసం సమీప జిన్నారం, ఎక్లాస్‌పూర్ గ్రామాల నుండి ప్రతి రోజు రెండు వేల మందికి ఉపాధి లభించేది. ఇప్పుడు ఈ గ్రామం మొత్తం జల,వాయు కాలుష్యంగా మారింది. గ్రామస్తులు రోగాల బారిన పడటంతో ఈ గ్రామాలకు కూలీలు రావడం లేదు. దీంతో పొలం పనులు కుంటుబడుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకపోగా తమ ప్రాణాలు హరిస్తున్న ఇథనాల్ కంపెనీని ఇక్కడి నుంచి తరలించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు

అనర్థాలు అనేకం

ఇథనాల్ కంపెనీ వల్ల ప్రతి రోజూ 450 టన్నుల బొగ్గు పులుసు గాలిలో, నీటిలో కలుస్తోంది. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యకారక రసాయనాలను మన్నెవాగులో కలుపుతున్నారు. నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. మూగ జీవాలు, పశువులు మృత్యువాతపడుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. అస్తమా, చర్మ వ్యాధి, కంటి చూపు, కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులకు ప్రమాదం వాటిల్లుతోంది. ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేస్తే.. మాబతుకులు బాగు పడుతాయని అనుకున్నాం.కాని మా బతుకులు ఆగం అవుతాయని అనుకోలేదు.ముఖ్యంగా మ పశువులు, కోళ్లు, గొర్రెలకు సైతం గడ్డుకాలం వచ్చింది. విషం జిమ్మె కంపెనీపై చర్యలు తీసుకోవాలి. లేనిచో మాకు ప్రత్యమ్నాం చూపాలని పలువురు గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు.

28 నుంచి మరో రెండు గ్యారెంటీలు

(మొదటిపేజీ తరువాయి)

తీరిన విషయం తెలిసిందే. దీంతోపాటు ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్న వాగ్దానంపై సర్కారు దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలన, పెండింగ్ పనులు, ఆర్థిక వనరులు తదితర కీలకాంశాలపై కలెక్టర్లు శ్వేతపత్రాలు సిద్ధం చేసినట్టు తెలిసింది. వాటిని సీఎం రేవంత్‌కు ఆదివారం నాటి సమావేశంలో వారు అందించనున్నారు. ధరణిపై సమగ్రంగా చర్చించిన తర్వాత ప్రభుత్వం నియమ, నిబంధనలు రూపొందించనున్నట్టు తెలిసింది. వీటన్నింటితోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకం కింద రూ. 10 లక్షలు అమలు తీరును కలెక్టర్లు రేవంత్‌కు వివరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే పథకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

హైకోర్టు కొత్త భవన నిర్మాణానికి ఏర్పాట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైకోర్టు నూతన భవన నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేస్తున్నామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారంనాడాయన రాజేంద్రనగర్ మండలంలో హైకోర్టు భవనానికి కేటాయించిన వంద ఎకరాల స్థలాన్ని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆయన వెంట ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్ కుమార్ షావిలీ, జస్టిస్ టి వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేనారెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కావల్సిన మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. తమ ప్రభుత్వం దీనిపై తక్షణం స్పందించి, ఏర్పాట్లు పూర్తిచేస్తున్నదనీ, జనవరిలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి దీనికి శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయితీరాజ్ కార్యదర్శి, ఎమ్ రఘునందన్‌రావు, న్యాయశాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హెూళికెరి తదితరులు పాల్గొన్నారు.

సంఘ్ సన్నిహితులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు !

న్యూఢిల్లీ : సంఘ్ పరివార్‌కు సన్నిహితంగా ఉండే అభ్యర్థులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కట్టబెట్టేందుకు వీలుగా ఢిల్లీ యూనివర్సిటీలో నియామక ప్రక్రియ చేపట్టిందని పలు విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, పలువురు ఎంపీలు ఆరోపించారు. ఢిల్లీ వర్సిటీ సహా ప్రభుత్వ యూనివర్సిటీలలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో వారంతా దేశ రాజధానిలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశమయ్యారు. వివిధ కేంద్ర విశ్వవిద్యాలయాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్ఎస్ఎస్‌కు సన్నిహితంగా ఉండే వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేర్చుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో నియామక ప్రక్రియనే పక్కదారి పట్టిస్తున్నారని ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జకీర్ హుస్సేన్ కళాశాలలో 12 సంవత్సరాలు సేవలు అందించిన ప్రముఖ దళిత ఉపాధ్యాయుడు లక్ష్మణ్ కుమార్‌ను ఇటీవలే తొలగించారని వారు గుర్తు చేశారు.

యూనివర్సిటీలోని హిందీ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న అపూర్వానంద్ విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీని నియంత్రించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశారు. సిలబస్ రూపకల్పనలో ఆయా విభాగాల నుండి సూచనలు తీసుకునే వారే లేరని చెప్పారు. దశాబ్దాల తరబడి విద్యాబోధన చేస్తున్న వందలాది మంది అధ్యాపకులను తొలగిస్తున్నారని, ఇంటర్వ్యూలో వారిని అనర్హులుగా ప్రకటిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ యూనివర్సిటీలు ప్రమాణాలు పాటించని పక్షంలో బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు నష్టపోతారని అన్నారు.

నియామకాలలో పారదర్శకతే లేకుండా పోతోందని జేఎన్‌యూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు డీకే లోబియాల్ మండిపడ్డారు. యూనివర్సిటీలలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలు ప్రవేశపెట్టడంతో విద్యా వ్యవస్థ పైన దాడి మొదలైందని ఢిల్లీ వర్సిటీ అధ్యాపక సంఘం మాజీ అధ్యక్షురాలు నందితా నారాయణ్ చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు జరుపుతున్న ఆందోళన నుండి విద్యను వేరు చేయరాదని డీఎంకేకు చెందిన ఎంపీ విల్సన్ అభిప్రాయపడ్డారు.

కేయూలో ర్యాగింగ్!

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి వెళ్లింది. క్యాంపస్‌లోని ఆడిటోరియం వద్దకు ఇటీవల జూనియర్లను రప్పించి పరిచయం పేరిట వేధించారని ఆరోపణలున్నాయి. బాధిత విద్యార్థినులు 30 మంది వరకు ఉంటారని తెలుస్తోంది. కామర్స్ విభాగం ఘటన వెలుగులోకి రావడంతో జువాలజీ జూనియర్లు తమను వేధించిన విషయాన్ని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీనియర్లు, జూనియర్లను ప్రొఫెసర్ వై.వెంకయ్య, ఇతర అధ్యాపకుల సమక్షంలో విచారణ జరిపారు. రైలులో పల్లీలు ఎలా అమ్ముతారో చూపాలని, పాటలు పాడాలని తమను వేధించారని జూనియర్లు తెలిపినట్టు సమాచారం. కాగా.. తాము ఫ్రెండ్లీగా వ్యవహరించామని, ర్యాగింగ్‌కు పాల్పడలేదని సీనియర్లు చెప్పినట్టు తెలిసింది. విచారణ అనంతరం విషయాన్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 81 మందికిపైగానే సీనియర్లు ఉంటారని, వారిని హాస్టల్ నుంచి వారం రోజులపాటు సస్పెండ్ చేసినట్టు హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్య తెలిపారు. మరో విభాగానికి చెందిన సీనియర్లు కూడా జూనియర్లను ర్యాగింగ్ చేసినట్టు ప్రాథమికంగా డైరెక్టర్ దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

పత్తాలేని యాంటీ ర్యాగింగ్ కమిటీలు

యూనివర్సిటీలో రెండు మూడేండ్లుగా యాంటీ ర్యాగింగ్ కమిటీలను నియమించడం లేదు. గతంలో యూనివర్సిటీలోని కాలేజీలతోపాటు, విభాగాల వారీగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఉండేవి. ఈ కమిటీలు విస్తృతంగా ప్రచారం చేసేవి. ఇప్పుడు ఎలాంటి కమిటీలూ లేకపోవడంతో సీనియర్లలో భయం లేకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా మహిళా హాస్టల్లో ర్యాగింగ్ కొద్ది రోజులుగా జరుగుతుందని తెలుస్తోంది.

క్యాబ్ డ్రైవర్లకు టీహబ్ ద్వారా ప్రత్యేక యాప్

(మొదటిపేజీ తరువాయి)

హామీనిచ్చారు. వివిధ తరగతులకు సామాజిక రక్షణ కల్పించడంలో తమ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని చెప్పారు. అసంఘటిత కార్మికుల ఉపాధి, సామాజిక భద్రతకు చర్యలు తీసుకుంటామంటూ తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ఇచ్చారు.. ఆ క్రమంలో విధాన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం రాజస్థాన్‌లో చేసిన చట్టాన్ని అధ్యయనం చేసి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో సమర్థవంతమైన చట్టాన్ని ప్రవేశపెడతామని హామీనిచ్చారు.



సంస్థలు కూడా కేవలం లాభాపేక్షగా మాత్రమే పని చేయకుండా, కార్మికులు, ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారించాలి. గిగ్ అండ్ టేక్ పాలసీని పాటించని ఎంత పెద్ద సంస్థలపైనైనా చర్యలు తీసుకోవడానికి వెనుకాబోం. నాలుగు నెలల క్రితం స్విగ్గి బాయ్ కుక్క తరిమితే భవనంపై నుంచి పడి మృతి చెందాడు. అప్పట్లో ప్రభుత్వం వైపు నుంచి ఏదైనా సాయం అందిస్తారని చూశా.. కానీ ప్రభుత్వం అతడి కుటుంబాన్ని పట్టించుకోలేదు. ఇలాంటి సంఘటనలు జరిగిన సమయంలో ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలి. అందుకే ఆ కుటుంబం వివరాలు సేకరించి సీఎం సహాయనిధి నుంచి రూ. 2 లక్షలు అందించాని అధికారులకు ఆదేశిస్తున్నా...' అని సీఎం తెలిపారు.

ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కింద గ్రామసభలు నిర్వహిస్తున్నామనీ, అక్కడ క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలవరీ బాయ్‌లు, ఆటో డ్రైవర్లు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో ప్రభుత్వానికి విన్నవించుకోవచ్చని సీఎం ఈ సందర్భంగా సూచించారు. డిజిటల్, మాన్యువల్ ఏ రూపంలోనైనా వాటిని సమర్పించొచ్చని తెలిపారు. ప్రతీ నాలుగు నెలలకొకసారి గ్రామ సభలు నిర్వహిస్తామనీ, ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఏఐసీసీ సెక్రెటరీలు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీఖాన్, మాధుయాష్కీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తదితర నేతలు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆస్పత్రిలో భారీ అగ్ని ప్రమాదం

ఫ్లెట్, పక్కనే ఉన్న హెూర్డింగులు కాలిపోయాయి. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు.

టెర్రస్‌పై షార్ట్ సర్క్యూట్ : యాజమాన్యం

అంకుర ఆస్పత్రి టెర్రస్‌పైనే షార్ట్ సర్క్యూట్ జరిగిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. విషయం తెలిసిన వెంటనే ఫైర్ డిపార్టుమెంట్ వారికి సమాచారం అందించడంతో వారు వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారని తెలిపింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని.. హాస్పిటల్ సిబ్బంది, రోగులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొంది.

ముగిసిన రాష్ట్రపతి శీతాకాలం విడిది

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాలం విడిది ముగిసింది. హైదరాబాద్‌లో శీతాకాల విడిది కోసం ఈ నెల 18వ తేదీన భారత వాయుసేన ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి.. పర్యటన శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి శనివారం ఉదయం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని హకీంపేట విమానాశ్రయం నుంచి భారత వాయుసేన ప్రత్యేక విమానంలో దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లారు. విమానాశ్రయంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, త్రివిధ దళాలకు చెందిన అధికారులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు.

మిమిక్రీ నేరమా?

(మొదటిపేజీ తరువాయి)

దయాళ్ సింగ్ నేతృత్వం వహిస్తారు. ఈ ఏజెన్సీయే పార్లమెంటు భద్రతా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. తన నేతృత్వంలోని సంస్థ వైఫల్యం పైనే సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ విచారణ జరపడాన్ని ప్రతిపక్ష ఎంపీలు తప్పుపడుతున్నారు. అయినా ఈ అనుమానాలను కేంద్రం పట్టించుకోవడం లేదు. బెనర్జీ మిమిక్రీ ఉదంతానికి కులం రంగు పూనేందుకు సైతం బీజేపీ నేతలు విశ్వప్రయత్నం చేశారు. ఇది జాట్లకు అవమానకరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సెలవిచ్చారు. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఘాటుగానే స్పందించారు. 'సభలో నన్ను అధికార పార్టీ ఎంపీలు మాట్లాడనివ్వలేదు. నేను దళితుడిని అయినందుకే వారు అలా ప్రవర్తించారని నిందించవచ్చు కదా' అని అడిగారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన ప్రశ్నల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఇలా చేస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. భద్రతా వైఫల్యం, అసాధారణ రీతిలో ప్రతిపక్ష ఎంపీల మూకుమ్మడి సస్పెన్షన్ కంటే బెనర్జీ మిమిక్రీ ముఖ్యమైన విషయమా అని ప్రశ్నించారు.

ఏదేమైనా ప్రాధాన్యత కలిగిన అంశాలపై సభలో చర్చ జరగకుండా చేయడంలో బీజేపీ విజయం సాధించింది. మోడీ హయాంలో హాస్యాన్ని, చతురతను పట్టించుకునే పరిస్థితి లేదు. వ్యంగ్య చిత్రాలు గీసిన అనేక మంది కార్టూనిస్టులను అరెస్ట్ చేశారు. మోడీని అనుకరించి మిమిక్రీ చేసిన శ్యామ్ రంగీలాపై అక్రమ కేసులు పెట్టారు.

27న హైదరాబాద్‌కు ఉపరాష్ట్రపతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 27వ తేదీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ హైదరాబాద్ రానున్నారు. ఆయన పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. దీనిపై శనివారంనాడామె సమన్వయ సమావేశం నిర్వహించారు. తొలిసారిగా ఉప రాష్ట్రపతి రాష్ట్రానికి వస్తున్నారనీ, దీనికి సంబంధించి పోలీసు బందోబస్తు, పోలీసు బ్యాండ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరోగ్య, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖలు సమన్వయంతో పని చేయాలనీ, ప్రముఖుల సందర్శన సజావుగా, ప్రభావవంతంగా జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ క్రిస్టినా జోంగ్తు, సెక్రటరీ ఆర్ అండ్ బీ శ్రీనివాస్‌రాజు, సీఎండీ టీఎస్ఎస్‌పీడీసీఎల్ ముష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రా దిశగా

•భారత్-ఆస్ట్రేలియా మహిళల టెస్ట్ •నేటి తొలి సెషన్ కీలకం





ముంబయి: వాంఖడే స్టేడియంలో జరుగుతున్న భారత్-ఆస్ట్రేలియా మహిళల ఏకైక టెస్ట్ డ్రా దిశగా పయనిస్తోంది. మూడోరోజైన శనివారం తొలి, రెండో సెషన్లలో భారత మహిళా బౌలర్లు విఫలం కాగా.. మూడో సెషన్‌లో రాణించారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు మూడోరోజు ఆట నిలిచే సమయానికి 5వికెట్ల నష్టానికి 233పరుగులు చేసింది. దీంతో ఆస్ట్రేలియా జట్టుకు 46పరుగుల ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్ స్కోర్ ఏడు వికెట్ల నష్టానికి 376పరుగులతో భారత మహిళల జట్టు మరో 30 పరుగులు మాత్రమే జోడించి చివరి మూడు వికెట్లు కోల్పోయింది. దీప్తి శర్మ 78 పరుగులవద్ద ఔట్ కాగా.. పూజా వస్త్రాకర్(47) అర్ధసెంచరీకి చేరువలో ఔటయ్యింది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులకు ఆలౌటైంది. అలాగే ఆస్ట్రేలియాపై 187పరుగుల ఆధిక్యాన్ని లభించింది. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డినర్‌కు నాలుగు, సదర్లాండ్, కిమ్ గ్రాత్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆరంభంలో ధాటిగానే ఆడింది. ఓపెనర్ బెత్ మూనీ (33), మరో ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ (18) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 49పరుగులు జోడించారు. ఈ క్రమంలో మూనీ రనౌట్ కావడంతో భారత్‌కు తొలి బ్రేక్ లభించింది. ఆ తర్వాత లిచ్‌ఫీల్డ్‌ను స్నేహ్ రాణా బౌల్డ్ చేసింది . దీంతో ఆస్ట్రేలియా 56 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఆసీస్‌ను ఎలీస్ పెర్రీ(45), మెక్‌గ్రాత్(73) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. ఈ ఇరువురూ మూడో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. మూడో సెషన్ దాకా ఈ జోడీ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. టీ విరామానికి ముందు పెర్రీని స్నేహ్ రాణా పెవిలియన్ చేర్చడంతో మెక్‌గ్రాత్.. కెప్టెన్ అలిస్సా హీలి(32)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. టీ విరామం తర్వాత ఆసీస్ రెండు వికెట్లు కోల్పోయింది. ఆ రెండు వికెట్లు భారత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ సాధించింది. 71వ ఓవర్లో ఐదో బంతికి మెక్‌గ్రాత్‌ను బౌల్డ్ చేసిన కౌర్.. 79వ ఓవర్లో హీలిని వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆసీస్ ఐదో వికెట్ కోల్పోయింది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి సదర్లాండ్ (12), గార్డ్‌నర్(7) క్రీజులో ఉన్నారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ ఐదు వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసింది.

ప్రస్తుతం ఆసీస్.. 46 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉంది. నాలుగో రోజు ఉదయం సెషన్‌లో ఆసీస్‌ను ఆలౌట్ చేస్తే.. భారత్‌కు గెలుపు చేరువైనట్లే.

స్కోర్‌బోర్డు

ఆస్ట్రేలియా మహిళల తొలి ఇన్నింగ్స్: 219 , భారత్ మహిళల తొలి ఇన్నింగ్స్: 406

ఆస్ట్రేలియా మహిళల రెండో ఇన్నింగ్స్: మూనీ (రనౌట్) రీచా ఘోష్ 33, లిట్చ్‌ఫీల్డ్ (బి)స్నేహ్ రాణా 18, ఎలీసా పెర్రీ (సి)యాస్టికా భాటియా (బి)స్నేహ్ రాణా 45, తహిల మెక్‌గ్రాత్ (బి)హర్మన్‌ప్రీత్ 73, ఎలీసా హీలీ (ఎల్‌బి)హర్మన్‌ప్రీత్ కౌర్ 32, సథర్లాండ్ (బ్యాటింగ్) 12, గార్డినర్ (బ్యాటింగ్) 7, అదనం 13. (90ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 233పరుగులు.

వికెట్ల పతనం: 1/49, 2/56, 3/140, 4/206, 5/221

బౌలింగ్: రేణుకా ఠాకూర్ 8-3-22-0, పూజ వస్త్రాకర్ 8-0-36-0, స్నేహ్ రాణా 17-3-54-2, దీప్తి శర్మ 19-5-30-0, రాజేశ్వరి గైక్వాడ్ 27-10-42-0, జెమిమా రోడ్రిగ్స్ 2-0-13-0, హర్మన్‌ప్రీత్ కౌర్ 9-0-23-2.

వచ్చే ఐపిఎల్ సీజన్‌కు హార్దిక్ దూరం?



ముంబయి: 2024 ఐపిఎల్ సీజన్‌కూ ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య దూరమయ్యాడు. రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలను ముంబయి ఫ్రాంచైజీ హార్దిక్ పాండ్యకు అప్పగించింది. గుజరాత్ టైటాన్స్ సారథిగా ఉన్న అతడిని తీసుకొచ్చి మరీ కెప్టెన్ అంటూ ప్రకటించేసింది. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో హార్దిక్ పాండ్య ఆడకపోవచ్చని సమాచారం. ఐసిసి వన్డే ప్రపంచ కప్‌లో గాయపడిన పాండ్య స్వదేశంలో ఆస్ట్రేలియాతో టి20 సిరీస్‌తోపాటు దక్షిణాఫ్రికా పర్యటనకూ దూరమయ్యాడు. కనీసం అఫ్గాన్‌తో టి20 సిరీస్‌కైనా జట్టులోకి వస్తాడని భావించినా ప్రయోజనం లేకపోయింది. గాయం తీవ్రత కారణంగా ఆఫ్ఘన్ సిరీస్‌తోపాటు 2024 ఐపిఎల్‌లోనూ ఆడటం కష్టమేనని తెలిసింది. వచ్చే ఏడాది టి20 ప్రపంచకప్ ఉన్న దృష్ట్యా అతడి విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి బిసిసిఐ ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఐపిఎల్‌లో పాండ్య గైర్హాజరుపై ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువరించలేదు.

టిటి ఛాంప్స్ హర్మీత్, బైస్యా

జాతీయ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్



పంఛకుల(హర్యానా): 85వ జాతీయ టేబుల్ టెన్నిస్(టిటి) ఛాంపియన్లుగా హర్మీత్ దేశాయ్, పొయ్యంటి బైస్యా నిలిచారు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో హర్మీత్ 10-12, 12-10, 14-16, 11-9, 11-8, 9-11, 11-8(4-3) సెట్ల తేడాతో జి. సాథియాన్‌ను చిత్తుచేశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో బైస్యా 10-12, 11-7, 11-6, 11-9, 8-11, 11-4తో 4వ సీడ్ అహికా ముఖర్జీని చిత్తుచేసి తొలిసారి జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. సెమీస్‌లో పొయ్యంటీ బైస్యా డిఫెండింగ్ ఛాంపియన్ ఆకుల శ్రీజపై సంచలన విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

నవచిత్రం

సంక్రాంతి కానుకగా రిలీజ్



ప్రియాంక అరుళ్ మోహన్, ధనుష్

ధనుష్ నటిస్తున్న పీరియడ్ ఫిల్మ్ కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ధనుష్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయ్యింది. ఫస్ట్ సింగిల్ 'కిల్లర్ కిల్లర్..' పాటకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

శనివారం మేకర్స్ 'కెప్టెన్ మిల్లర్' సెకండ్ సింగిల్ క్రీనీడలే పాటని విడుదల చేశారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ ఈ పాట కోసం హార్ట్ టచ్చింగ్ నెంబర్‌ని స్కోర్ చేశారు. రాకేందుమౌళి రాసిన లిరిక్స్ ఆకట్టుకున్నాయి. సింగర్ జావేద్ అలీ చాలా లైవ్లీగా అలపించారు. ఈ పాటలో ధనుష్, ప్రియాంకా అరుళ్ మోహన్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసిన విధానం చాలా ఎట్రాక్టివ్‌గా ఉంది. 1930-40 బ్యాక్ డ్రాప్‌లో హ్యూజ్ బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. శివ రాజ్ కుమార్, సందీప్ కిషన్ పవర్ ఫుల్ రోల్స్‌లో నటిస్తున్న ఈ పీరియడ్ ఫిల్మ్‌లో ప్రియాంకా అరుళ్ మోహన్ కథానాయిగా నటిస్తోంది. టి.జి. త్యాగరాజన్ సత్యజ్యోతి ఫిల్మ్స్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ సహ నిర్మాతలు. సంక్రాంతి కానుకగా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అరుణ్ మాథేశ్వరన్, నిర్మాతలు: జి. శరవణన్, సాయి సిద్ధార్థ్, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీవోపీ: సిద్ధార్థ నుని. ఎడిటింగ్: నాగూరన్, ఆర్ట్: టి.రామలింగం.

ఒకే పాత్రతో బంది



ఆదిత్య ఓం

సింగిల్ క్యారెక్టర్‌తో సినిమాను నడిపించడం అంటే మామూలు విషయం కాదు. ఇలాంటి ప్రయోగమే హీరో ఆదిత్య ఓం చేయబోతున్నారు. ఎప్పుడూ డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఆయన ఈసారి 'బంది'గా అందరినీ ఆకట్టుకునేందుకు రాబోతున్నారు.

గల్లీ సినిమా బ్యానర్ మీద ఈ మూవీని వెంకటేశ్వర రావు దగ్గు, తిరుమల రఘు నిర్మిస్తుండగా, తిరుమల రఘు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

'ఓ సగటు మనిషి కోరుకునేవి ఎలా ఉంటాయో ఈ ట్రైలర్‌లో చూపించారు. ఏ మనిషైనా తిండి, నీళ్ళు, డబ్బు, స్వాతంత్ర్యం కోరుకుంటారు. స్వేచ్ఛగా విహరించాలని అనుకుంటాడు. అలా కోరుకున్న ఓ వ్యక్తి జీవితంలో ఏర్పడిన ఘట్టాలనే బందిగా రూపొందించారు. ఈ ట్రైలర్‌లో అన్ని రకాల ఎమోషన్స్‌ను ఆదిత్య ఓం చూపించారు. చివరకు నగ్నంగా కనిపించే షాట్ మాత్రం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ చిత్రానికి వీరల్, లవన్, సుదేష్ సావంత్ సంగీతాన్ని అందించారు. మధుసూధన్ కోట సినిమాటోగ్రఫర్‌గా వ్యవహరించారు. దేశంలోని పలు అటవీ ప్రాంతాల్లో ఈ మూవీని చిత్రీకరించారు. ఆదిత్య ఓం ఎలాంటి డూప్ లేకుండా అన్ని రకాల స్టంట్స్ చేశారు. మూడేళ్ల కష్టపడి ఏడాదిలో ఉండే అన్ని రుతువుల్ని కవర్ చేస్తూ ఈ మూవీని చిత్రీకరించడం విశేషం. పర్యావరణ సంరక్షణ మీద తీసిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886